ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital

Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-5-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 111 పేజీలు: 10+4 వెల: 6.50



చర్చలు జరిగితే పికెకెపైనే: ప్రధాని మోడీ 3

ఇడి అన్ని హద్దులు దాటేసింది: సుప్రీం 5




## నేడు ఢిల్లీకి సిఎం

### రేపు నీతిఆయోగ్ సమావేశానికి హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే22:** శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లనున్నట్టుగా సమాచారం. 24వ తేదీన ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశానికి ఆయన హాజరుకానున్నట్టుగా తెలిసింది. తెలంగాణకు అవసరమైన నిధులపై ఇప్పటికే ప్రత్యేక నివేదికను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేయడంతో పాటు నీతి ఆయోగ్ సమావేశంలో చర్చించనున్న ఎజెండాను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి పంపించింది. నీతి ఆయోగ్ సమావేశం అనంతరం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను సిఎం రేవంత్‌రెడ్డి బృందం కలిసే అవకాశం ఉన్నట్టుగా తెలిసింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, అనుమతుల విషయంపై చర్చించడానికి రాష్ట్ర ప్రభుత్వం పలువురు కేంద్రమంత్రుల అపాయింట్‌మెంట్ కూడా కోరినట్లుగా తెలిసింది. దీంతోపాటు పిసిసి జంబో కార్యవర్గం రెండు, మూడురోజుల్లో ఏఐసిసి ప్రకటించనున్న నేపథ్యంలో దీనిపై అధిష్టానం పెద్దలతో సిఎం రేవంత్‌రెడ్డి చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ జూన్‌లో ప్రకటించే అవకాశం ఉండడంతో దానికి సంబంధించి కూడా ముఖ్యమంత్రి అధిష్టానంతో చర్చించనున్నట్టుగా సమాచారం.



## అంత ఇవ్వలేం

### మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణి సాధ్యం కాదంటూ చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం

**కేంద్రం ఆదేశాలు పాటించే అవకాశం లేదంటూ వివరణ**

**సన్నబియ్యం భారీగా సేకరించే పరిస్థితి లేదని కేంద్రానికి ప్రత్యుత్తరం**

**హైదరబాద్,మే 22,ప్రభాతవార్త:** వర్షాకాలంలో వరదలు, ప్రకృతి విపత్తులను దృష్టిలో ఉంచుకొని తిండిగింజల నిల్వ, రవాణా లో అంతరాయాలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రేషన్ పంపిణీలో విషయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు జారీ చేసిన కీలక ఆదేశాలను ఆచరించలేమని తెలంగాణ ప్రభుత్వం చేతులెత్తేసింది. సన్నబియ్యం నిల్వలు తక్కువగా ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం మూడు మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయలేమని సుణుగుతోన్నది. వర్షాకాలానికి ముందే మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం నిల్వలను పెట్టుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఇప్పటికిప్పుడు సమకూర్చలేమని, మరో నెల రోజుల గడువు కావాలని కేంద్రానికి లేఖ రాసింది. రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ నేపథ్యంలో మూడు మాసాల బియ్యాన్ని సమకూర్చుకునేందుకు >>2

## హైదరాబాద్‌కు 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు

**ఇ-అంబులెన్స్‌లు, ట్రక్కులకు నిధులు: కేంద్ర మంత్రి కుమారస్వామి**



**హైదరాబాద్, మే 22 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పర్యావరణ హితమైన ప్రజారవాణాను ప్రోత్స హించే కేంద్రం చర్యలు మొదలు పెట్టింది. అందులో భాగంగానే పిఎం ఈ-డ్రైవ్ పథకం కింద హైదరాబాద్ నగరానికి >>2



## నాన్నా! అలా చేస్తున్నారేమిటి?

### మాజీ సిఎం కెసిఆర్‌ను ప్రశ్నిస్తూ 6 పేజీల లేఖ రాసిన కుమార్తె ఎమ్మెల్సీ కవిత

- బిజెపిపై అంత మెతక వైఖరెందుకు?
- అధినేతను కలిసే అవకాశం లేకపోతోందని చాలామందిలో ఆవేదన
- వరంగల్ సభ విజయవంతమైనా ఉద్యమ నేతలకు ప్రాధాన్యత లేదని విమర్శ
- పాజిటివ్, నెగిటివ్ ఫీడ్‌బ్యాక్ అంటూ పలు విషయాలు ప్రస్తావించిన కవిత
- అమెరికా నుంచి నేడు తిరిగి రాక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే22:** తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామం చోటు చేసుకుంది. బిఆర్‌ఎస్ పార్టీలో కలకలం, కెసిఆర్ కుటుంబంలో విభేదాలు బయటపడ్డాయి. బీఆర్‌ఎస్ అధినేత,తన తండ్రి కేసీఆర్ తీరుపట్ల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధిక్కార స్వరం వినిపించారు. పార్టీ తీరుపై నేరుగా కేసీఆర్‌కే కవిత ప్రశ్నలుసంధించారు. అమెరికా పర్యటన ముగించుకుని తిరిగి హైదరాబాద్‌కు కవిత ప్రయాణం అవుతున్న సమయంలో అధినేత కేసీఆర్‌కు కవిత లేఖ రాసినట్లుగా 6 పేజీల లేఖ బయటకు వచ్చింది. గతంలో కవిత రాసిన లేఖల్లో ఉన్న దస్తూరితో ఈ లేఖలోని దస్తూరీ సరిపోలుతోంది. వరంగల్ బిఆర్‌ఎస్ సభ విజయవంతమైనందుకు కెసిఆర్‌కు అభినందనలు తెలుపుతూ రాసినలేఖలో పాజిటీవ్ ఫీడ్ బ్యాక్,నెగిటీవ్ ఫీడ్‌బ్యాక్ పేరిట8అంశాలను ప్రస్తావించారు. >>2



గురువారం రాజస్థాన్‌లో బికనీర్-ముంబయి రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

## 103 'అమృత్ స్టేషన్లు' ప్రారంభించిన ప్రధాని

### 2027 కల్లా 500 రైల్వేస్టేషన్ల ఆధునీకరణ: రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

**జైపూర్, మే 22:** అమృత్‌భారత్ స్టేషన్ స్కీం కింద 18 రాష్ట్రాల్లో అత్యాధునికంగా రూపొందించిన 103 అమృత్‌భారత్‌స్టేషన్లనుప్రధాని నరేంద్రమోడీ రాజస్థాన్‌నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. గురువారం లాంఛనంగా వీటిని జాతికి అంకితంచేస్తున్నట్లుప్రకటించారు. ప్రారంభోత్సవం తర్వాత పాఠశాల విద్యార్థులతో ప్రధాని ముచ్చటించారు. యూపీలో 19, గుజరాత్‌లో 18, మహారాష్ట్రలో 15, రాజస్థాన్‌లో 8 అమృత్‌భారత్‌స్టేషన్లను ప్రారంభించారు. అమృత్‌భారత్‌స్టేషన్ స్కీం కింద >>2




# చిల్లిగవ్వలేదంటూ అందాల పోటీలా?

## ఇంత దుబారా ఎందుకో: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే22:** కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన వాస్తవాలు నిలకడగా వెలుగులోకి వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీ రామారావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే కాళేశ్వరంపై అనవసర రాద్ధాంతం చేస్తోందని ఆయన ఆరోపించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఒక బ్యారేజీలో రెండు చోట్ల పగుళ్లు కనిపిస్తే, ఏదో పెను ప్రమాదం జరిగిపోయినట్లుగా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. ఘోష్ కమిటీ విచారణ పూర్తయిందని ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు కొత్తగా నోటీసులు జారీ చేయడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం ప్రజల దృష్టిని మళ్లించే వ్యూహంలో భాగమేనని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారశైలి ఒక అపరిచితుడిలా ఉందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి అప్పు పుట్టడం లేదని ఒకవైపు 'రెమో'లా చెబుతారు... మరోవైపు రూ. లక్షా 60 వేల కోట్ల రూపాయల అప్పు చేశామని రామంలా చెబుతారు అని ఎద్దేవా చేశారు. ఇదివరకే ఇచ్చిన హామీలకే దిక్కులేని పరిస్థితుల్లో, ఇప్పుడు కొత్తగా నల్లమల డిక్లరేషన్ ప్రకటించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన నిలదీశారు. గత నెల రోజులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు ప్రపంచ సుందరీమణులు, మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం వంటి అంశాల చుట్టే తిరుగుతున్నాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తాము నిర్మించిన కట్టడాల ముందే ఈ ప్రపంచ సుందరీమణులు ఫొటోలు దిగుతున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో కమీషన్ల పాలన కొనసాగుతున్నది. కమీషన్ల పనిలో కాంగ్రెస్ నేతలు బిజీగా ఉన్నారు. 30 శాతం కమీషన్ లేనిదే ఫైల్లు కదులుతలేవని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వంలో ఫైల్లు కదలాలి అంటే మంత్రుల చెయ్యి తడపాల్సిందేనని కొండా సురేఖ చెప్పారు. మా ప్రభుత్వంలో మంత్రులు 30 శాతం కమిషన్ తీసుకుంటున్నారు ఇంకొక కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చెప్పారని పేర్కొన్నారు. ఈ కమీషన్ల నుంచి దృష్టి మరల్చేందుకే కమిషన్ నోటీసులు అని ఎద్దేవా చేశారు. రెండు లక్షల రుణమాఫీ ఎంతమంది చేశారు?. రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి.. రూ.12 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేశారు. రుణమాఫీ ఇచ్చింది పావు వంతేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో 500 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రైతులను పట్టించుకునే పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు.

# కీర్తి చక్ర



19 రాష్ట్రీయ రైఫిల్స్ సిక్కు లైట్ ఇన్ఫాంట్రీకి చెందిన కల్నల్ మన్‌ప్రీత్ సింగ్ (మరణానంతరం)కు గురువారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీర్తి చక్రను ప్రదానం చేశారు. 2023 సెప్టెంబర్‌లో అనంతనాగ్ జిల్లాలో ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అతను ధైర్యసాహసాలను ప్రదర్శించాడు. ఫలితంగా ఒక ఉగ్రవాది హతమయ్యాడు. ఈ భీకర కాల్పుల మధ్య అతని నుదిటిపై తుపాకీ తగిలింది.

# 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు

>> 2,000 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించినట్లు కేంద్ర భారీపరిశ్రమల మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. ఈ నిర్ణయంతో హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు, కాలుష్య నియంత్రణకు కూడా దోహదపడనుంది. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపుపై ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ, కర్ణాటక, ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాలపై ప్రధానంగా దృష్టి సారించారు. పథకం ప్రస్తుత దశలో బెంగళూరుకు సుమారు 4,500, ఢిల్లీకి 2,800, అహ్మదాబాద్‌కు 1,000, సూరత్‌కు 600 బస్సులతో పాటు హైదరాబాద్‌కు 2,000 ఎలక్ట్రిక్ బస్సులను అందజేయనున్నట్లు మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కుమారస్వామి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ఇప్పుడు సుస్థిర పట్టణ రవాణా దిశగా దృఢమైన అడుగులు వేస్తుందన్నారు. బెంగళూరు నుంచి ఢిల్లీ వరకు, నగరాలు ప్రజారవాణాను మరింత పరిశుభ్రంగా, సమర్థవంతంగా మార్చేందుకు ఎలక్ట్రిక్ బస్సులను కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. తాము కేవలం ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించడమే కాకుండా, నూతన ఆవిష్కరణలు, పర్యావరణ స్పృహతో భారతదేశ రవాణా వ్యవస్థ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పిఎం ఈ-డ్రైవ్ హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. పిఎం ఈ-డ్రైవ్ కార్యక్రమం కింద ఏప్రిల్-2024 నుంచి మార్చి-2026 వరకు రెండేళ్ల కాలంలో రూ.10,900 కోట్ల మొత్తం ఆర్థిక వ్యయంతో 14,028 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ ప్రయత్నాలలో ఒకటిగా నిలుస్తుందని, సకాలంలో బస్సుల పంపిణీ, కార్యాచరణ సంసిద్ధత, భాగస్వామ్య రాష్ట్రాలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ పథకం కింద డిమాండ్ ఇన్సెంటివ్‌ను పొందేందుకు ఈవీ కొనుగోలుదారులకు ఈవోచర్లను కూడా భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిందని, అంతేకాకుండా, పిఎం ఈ-డ్రైవ్ పథకంలో భాగంగా ఈ-ఆంబులెన్స్‌లు, ఈ-ట్రక్కుల కోసం సైతం రూ.500 కోట్లు కేటాయించారు.

# అంత ఇవ్వలేం

>> పౌరసరఫరాల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నప్పటికి సన్నబియ్యం నిల్వలు ఒకేసారి మూడు నెలలకు కేటాయించడానికి సర్దుబాటు చేయడం కష్టంగా మారింది .తెలంగాణ వ్యాప్తంగా స్టేజి 1, స్టేజి2 గోదాముల్లో మే నెల పంపిణీకి పోను ఇంకా ఎన్ని క్వింటాళ్ల బియ్యం నిల్వలున్నాయనే వివరాలు సేకరిస్తున్నారు.వీటి ఆధారంగా జూన్, జులై, ఆగస్టు మాసాలకు సంబంధించిన రేషన్ కోటాను జూన్లోనే పంపిణీ చేసేలా ప్రణాళిక తయారు చేస్తున్నారు. తెలంగాణలో మొత్తం 3.10కోట్ల రేషన్ లబ్దిదారులకు నెలకు 1,79,246.506టన్నుల బియ్యం అవసరం అవుతాయి. మారుమూల ప్రాంతాలకు మూడు నెలల బియ్యం నిల్వలు సర్దుబాటు చేయాలంటే కొంత మేరకు ఇబ్బంది మొదలవుతోంది.పెద్ద మొత్తంలో నిల్వ చేసేందుకు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో డిమాండ్ బాగా పెరిగింది. స్టేజి2 గోదాముల్లో ఒక మాసానికి సంబంధించిన బియ్యం నిల్వ సామర్థం మాత్రమే ఉంది. మూడు మాసాల బియ్యం అనేసరికి దానికి ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. ప్రైవేటు గోదాముల్లో నిల్వ ఉంచడమా.. లేక వచ్చిన లారీలను దుకాణాలకు సరఫరా చేయడమా అనేది ఆలోచిస్తున్నారు. చాలా వరకు రేషన్ దుకాణాల్లోనూ స్థలం తక్కువగా ఉంది. ఒకనెల బియ్యం మాత్రమే పట్టేలా గదులు ఉన్నాయి. దీంతో దుకాణాల వద్ద ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని అధికారులు చెబుతున్నారు.ఆదేశాల ప్రకారం పంపిణీ చేస్తాం: మూడు మాసాలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ చేసేలా చర్యలు చేపడుతున్నాం. సరకును గోదాముల్లో నిల్వ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. దుకాణాల్లో బియ్యం నిల్వ, ఎంతమేర సరఫరా చేయాలనేది జాబితా తయారు చేశాం. అధికారుల ఆదేశాల ప్రకారం సన్న బియ్యం పంపిణీ అయ్యేలా చూస్తాం. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ఎకాఎకిగా సన్నబియ్యం సర్దుబాటు చేయలేమని మే నెలాఖరుకు కాకుండా, జూన్ ఆఖరుకు సమకూరుస్తామని లేఖలో పేర్కొంది. జూన్ నుంచి వానాకాలం మొదలవుతుందని, వరదలు, వాగులు, వంకలు పొంగటం వంటి సమస్యలు ఎదురైతే పేద ప్రజలకు ఆహారధాన్యాలు చేరవేయడం ఇబ్బందిగా మారుతుందని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. జూన్, జూలై, ఆగస్టు నెలల బియ్యం కోటాను జూన్‌లోనే అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిన నేపథ్యంలో ఇప్పటికిప్పుడు మూడు నెలల కోటాను సర్దుబాటు చేయటం కష్టమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రానికి రాసిన లేఖలో రాష్ట్రంలోని పరిస్థితులను వివరించి, జూన్ ఆఖరు వరకు గడువు ఇవ్వాలని కోరింది. ఈ మేరకు జూన్‌లో ఒక నెల కోటా, జూలైలో రెండు నెలల కోటాను సరఫరా చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# మెదక్‌లో 119 మి.మీ. అత్యధిక వర్షపాతం

## భారీ వర్ష సూచన

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. గడిచిన 24 గంటల్లో మెదక్ జిల్లాలోని ఆర్డీవో ఆఫీసు వద్ద అత్యధికంగా 119.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మసాయిపేటలో 112 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఆ తర్వాత మంచిర్యాల జిల్లాలోని జన్నారంలో 99.8 మిల్లీ మీటర్లు, హైదరాబాద్‌లోని బండ్లగూడలో 98.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వర్షం దంచి కొట్టింది. ఉదయం ఆరున్నర గంటల నుంచి ఎనిమిది గంటల వరకు దాదాపు గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం పడటంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మైత్రి నగర్ వద్ద నాలాలు పొంగడంతో నీరు రోడ్డుపైకి వచ్చాయి. బీకేరెడ్డి కాలనీలో పెద్ద చెరువు నాలా నుంచి బయటకు రావడంతో దిగువ ప్రాంతానికి చేరాయి. దీంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. అలాగే క్లాక్ టవర్ ప్రాంతంలో వర్షానికి రోడ్లు జలయమయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బంది ఏర్పడింది. కాగా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడ ద్రోణి ప్రభావంతో రానున్న 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నైరుతి రుతుపవనాల చురుకుగా కదులుతున్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మరో రెండు రోజులు వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు కేరళ వైపుగా నైరుతి రుతుపవనాలు దూసుకొస్తున్నాయి.

## వారం - వర్జ్యం

తేది : 23-05-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
ఏకాదశి రా.10.26
ఉత్తరాభాద్ర మ.3.58
వర్జ్యం రా.2.51-4.19
దు.8.12-9.04, 2) మ.12.31-మ.1.23
శుభసమయం : ఉ.9.10-9.40
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** పాత మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. వస్తుసేకరణ.

**వృషభం:** ఆర్థిక అభివృద్ధి సాధిస్తారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. దైవదర్శనాలు.

**మిథునం:** కుటుంబంలో సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు.

**కర్కాటకం :** విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. ఉద్యోగాలలో స్థానమార్పులు వుంటాయి. ప్రయాణాలు.

**సింహం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. సభలు సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య :** ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి. బాకీలు వసూలవుతాయి. జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

**తుల :** వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. అనుకోని ఖర్చులు పెరుగుతాయి. వాహనయోగం.

**వృశ్చికం:** జీవితభాగస్వామితో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**ధనుస్సు:** మీలోని ప్రతిభ వెలుగులోకి వస్తుంది. అనుకోని అవకాశాలు లభిస్తాయి వాటిని సద్వినియోగం చేసుకోండి.

**మకరం:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్తులాభాలు.

**కుంభం:** సన్నిహితుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఆధ్యాత్మికచింతన.

**మీనం :** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 103 'అమృత్ స్టేషన్లు' ప్రారంభించిన ప్రధాని



గురువారం బేగంపేట అమృత్ భారత్ స్టేషన్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి

>> దేశంలో మరో 500 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ స్టేషన్ల ఆధునీకరణ 2027కల్లా పూర్తిచేస్తామన్నారు. రైల్వే ట్రాక్‌ల ఆధునీకరణ, కొత్త రైల్వేట్రాక్‌ల నిర్మాణం గడచిన 11 ఏళ్లలో ఎంతో వేగంగా జరిగాయన్నారు. 34 వేల కిలోమీటర్ల రైలు ట్రాక్‌లు నిర్మించడంద్వారా జర్మనీ ట్రాక్‌రికార్డు అధిగమించామన్నారు. రైల్వే లైన్ల విద్యుదీకరణ 47వేల కిలోమీటర్లమేర చేసామని, వందేభారత్, నమోభారత్, అమృత్‌భారత్ సిరీస్‌లలో కొత్తరైళ్లప్రవేశపెట్టామన్నారు. పాత ఐసిఎఫ్ కోచ్‌లను ఎల్‌హెచ్‌బి కోచ్‌లుగా శరవేగంగా మార్చామని, దీనివల్ల కొత్తగా దేశంలో 42 వేల కొత్త ఎల్‌హెచ్‌బి కోచ్‌లు ఏర్పాటయ్యాయని రైల్వే మంత్రి తెలిపారు. గడచిన రెండేళ్లలోప్రధానిమోడీ 1062 కొత్తస్టేషన్లనిర్మాణానికి భూమిపూజచేసారన్నారు. ఇందులోభాగంగానే 103 స్టేషన్లుప్రారంభం అయ్యాయని, మిగిలిన వాటిని కూడా శరవేగంగాపూర్తిచేస్తున్నట్లు తెలిపారు.

**సికింద్రాబాద్, బేగంపేట్‌లో అమృత్ భారత్ స్టేషన్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**తార్నాక, ప్రభాతవార్త :** బేగంపేటలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్, ఆలేరు శాసనసభ సభ్యులు బీర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ వీడియో లింక్ ద్వారా పాల్గొన్నారు. వరంగల్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి, వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వరంగల్ పార్లమెంటు సభ్యులు, డాక్టర్ కడియం కావ్య, మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు, ఈటల రాజేందర్, ఎంపీ, డీకే అరుణ, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య తధితరులు పాల్గొ న్నారు.

కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లోని 1300 కి పైగా రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఒకే సారి పునరాభివృద్ధి కోసం ఎంపిక చేయడం భారతీయ రైల్వేలో రికార్డు అని అన్నారు. ఈ గుర్తించిన స్టేషన్లలో 103 స్టేషన్లలో పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునరాభివృద్ధి కోసం తెలంగాణ ప్రాంతంలో 40 రైల్వే స్టేషన్లను గుర్తించబడ్డాయన్నారు. రైల్వేలు మహిళా సాధికారతకు ఇచ్చిన ప్రాముఖ్యతను ఆయన ప్రశంసించారు. స్టేషన్‌ను పూర్తిగా మహిళా స్టేషన్‌గా ప్రకటించారు. ఇక్కడ రోజువారీ కార్యకలాపాలన్నీ మహిళా సిబ్బందిచే నిర్వహించబడుతున్నాయి. బేగంపేట అమృత్ స్టేషన్‌లో రూ.26.55 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలు మరియు సదుపాయాలను అభివృద్ధి చేశారు.ఇందులో అందమైన ముఖద్వారం, ప్రవేశ ద్వారం, 12 మీటర్ల పాదచారుల వంతెన, లిఫ్ట్‌లు మరియు ఎస్కలేటర్లు, సర్క్యులేటింగ్ ఏరియా, వేచియుండు హాలు, సైనేజ్ బోర్డులు మొదలైనవి ఉన్నాయి. ఈ సంవత్సరం తెలంగాణకు రికార్డు స్థాయిలో రూ.5,337 కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిగాయని, దీనితో రైలు అభివృద్ధి కార్యకలాపాలు వేగంగా జరుగుతున్నాయన్నారు.

**ఇది అంతా అభివృద్ధి కాదా?: కేంద్ర మంత్రి బండి సంజయ్**

**కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:** 'గతంలో బీఆర్ఎస్ సహా కొంతమంది నాయకులు ప్రతిదానికి లేఖలు రాసి చేతులు దులుపుకున్నరు. ఇప్పుడు ఇంత అభివృద్ధి జరుగుతుంటే ఇదంతా మావల్లే జరిగిందని వాళ్లు ప్రచారం చేసుకుంటున్నరనీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఎవరి హయాంలో రైల్వే స్టేషన్లు అభివృద్ధి చెందాయో కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణే నిదర్శనమన్నారు.అతి త్వరలోనే జమ్మికుంట రైల్వేస్టేషన్ ను సైతం అమ్రుత్ భారత్ పథకంలో చేర్చి ఆధునీకరిస్తామన్నారు. కరీంనగర్ నుండి హసన్ పర్తి వరకు 61 కి.మీల నూతన రైల్వే లేన్ నిర్మాణంపై సర్వే పూర్తి చేసి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు కూడా తయారు చేశామన్నారు. ఈ నూతన లేన్ నిర్మాణానికి రూ.1480 కోట్ల వ్యయం అవుతుందని డీపీఆర్ లో పేర్కొన్నారని, దీనిపై అతి త్వరలోనే కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కరీంనగర్ నుండి తిరుపతికి ప్రతిరోజు రైలు నడపాలని తనతోపాటు పొన్నం ప్రభాకర్ సైతం లేఖలు రాశారని అన్నారు. అయితే రద్దీ,సాంకేతిక కారణాలరీత్యా అదిసాధ్య పడలేదన్నారు. వారానికి రెండుసార్లు నడుస్తున్న ఈ రైలును వారానికి 4సార్లు నడిచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గురువారం దేశవ్యాప్తంగా ఆధునీకరించిన 103 రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అందులో భాగంగా కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంజయ్ తోపాటు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



గురువారం కరీంనగర్ అమృత్ భారత్ స్టేషన్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి బండిసంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్



బికనీర్‌లోని కర్ణి మాత ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేసిన ప్రధాన మంత్రి మోడీ

# నాన్నా! అలా చేస్తున్నారేమిటి?

>> మై డియర్ డాడీ అంటూ లేఖను మొదలు పెట్టిన కవిత... తండ్రి కెసిఆర్‌కు పలు ప్రశ్నలను సంధించారు. ఈ లేఖలో బీజేపీతో బీఆర్ఎస్ దోస్తీ వ్యవహారాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. పార్టీ లీడర్స్‌కి యాక్సెస్ ఇవ్వడం లేదంటూ కవిత తన లేఖలో ఆరోపించారు.బిఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ సభలో బీజేపీ మీద రెండు నిమిషాలే మాట్లాడటం అనుమానాలకు తావిస్తోందని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటారన్న ఊహాగానాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. బిజెపి వల్ల నేను బాధపడ్డాను, బీజేపీని ఇంకొంచెం టార్గెట్ చేయాల్సిందని కవిత తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. కాంగ్రెస్‌పై గ్రాస్ రూట్స్‌లో నమ్మకం పోయిందన్న కవిత.. బీజేపీ ఆల్టర్‌నేటివ్ అనే ఆలోచనను మన కేడర్ చెబుతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మనం పోటీ చేయకుండా.. బీజేపీకి హెల్ప్ చేశామనే మెసేజ్ కాంగ్రెస్ బలంగా తీసుకెళ్లింద న్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు నిర్దిష్ట కార్యాచరణ ప్రకస్తారని లేదా మార్గనిర్దేశం చేస్తారని అందరూ భావించినట్లు తెలిపారు. జెడ్పీ చైర్మన్,ఎమ్మెల్యే స్థాయి నాయకులు కూడా చాలా మంది కేసీఆర్ కలవడం లేదని, యాక్సెస్ దొరకడం లేదని, సెలెక్టివ్ యాక్సెస్ అని... జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యే స్థాయి నేతలు బాధపడుతున్నారు. ఇప్పటికైనా ఒకటి,రెండు రోజుల పాటు పార్టీ ప్లీనరీ నిర్వహించాలని, అందరికి అందుబాటులో ఉండేలా ప్రయత్నించాలని సూచించారు.

**కవిత లేఖలో నెగెటివ్ ఫీడ్ బ్యాక్**

ఉర్దూలో మాట్లాడకపోవటం, వక్ఫ్ బిల్లుపై మాట్లాడకపోవటం, బీసీలకు 42శాతం అంశం విస్మరించటం. ఎస్సీ వర్గీకరణ అంశం మీద మాట్లాడకపోవటం. ఇంత పెద్ద( ఏప్రిల్ 27న వరంగల్ సభ) మీటింగ్‌కు మళ్లీ పాత ఇంచార్జీలకు ఇవ్వటంతో వాళ్లు పాత పద్ధతిలో తెలంగాణ ఉద్యమకారులకు సదుపాయాలు కల్పించలేదని ఫీడ్ బ్యాక్ కొన్ని నియోజకవర్గాల్లో వచ్చింది. మళ్లీ పాత ఇంచార్జీలకే లోకల్ బాడీస్ ఎలక్షన్ బీ ఫాంలు పార్టీ ఇస్తుంది అని ఇంచార్జీలు చెప్పుకుంటున్నట్లు కొన్ని చోట్ల నుంచి తెలిసింది. లోకల్ బాడీస్‌లో(స్థానిక సంస్థల ఎన్నికల్లో)సర్పంచ్‌లుగా పోటీ చేయాలనుకునే వాళ్లు ఇంచార్జీలుగా ఉన్నారు. కానీ ఎంపిటీసీ.జెడ్పిటీసీ,ఎంపీపీగా ఉండాలనుకునేవాళ్లు. 2001 నుంచి పార్టీలో ఉన్న వాళ్లకు వరంగల్ సభ వేదికపై ఎందుకు మాట్లాడే ఛాన్స్ ఇవ్వలేదు. ఉద్యమ నేతలకు సరైన ప్రాధాన్యం దక్కలేదు. 2001 నుంచి మీతో ఉన్నవారికి మాట్లాడే అవకాశం ఇస్తే బావుండేది. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నవారికి.. నేరుగా పార్టీ ఆఫీసు నుంచే బీ ఫామ్స్ ఇవ్వాలి. వరంగల్ సభలో ఉర్దూలో మాట్లాడలేదు, ధూం ధాం కార్యకర్తలను ఆకట్టుకోవడంలో విఫలమైందని పేర్కొన్నారు.తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ గీతం గురించి ప్రస్తావిస్తారని భావించినట్లు తెలిపారు

**కవిత లేఖలోని పాజిటీవ్ అంశాలు**

బిఆర్ఎస్ రజతోత్సవ సభలో మీరు ఆపరేషన్ కగార్ గురించి మాట్లాడటం అందరికీ నచ్చింది. మీ ప్రసంగంలో కాంగ్రెస్ ఫెయిల్, ఫెయిల్,ఫెయిల్ అంటూ మీరు చెప్పిన తీరు బాగుందని అందరూ అనుకుంటున్నారు. పహల్గాం మృతులకు నివాళి అర్పించడం,మౌనం పాటించడం పాజిటీవ్ అంశం. సిఎం రేవంత్‌రెడ్డి పేరు ప్రస్తావన చేయకపోవడం,తిట్టకపోవడం చాలా మందికి నచ్చింది. సిఎం మిమ్మల్ని తిడుతున్నా మీరు హుందాగా వ్యవహరించారు. ప్రసంగంలో మీరు పోలీసులకు ఇచ్చిన వార్నింగ్ కూడా బాగుంది. సుధీర్ఘంగా లేఖ రాసినందుకు కేసీఆర్‌కు ఆమె క్షమాపణ చెప్పారు.

**కెసిఆర్ ఫ్యామిలో ఏదో నడుస్తోంది**

వాస్తవానికి కల్వకుంట్ల కవిత అమెరికాకు వెళ్లడానికి ముందే కేసీఆర్‌కు లేఖ రాసినట్లు తెలుస్తోంది. లేఖలో పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే సామ చెప్పినట్లుగా కేసీఆర్ ఫ్యామిలీలో ఏదో నడుస్తోందనే అనుమానం మరింత బలపడుతోంది. తన కుమారుడి గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొనేందుకు సుప్రీంకోర్టు అనుమతితో ఈనెల 16న తన కుటుంబ సభ్యులతో అమెరికా వెళ్లిన కవిత శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. కవిత అమెరికా వెళ్లిన సమయంలో హరీశ్‌రావును ఆయన నివాసానికి వెళ్లి రెండు దఫాలు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కలిసి గంటల కొద్దీ చర్చలు చేయడం గమనార్హం. కెసిఆర్ కుటుంబంలో మూడు ముక్కలాట తరహాలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

# నాంపల్లి కోర్టుకు హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి

## ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసులో హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే22:** ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించారంటూ నమోదైన కేసుల్లో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు గురువారం హాజరయ్యారు. ఆయన రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, పీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు, నిబంధనల ఉల్లంఘనలపై అప్పట్లో నల్గొండ టూటౌన్, మెదక్ జిల్లాలోని కౌడిపల్లి, బేగంబజార్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. విచారణలో భాగంగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో రెండోసారి కోర్టుకు హాజరయ్యారు. మూడు కేసుల్లో వ్యక్తిగతంగా హాజరు కావాలని గతంలో కోర్టు ఆదేశించడంతో ఫిబ్రవరి 20న సీఎం హోదాలో మొదటిసారి కోర్టుకు హాజరయ్యారు. న్యాయస్థానం అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ తాను ఎలాంటి నేరం చేయలేదని, తాను నిర్దోషినని, పోలీసులు తప్పుడు కేసులు పెట్టారని రేవంత్‌రెడ్డి తాజాగా వాంగ్మూలం ఇచ్చారు. ఈ మేరకు న్యాయస్థానం సీఎం రేవంత్‌రెడ్డి వాంగ్మూలం నమోదు చేసింది. జూన్ 12న తీర్పు ప్రకటించనుంది.

# ఢిల్లీలో ఎపి సిఎం చంద్రబాబు

## రెండు రోజులు పర్యటన

## నేడు పలువురు కేంద్ర మంత్రులతో భేటీ

**విజయవాడ,మే22,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు రెండ్రోజుల పర్యటన కోసం అమరావతి నుంచి ఢిల్లీకి గురువారం బయలుదేరి వెళ్లారు. శుక్రవారం ఈ నెల 23వ తేదీన ఏడుగురు కేంద్ర మంత్రులతో సీఎం భేటీ కానున్నారు. రాష్ట్రానికి సంబంధించి పలు ప్రాజెక్టులు, కేంద్ర పథకాలపై మంత్రులతో చర్చించి సహకారం కోరనున్నారు. అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, ప్రహ్లాద్ జోషి, అశ్వినీ వైష్ణవ్, సిఆర్ పాటిల్, జితేంద్ర సింగ్‌లతో ముఖ్యమంత్రి భేటీ కానున్నారు. డిఫెన్స్ పరిశ్రమలు, స్పేస్ మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు, ఎలక్ట్రానిక్ తయారీ పరిశ్రమలు, పోలవరం బనకచర్లకు కేంద్ర సాయం, ప్రతి ఇంటికీ తాగునీరు, రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు, తదితర అంశాలపై సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రులతో ప్రధానంగా చర్చించనున్నారు. సీఎం దిల్లీ పర్యటన షెడ్యూల్ ఉదయం 10గంటలకు పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సీఎం భేటి కానున్నారు.

ఉదయం 11 గంటలకు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం కానున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో, మధ్యాహ్నం ఒంటిగంటకు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌తో సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 3గంటలకు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎంతో భేటీ కానున్నారు. సాయంత్రం 4 గంటలకు కేంద్ర హోంమంత్రి అధ్యక్షతన కొత్త క్రిమినల్ చట్టాల అమలుపై సమీక్షకు హాజరుకానున్నారు. రాత్రి 9గంటలకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలవనున్నారు. 24న భారత్ మండపంలో జరిగే నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశానికి సీఎం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ హాజరుకానున్నారు.

# చర్చలు జరిగితే పిఓకెపైనే



## నా నరాల్లో రక్తంకాదు.. సిందూరం మరుగుతోంది

## 22 నిమిషాల్లో పాక్‌ను మోకరిల్లేలా చేసాం

### రాజస్థాన్‌లోని బికనీర్‌లో ప్రధాని మోడీ

**జైపూర్, మే 22:** దాయాది దేశం పాకిస్థాన్‌పై ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి నిప్పులు చెరిగారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ ద్వారా కేవలం 22 నిమిషాల్లో పాకిస్థాన్‌లోని తొమ్మిది ఎయిర్ బేస్‌లను ధ్వంసం చేసిందన్నారు. పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన చర్యలు ప్రపంచం మొత్తం చూసిందన్నారు. అంతేకాదు.. శత్రువులు సైతం ఈ ఫలితాన్ని చవి చూశారని తెలిపారు. గురువారం రాజస్థాన్‌లోని బికనీర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఏప్రిల్ 22వ తేదీన ఉగ్రవాదులు తమ మతాన్ని గుర్తించి.. సోదరీమణుల సిందూరాన్ని తుడిచి పెట్టారని గుర్తు చేశారు. సిందూర్ విస్ఫోటంగా మారితే.. దానిని అందరూ చూస్తారని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ప్రధాని మోడీ చేసిన ఈ వ్యాఖ్యలకు బికనీర్ సభలో ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. పహల్గాం దాడిలో ఉగ్రవాదుల తుపాకీల నుంచి వచ్చిన తూటాలు 140 కోట్ల భారతీయుల గుండెలను చీల్చాయన్నారు. ప్రతి భారతీయుడు ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి కలిసి రావాలని ఈ సందర్భంగా ప్రధాని మోడీ పిలుపు నిచ్చారు. భారత సాయుధ దళాల ధైర్యం కారణంగానే మనం ఈ రోజు ఇలా బలంగా నిలబడ గలిగామన్నారు. త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా.. అవి పక్కాద్బందీ వ్యూహ రచన చేశాయని పేర్కొన్నారు. తద్వారా పాకిస్థాన్ మనకు తలవంచిందన్నారు. ఇంకా చెప్పాలంటే పాకిస్థాన్‌ను మోకాళ్లపై నిలబెట్టామన్నారు. భారతదేశానికి హక్కుగా రావాల్సిన నీటిని పాకిస్తాన్ పొందిందని ఆరోపించారు. భారతీయుల రక్తంతో ఆడుకున్నందుకు పాకిస్థాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇకపై పాకిస్తాన్‌తో ఎలాంటి వాణిజ్యం లేదా చర్చలు ఉండవన్నారు. ఒక వేళ చర్చలు జరిగితే పాక్ ఆక్రమిత కాశ్మీర్ గురించి మాత్రమేనని సభలో ప్రధాని మోడీ కుండ బద్దలు కొట్టారు. అణు యుద్ధం బెదిరింపులకు భారతదేశం భయపడబోదన్నారు. పాకిస్తాన్‌లోని రహీమ్ యార్ ఖాన్ వైమానిక స్థావరం ప్రస్తుతం ఐసియులో ఉందని ప్రధాని మోదీ వ్యంగ్యంగా అన్నారు.

**నా నరాల్లో రక్తం కాదు.. సింధూరం మరుగుతోంది**

'నా నరాల్లో రక్తం కాదు సిందూరం మరుగుతోంది' అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో దేశ ప్రజలంతా గర్వపడుతున్నారని చెప్పారు. చక్రవ్యూహాలతో త్రివిధ దళాలు ప్రత్యర్థి పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేశాయన్నారు. మన మహిళల సిందూరం చెరిపిన వారిని మట్టిలో కలిపేసినట్లు చెప్పారు. 'ఏప్రిల్ 22న జరిగిన దాడికి ప్రతిస్పందనగా ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా చేపట్టాం. సిందూరం భగ్గుమంటే దాని ఫలితం ఎలా ఉంటుందో అందరూ చూశారు. పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాదుల తొమ్మిది అతిపెద్ద రహస్య స్థావరాలను చక్రవ్యూహాలతో త్రివిధ దళాలు ప్రత్యర్థి పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేశామన్నారు. మన మహిళల సిందూరం చెరిపిన వారిని మట్టిలో కలిపేశామన్నారు. మన సాయుధ దళాలు పాక్‌ను మోకరిల్లేలా చేశాయి' అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పాక్ అణుబెదిరింపులకు భారత్ ఇక ఏమాత్రం భయపడదని అన్నారు. పాక్‌తో ఎలాంటి వాణిజ్యం, చర్చలు ఉండవని స్పష్టం చేశారు. చర్చల మాట అంటూ వస్తే అది పాక్ ఆక్రమిత కశ్మీర్ గురించే అని తేల్చి చెప్పారు. ఉగ్రవాదులకు ఇకపై ఇలాంటి సమాధానమే ఉంటుందని హెచ్చరించారు. భారత ప్రజల జోలికొస్తే గట్టి గుణపాఠం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. అభివృద్ధిచెందిన దేశంగా భారత్‌ను మార్చేందుకు మౌలికవసరులు భారీగా కల్పిస్తున్నాయని, 11 ఏళ్లుగా అవిశ్రాంతకృషిచేసామన్నారు. భారత్‌రైలు నెట్‌వర్క్ విస్తరిస్తున్నామని, వందేభారత్, అమృత్‌భారత్; నమోభారత్‌రైళ్లు రైల్వే ఆధునీకరణకు ప్రతీకలన్నారు. అమృత్‌భారత్ స్టేషన్ కింద ఆధునీకరించిన దేశ్‌నోక్ స్టేషన్ ప్రారంభించారు. బికనీర్ ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలుకు జెండా ఊపారు. దేశ్‌నోక్‌లోని కర్ణిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

### ఇంప్రూవ్‌మెంట్ కోసం 1,23,647 మంది దరఖాస్తు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** ఈ యేడాది మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన వారికి.. మొదటి సంవత్సరంలో ఇంప్రూవ్‌మెంట్ కోసం పరీక్షలు రాసే వారికోసం నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 892 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాగా.. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరిగాయి. ఉదంయ జరిగిన మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1కి సెట్ సిని ఎంపిక చేయగా.. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2కి కూడా సెట్ సిని ఎంపిక చేసినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఒక ప్రకటనలో తెలిపారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు జరగనుండగా.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు కొనసాగనున్నాయి. మార్చి 5 నుంచి 25 వరకు జరిగిన వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల్లో 2,89,907 మంది ఫీజు చెల్లించినట్టు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. అలాగే ఇంప్రూవ్‌మెంట్ కోసం 1,23,647 మంది దరఖాస్తు చేసుకున్నారు.

## ఎంపిడిఒల బదలీలకు ప్రభుత్వం ఆమోదం

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** లోక్‌సభ ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఎంపీడీవోలకు ఊరట లభించింది. ఎన్నికకోడ్ నేపథ్యంలో ఫిబ్రవరి 2024 లో బదిలీ అయిన 350 మందికి పైగా ఎంపీడీవోల బదిలీలను చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీ ణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఎంపీడీవోలను బదలీ చేస్తూ గురువారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఫైల్ పై సం తకం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత తమను తిరిగి బదిలీ చేయాలని పలుమార్లు వినతులు చేసిన ఎంపీడీఓల అభ్యర్థనలకు ప్రభుత్వం సాను కూలంగా స్పందిం చింది. ఎంపీడీవోలు మంత్రి సీతక్కను పలు దఫాలు కలిసి విజ్ఞప్తులు చేయగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. సంబంధిత ఫైల్‌పై మంత్రి ఆమోదం తెలపగా, సిఎం సంతకంచేశాక బదలీల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

# ముగిసిన దోస్త్ వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ

### 89,572 మంది రిజిస్ట్రేషన్..72,543 మంది దరఖాస్తులు అప్‌లోడ్

### 30 నుంచి రూ. 400తో రెండో విడత రిజిస్ట్రేషన్ ప్రారంభం

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో.. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025లో వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి గురు వారం(మే22)తో గడువు ముగిసింది. బుధవారం(మే 21)తోనే రిజిస్ట్రేషన్‌కి అవకాశం ముగియగా.. గురువారంతో వెబ్ ఆప్షన్ల గడువు కూడా ముగిసింది. ఈ నెల 30 నుంచి రూ. 400తో రెండో విడతలో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. గురువారం సాయంత్రం వరకు దోస్త్‌లో 89,572 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారిలో 80,701 మంది పేమెంట్ చేశారని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీబీఎంలలో అడ్మిషన్లు ఇవ్వనున్నారు. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీల్లో అడ్మిషన్లను దోస్త్ ద్వారా చేపట్టనున్నారు. ఫీజు చెల్లించిన వారిలో తమ పూర్తి వివరాలతో 72,543 మంది దరఖాస్తులను అప్‌లోడ్ చేశారు. ఇప్పటి వరకు 63,613 మంది తమకు ఏ కాలేజీలో సీటు కావాలో కోరుతూ వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 29న సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 30 నుంచి జూన్ 6 వరకు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని దోస్త్ అధికారులు ఇప్పటికే షెడ్యూల్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. 2024-25 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 1066 కాలేజీల్లో 4,49,449 సీట్లు అందుబాటులో ఉండగా.. ఈ ఏడాది అదికాస్త 1057 కాలేజీలు ఉండగా.. అందులో 143 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలున్నాయి. మొత్తం కాలేజీల్లో 4,57,724 సీట్లు అందుబాటులో ఉన్నాయి. రెండో విడత రిజిస్ట్రేషన్(రూ.400తో) మే 30 నుంచి జూన్ 8వరకు అవకాశం కల్పించారు. వెబ్ ఆప్షన్లు మే 30 నుంచి జూన్ 9 వరకు.. జూన్ 13న సీట్ల కేటాయింపు చేయనున్నారు. సెల్ఫ్ రిపోర్టింగ్ జూన్ 13 నుంచి జూన్ 18 వరకు చేయాల్సి ఉంటుంది.

# పాలకుర్తి నేత ఝాన్సీరెడ్డికి హైకోర్టు నోటీసులు

### విదేశీ పౌరసత్వంతో వ్యవసాయ భూమి కొన్నారని ఆరోపణ

### జూన్ 19లోగా వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 22:** కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న ఝాన్సీ రెడ్డి, ఆమె భర్త రాజేందర్ రెడ్డికి హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వివాదాస్పద భూమి కొనుగోలుకు సంబంధించిన ఒక కేసులో భాగంగా న్యాయస్థానం ఈ ఆదేశాలు ఇచ్చింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో ఝాన్సీ రెడ్డి దంపతులు 2017లో సుమారు 75 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. అయితే, ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థలంలో స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడంతో ఈ భూ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో, దామోదర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. విదేశీ పౌరసత్వం కలిగిన ఝాన్సీ రెడ్డి ఇక్కడ వ్యవసాయ భూమి ఎలా కొనుగోలు చేస్తారని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ వాదనల ప్రకారం, ఝాన్సీ రెడ్డి భారత పౌరసత్వాన్ని వదులుకుని అమెరికా పౌరసత్వం స్వీకరించారని, విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ప్రకారం ఆమె వ్యవసాయ భూమిని కొనుగోలు చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అంతేకాకుండా, తప్పుడు పత్రాలు సమర్పించి ఈ భూమిని దక్కించుకున్నారని, నిబంధనలకు విరుద్ధంగా ఆమెకు రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకం కూడా జారీ చేశారని పిటిషన్‌లో తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ పిటిషన్‌పై మే 1వ తేదీన జస్టిస్ సీవీ భాస్కరెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. తాజా విచారణలో... ఝాన్సీ రెడ్డి ఫెమా నిబంధనలను ఉల్లంఘించారన్న ఆరోపణల నేపథ్యంలో, భూమి కొనుగోలు వ్యవహారంపై జూన్ 19వ తేదీలోగా వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆమెకు, ఆమె భర్తకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది.

# కస్టమర్‌లా ప్రవేశించి గుజరాత్ వ్యక్తిని కాల్చిచంపాడు

**వాషింగ్టన్, మే 22 :** షాపులోకి ప్రవేశించిన ఒక వ్యక్తి కస్టమర్‌గా నటించాడు. కౌంటర్ వద్ద ఉన్న గుజరాత్ వ్యక్తిని బెదిరించి డబ్బులు దోచుకున్నాడు. ఆ తర్వాత అతడిపై కాల్పులు జరిపి హత్య చేశాడు. అమెరికాలో ఈ సంఘటన జరిగింది.

గుజరాత్ రాష్ట్రంలోని డింగుచా గ్రామానికి చెందిన పరేష్ పటేల్ అమెరికాలోని ఒక షాపులో పని చేస్తున్నాడు. మే 21న ఒక వ్యక్తి ఆ షాపులోకి ప్రవేశించాడు. కస్టమర్‌లా నటించి వస్తువులను పరిశీలించాడు. కాగా, ఆ షాపులో ఎవరూ లేకపోవడంతో క్యాష్ కౌంటర్ వద్ద ఉన్న పరేష్ పటేల్ వద్దకు ఆ వ్యక్తి వెళ్లాడు. గన్ గురిపెట్టి అతడ్ని బెదిరించాడు. కౌంటర్‌లో ఉన్న డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. భయందోళన చెందిన పరేష్ పటేల్ ఆ వ్యక్తి చెప్పినట్లుగానే చేశాడు.

క్యాష్ కౌంటర్‌లో ఉన్న డబ్బు దోచుకున్న తర్వాత ఆ వ్యక్తి దారుణానికి పాల్పడ్డాడు. పరేష్‌పై గన్‌తో కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయాడు. బుల్లెట్ గాయమైన పరేష్ పటేల్ అక్కడికక్కడే మరణించాడు. ఆ షాపులోని సీసీటీవీలో ఇది రికార్డ్ అయ్యింది. ఈ సమాచారం తెలుసుకున్న అమెరికా పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# బిజెపితో పొత్తుకు సిద్ధమైన బిఆర్ఎస్

### కెసిఆర్ నియంతృత్వవైఖరి నిలదీసిన కవిత

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** బిజెపితో పొత్తుకు సిద్ధమైన బిఆర్ఎస్‌లో ముసలం తారాస్థాయికి చేరుకుందని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ కల్వకుంట్ల కవిత రాసిన లేఖతో లుకలుకలు బయటపడ్డాయని తెలిపారు. బిజెపి, బిఆర్ఎస్ కలిసి పనిచేస్తుందని మేం చెబుతున్న మాటలను కవిత సమర్థించారని అన్నారు. బిజెపి తో పొత్తు పెట్టుకోవడానికి కేసీఆర్ సిద్ధమతున్నారని కవిత చెప్పకనే చెప్పిందని ఆయన వివరించారు. బిజెపి పైన పల్లెతు మాట మాట్లాడకుండా కేసీఆర్ వ్యవహరించిన తీరును కవిత కడిగి పారేసిందని అన్నారు. భవిష్యత్తులో బిఆర్ఎస్, బిజెపి పొత్తు పెట్టుకోబోతున్నాయి అని ఆయన అన్నారు. బిఆర్ఎస్ బలహీనపడటం వల్లనే బిజెపితో పొత్తుకు ప్రయత్నిస్తున్నట్లు కవిత అంగీకరించారు. కవిత పచ్చి నిజాలు మాట్లాడారు. ఆ మాటలనే మేం చాలా కాలంగా చెబుతున్నాం. బిఆర్ఎస్ పార్టీలో కేసీఆర్ నియంత్రత్వ వైఖరీ ని కూడా కవిత నిలదీశారని అన్నారు పార్టీ రజతోత్సవ వేడుకల్లో కేసీఆర్ ఒక్కరే ప్రసంగించడాన్ని ఆమె ప్రశ్నించారు.. కేసీఆర్ వైఖరిని ఆయన కూతురే తప్పు పడుతోంది. ఇక ప్రజలకు వాళ్లేమీ సమాధానం చెబుతారు. కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని కవిత తేల్చి చెప్పింది.. పార్టీ నాయకులను కలవకుండా ఏకపక్ష పోకడలకు పోతున్నారని ఆమె ధ్వజమెత్తారు. కవిత లేఖ పైన బిఆర్ఎస్ నాయకత్వం స్పందించి ప్రజలకు సమాధానం చెప్పాలి. మా సిఎం రేవంత్ రెడ్డి మీద ఒంటి కాలిపైన లేస్తున్న కేటీఆర్ ముందు తన చెల్లి కి సమాధానం చెప్పాలి. కవిత కు సమాధానం చెప్పకుండా ఇతర పార్టీ లను విమర్శించే నైతిక హక్కు కేటీఆర్ కు లేదు. కల్వకుంట్ల కుటుంబంలో లుకలుకలు ఉన్నాయి. అలిగిన హరీష్ రావు ఇంటికి వెళ్లి కేటీఆర్ బతిమాలుకున్నాడు. కవిత లేఖతో బిఆర్ఎస్ పార్టీ ఇద్దరికి మాత్రమే పరిమితం అయిందని తేలింది. గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో జరిగిన దోపిడి గురించి కూడా కవిత ప్రశ్నిస్తే బాగుంటుంది. పంపకాలు, పదవుల్లో తేడా వచ్చి కుటుంబంలో లేఖలు రాసుకుంటున్నారని అన్నారు బిఆర్ఎస్ పని ఇక అయిపోయిందని జోస్యం చెప్పారు కెటిఆర్ముందు నీ ఇళ్లు సరిదిద్దుకో అధికారంలో ఉన్నప్పుడు ఫామ్ హౌస్ లోనే, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఫాం హౌజ్‌కే పరిమితమైనారని విమర్శించారుజ కేసీఆర్ తీరును ఆయన కూతురే తప్పుపడుతోంది ప్రజలకు ఆయన సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

# పాక్ ఉగ్రవాద చర్యలను ఏకరువు పెట్టిన ఎంపిల బృందాలు

### యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జపాన్‌లో పర్యటనలు

**టోక్యో, మే 22:** పాకిస్థాన్ ప్రాయోజిక తీవ్రవాదం, ఆపరేషన్ సిందూర్ గురించి యూఏఈ, జపాన్‌దేశాలకు కు పార్లమెంటు సభ్యులతో కూడిన ప్రతినిధి బృందాలు వివరించాయి. ఈ క్రమంలో ఉగ్రవాదానికి వ్యతికిరేకంగా భారత్‌కు ఇరుదేశాలు మద్దతు తెలిపాయి. జేడీయూకు చెందిన ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని అఖిలపక్ష దౌత్య ప్రతినిధి బృందం జపాన్‌లో, శివసేన పార్లమెంట్ సభ్యుడు శ్రీకాంత్ షిండే నేతృత్వంలోని మరో బృందం యూఏఈలో పర్యటించింది. ఈ క్రమంలో పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదంపై భారత్ జరుపుతున్న పోరు గురించి వారు యూఏఈ, జపాన్‌లకు వివరించారు. భారత్ నుంచి జపాన్ వెళ్లిన సంజయ్ ఝా నేతృత్వంలోని అఖిలపక్ష దౌత్య ప్రతినిధి బృందం ఆ దేశ విదేశాంగ మంత్రి తకేషి ఇవాయాను కలిసింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంపై భారత్ కు ఉన్న దృఢమైన నిబద్ధతను ఆయనకు వివరించింది. ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి జపాన్ మద్దతు పలికింది. ఉగ్రవాద చర్యలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని కోరింది. మేం ఉగ్రవాదంపై భారతదేశ వైఖరిని జపాన్ విదేశాంగ మంత్రికి బలంగా తెలియజేశాం. ఆయన దాన్ని అభినందించారు. ఉగ్రవాదంపై చర్యలు తీసుకోవాలని కోరారు. టెర్రరిజంపై భారత్ వైఖరిని సమర్థించారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని అన్నారు. పహల్గాం దాడి గురించి ఆయన తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడినవారికి శిక్షించాలని కోరారు. పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని వ్యతిరేకిస్తూ భారత్ తో ప్రపంచ దేశాలు ఉండాలి. ఆపరేషన్ సిందూర్ గురించి వివరించడానికి జపాన్ వచ్చాం అని సంజయ్ ఝా తెలిపారు.

**యుఎఇలో శ్రీకాంత్ బృందం పర్యటన**

మరోవైపు, శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే నేతృత్వంలోని మరో అఖిలపక్ష దౌత్య బృందం అబుదాబిలో యూఏఈ మంత్రి షేక్ నహాయన్ మబారక్ అల్ నహ్యాన్ ను కలిసింది. పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదంపై తాము జరుపుతున్న పోరు, ఆపరేషన్ సిందూర్ గురించి ఆయనకు వివరించింది. ఈ క్రమంలో ఉగ్రవాదంపై భారత్ పోరుకు యూఏఈ మద్దతు పలికింది. భారత్, పాక్ ఒకేసారి స్వాతంత్రం పొందాయని, ఇండియా ఆర్థికంగా అభివృద్ధి చెందితే, పాక్ మాత్రం ఉగ్రవాదంలో పురోగతి సాధించిందని ఎద్దేవా చేశారు. అబుదాబిలోని జాతీయ మీడియా కార్యాలయం డైరెక్టర్ జనరల్ జమాల్ మొహమ్మద్ ఒబైద్ అల్ కాబికి పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలకు భారత్ ఎలా బాధితురాలిగా ఉందో తెలియజేశామని శ్రీకాంత్ శిందే చెప్పారు. యూఏఈ ఉగ్రవాదానికి ఏ విధంగా కూడా మద్దతు ఇవ్వదని కాబీ ధ్రువీకరించారని అన్నారు. పహల్గాంలో ఉగ్రదాడిలో అమాయక ప్రజలు చనిపోయారని కాబీ చెప్పారు. ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చే దేశానికి మద్దతు తెలపమని ప్రత్యక్ష సందేశం ఇచ్చారు. ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రపంచ దేశాలు ఉగ్రవాదంపై పోరాడటం ముఖ్యమని అభిప్రాయపడ్డారని శ్రీకాంత్ శిందే పేర్కొన్నారు. పాకిస్థాన్ సీమాంతర ఉగ్ర వాదంపై తాము జరుపుతున్న పోరు గురించి ప్రపంచ దేశాలకు వివరించేందుకు భారత్ మొత్తం ఏడు అఖిలపక్ష దౌత్య బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు 33 దేశాల్లో పర్యటిస్తున్నాయి. తాజాగా రెండు అఖిలపక్ష దౌత్య బృందాలు యూఏఈ, జపాన్‌లలో పర్యటించాయి.




తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ

ఫారం - 6
(ప్రాథమిక ప్రకటన)
(తెలంగాణ సవరణ చట్టం 2016లోని ఛాప్టర్ IIIఏలోని 10ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు) (నిబంధన 6/12 చూడుము)

గెజిట్ నెం. 18/2025/ తేది: 20.05.2025
జిల్లా కలెక్టరు యాదాద్రి భువనగిరి ఫైలు నెం. G/2295/2025 తేది : 16.05.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (L.A) యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.A/20/2025 తేది: 13.05.2025

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా, ఆత్మకూర్ (యం) మండలం కూరెళ్ళ గ్రామములో విస్తీర్ణం ఎ.3.05 1/4 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.

ప్రభుత్వము ఉత్తర్వుల నెం. 108 I&CAD (LA R&R/A2) Department, తేది: 31.10.2017 ద్వారా బునాదిగాని కాలువ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరావాస కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం-2013లోని ఛాప్టర్-II (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు ఛాప్టర్-III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.

ఇట్టి పునరావాసం మరియు పునరావాస కల్పనకు అదనపు కలెక్టర్ (రెవిన్యూ) యాదాద్రి భువనగిరి గారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్)గా నియమించనైనది.

కావున, పైన తెలిపిన బునాదిగాని కాలువ నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, ఆత్మకూర్ (యం) మండలం కూరెళ్ళ గ్రామములో విస్తీర్ణం ఎ.3.05 1/4 గుంటల భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

జిల్లా : యాదాద్రి భువనగిరి మండలం : ఆత్మకూర్(యం) గ్రామం : కూరెళ్ళ

| సర్వే నెం/ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం.) | పట్టాదారు పేరు మరియు తండ్రి/భర్త పేరు | అనుభవదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు | విస్తీర్ణము (ఎ.గుం.) | చెట్లు / కట్టడములు |
|---|---|---|---|---|
| 267 ఖుష్కి | వనం నర్సింహా తండ్రి : పెదమాల్లు | వనం నర్సింహా తండ్రి : పెదమాల్లు | 0.02 | |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| | | మొత్తం | 3.05 1/4 | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్టపరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులు అందరికీ తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీచేయడమైనది.

భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే.), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయంలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారు ప్రత్యేక ఉప కలెక్టరు (భూ.సే.), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించడమైనది.

సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు/ఆకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సదరు చట్టములోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏదైనా అభ్యంతరాలు గానీ, ఆక్షేపణలు గానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి 60 (అరవై) దినముల లోపు జిల్లా కలెక్టరు/ అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాతపూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/-.ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా

సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి

సం/-. జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి

DIPR RO.NO:138/LA/PP/Advt/Pub/2025-26

వార్త


అధికారం నిలుపుకోలేనివారు వేరొకరిపై అధికారం చూపడం భావ్యం కాదు.

-ఎడ్వర్డ్స్

# పటిష్టమైన విత్తన చట్టమే పరిష్కారం!

బాధపడడం తప్ప బాధించడం తెలియని అన్నదాతల్లో ఇటీవల కాలంలో సహనం, ఓర్పు, సన్నగిల్లి ఆందోళనబాటపడుతున్నారు. తమకు ఎలాంటి నష్టం జరిగినా, ఎవరు ఎంతగా మోసగించినా తమలో తాము కుళ్లి కుళ్లి మనసులోనే బాధపడి చివరకు ప్రాణత్యాగం చేయడానికి కూడా సిద్ధపడతారే తప్ప తమను దగా చేసినవారిపై కక్ష కట్టి దాడులు చేసేందుకు సాహసించలేకపోయేవారు. పంటలకు గిట్టుబాటు ధర రాకపోయినా, దళారుల హస్తలాఘవంతో కోలుకోలేని దగాకు గురవుతున్నా తమ కర్మకు తామే బాధపడుతూ మౌన రోదనతో ఇంటిముఖం పట్టేవారు. కానీ ఇటీవల కాలంలో రోడ్లపైకి రావడం, ధర్నాలు, నిరసనలు లాంటి కార్యక్రమాలు తెలిపేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. అంతేకాదు ఓట్లకోసమో, లేక వివిధ కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు తమ ప్రాంతాలకు వస్తున్న నాయకులను నిలదీస్తున్నారు. గతంలో ఈ సంప్రదాయం ఎప్పుడో ఒకప్పుడు అక్కడక్కడ కన్పించినా ఇటీవల కాలంలో పెరిగిపోయిందనే చెప్పొచ్చు. కొన్ని సందర్భాల్లో నాయకులను నిలదీస్తున్నారు కూడా. అష్టకష్టాలు పడి పండించి తెచ్చిన పంటలను అమ్ముకోవడంలో వారు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. దేశవ్యాప్తంగా చూసినా అధిక శాతం మార్కెట్ యార్డుల్లో దళారులదే రాజ్యం. కొలతల్లో మోసం, ధరలను నిర్ణయించడంలో దగా, ఒక్కటేమిటి ఎక్కడ వీలైతే అక్కడ చేతివాటం ప్రదర్శించేందుకు కొందరు దళారులు నిత్యం పొంచి ఉంటూనే ఉన్నారు. రైతులు మోసపోతూనే ఉన్నారు. మోసపోయేవారు ఉన్నంతకాలం మోసం చేసేవారు ఉంటారన్నట్టే ఈ దళారీ వ్యవస్థ ఉన్నంత కాలం రైతులకు ఈ బాధలు తప్పవు. విత్తే దగ్గర నుంచి విక్రయించేవరకు అన్నిస్థాయిల్లో దగా జరుగుతున్నది. మొన్నటి రబీ సీజన్‌లో పండించిన ధాన్యం అమ్ముకోవడంలో అన్నదాతలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. తడిసినధాన్యం సైతం కొనమని ఆదేశాలు ఇస్తున్నారు. ఎలాంటి జాప్యం చేయొద్దని, రైతులను ఇబ్బందిపాలు చేయొద్దని పాలకులు ఆదేశాలు ఇస్తున్నారు. అయినా అవి అమలు కావడం లేదు. ఒకటి, రెండు రోజులు కాదు. వారాల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారు. ఇక ఈసారి ఖరీఫ్ సీజన్ ముందుగానే ఆరంభం కావొచ్చునని వాతావరణ శాస్త్రజ్ఞులు అంచనాలు వేస్తున్నారు. నైరుతి రుతుపవనాలు ఈ మూడవ వారం అంటే రోహిణి కార్తె కంటే ముందే తెలుగు రాష్ట్రాలకు తాకే అవకాశాలు న్నాయని వారు చెప్తున్నారు. ఇప్పటికే గత రెండు నెలలు గా అకాల వర్షాలతో తెలుగు రాష్ట్రాలు తడిసిపోతు న్నాయి. ఏదిఏమైనా ఖరీఫ్ సీజన్ మే చివరివారంలో ఆరంభమవుతుంది. అందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ముందుగా వారికి కావల్సింది నాణ్యమైన విత్త నాలు. పంటలకు విత్తనాలు మూలం. ప్రతియేటా ఎందరో రైతులు నకిలీ విత్తనాలతో మోసపోయి ప్రాణాలు తీసుకుంటున్నారు. ఈ నకిలీ, నాసిరకం విత్తనాలు అమ్మేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని, ఉక్కుపాదం మోపి జైళ్లకు పంపుతామని గత రెండు, మూడు దశాబ్దాలుగా పాలకులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా ఈ వ్యాపా రం యేడాదియేడాదికి పెరుగుతున్నదే తప్ప తగ్గడంలేదు. గతవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి వ్యవ సాయశాఖ మంత్రితో కలిసి వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. వానాకాలం సాగుకు పూర్తిగా సన్నద్ధంగా ఉండాలని, విత్తనాలు, ఎరువులు సరిపడా అందుబాటులో ఉంచాలని ప్రధానంగా నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేసే కంపెనీలు, వ్యాపారులపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దుల్లో టాస్క్‌ఫోర్స్ నిఘా ముమ్మరం చేయాలని, ఎవరి ఊపేక్షించకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలతో మోసపోవద్దని రైతులను అప్రమత్తం చేశారు. విత్తనాలప్యాకెట్లు కొనేటప్పుడు బిల్లులు తీసుకొని పంటకాలం ముగిసేవరకు భద్రపర్చుకోవాలని సూచించారు. కల్తీ విత్తనాల బారినపడి రైతులు మోసపోకుండా వారిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఇప్పుడే కాదు ప్రతియేటా ఈ కార్యక్రమం జరుగుతూనే ఉన్నది. హెచ్చరికల మీద హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. యేడాదియేడాదికి రెట్టింపుస్థాయిలో నకిలీ విత్తనాల వ్యాపారం జరుగుతున్నది. నకిలీ విత్తన వ్యాపారులు కొందరు పట్టుబడుతూనే ఉన్నారు. కేసులు పెడుతూనే ఉన్నారు. కొన్ని సందర్భాల్లో జైలుకు కూడా వెళ్తున్నారు. అయినా తిరిగి వచ్చి అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. రైతుల అవసరాలను డిమాండ్‌ను ఆసరాగా తీసుకొని నకిలీ విత్తనాలు భారీఎత్తున సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వపరంగా ఎన్ని చర్యలు తీసుకుటున్నా విత్తనాల కొరత దృష్ట్యా ఈ నకిలీ వ్యాపారులపై ఆధారపడక తప్పలేదు. పోలీసులన్నా, చట్టాలన్నా వ్యవసాయశాఖ అధికారులన్నా ఆ వ్యాపారంలో భయభక్తులు లేకుండాపోయాయి. ఇందుకు ఎన్నో కారణాలున్నాయి. లోపభూయిష్టమైన విత్తన చట్టమే ప్రధాన కారణంగా చెప్పొచ్చు. ఆ చట్టం దళారులకే ప్రయోజనకరంగా ఉంది. ఆ చట్టాన్ని మార్చాలని, దాని స్థానంలో పటిష్టమైన చట్టాన్ని తేవాలని ఏనాటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. విదేశాల్లోనకిలీ, నాసిరకం విత్తనాలతో మోసంచేసిన దళారులపై తీవ్రమైన చర్యలు తీసుకుంటున్నారు. అలాంటి చర్యల కారణంగానే చైనా వంటి దేశాల్లో నకిలీ విత్తనాలు లేవు. అందుకే పటిష్టమైన చట్టమే ఇందుకు పరిష్కారం.

ఈ ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏమీ ఉండదు. అయితే అందుకు అవలంబించే విధానం లోపభూయిష్టంగా ఉండరాదు.



ఎల్లెన్ గ్లాస్గో

జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయం విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.



స్వామి వివేకానంద

# రోడ్డు ప్రమాదాలను ఆపేదెలా?

నిలబడిన వాహనాలను ఢీకొడుతున్న వారు మద్యం మత్తులో గాని, నిద్ర మత్తులోగాని వాహనాలను నడుపుతుండవచ్చుననే నిపుణుల అభిప్రాయంతో ఏకీభవించక తప్పదు. ఈ నేపథ్యంలో నేషనల్ పర్మిట్ కలిగిన భారీ వాహనాలను, ట్రక్కులనూ, కంటైనర్లను నడిపే వాహనాల డ్రైవర్లకు ఒత్తిళ్లు లేని విధంగా పని గంటలను కేటాయించడంతో పాటువారు మానసిక, శారీరక అలసట నుండిసేద దీరడానికి అవసరమైన సెలవులను ఇచ్చేలా మార్గదర్శకాలను రూపొందించి వాటిని త్రికరణ శుద్ధిగా అమలు పరిచేలా యజమానులపై సంబంధిత ప్రభుత్వశాఖలు తగు చర్యలను తీసుకోవాలి. అదే క్రమంలో హెవీ మోటర్ డ్రైవర్లు సైతం ఓ వైపు రోడ్ల నిర్మాణంలో, మరో వైపు వాహనాల ఫీచర్ల లో వస్తున్న మార్పుల కనుగుణంగా ఎప్పటికప్పుడు తమ డ్రైవింగ్ నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిందే.



డాక్టర్ నీలం సంపత్

గతేడాది డిసెంబర్ ముప్పైఒకటి నాటికి 66,17,100 కిలోమీటర్ల రోడ్ల విస్తీర్ణతతో ప్రపంచంలోనే అధిక విస్తీర్ణం కలిగిన రోడ్లతోఅలరారుతున్న మన దేశంలో ఎక్స్‌ప్రెస్ వేలు, నేషనల్ హైవేలు, స్టేట్ హైవేలు, డిస్ట్రిక్ట్ రోడ్లు, పట్టణ రోడ్లు, గ్రామీణ రోడ్లు, ప్రాజెక్ట్ రోడ్లు కలగలిసి దేశ ప్రజల గరిష్ట రవాణా అవసరాలను తీరుస్తున్న వైనం బహిరంగ రహస్యమే. దేశంలో మొత్తం సరుకుల రవాణా 71శాతం రోడ్డు రవాణా పై ఆధార పడుతుంటే ప్యాసింజర్ల రవాణా 85శాతం రోడ్డు మార్గం ద్వారానే జరుగుతున్న వైనం గమనార్హం. దేశంలోని మొత్తం రోడ్‌నెట్ వర్క్‌లో ఎక్స్‌ప్రెస్ వేలు, నేషనల్ హైవేలు, స్టేట్ హైవేల వాటా ఐదు శాతానికి మించిలేదు. ఐతే దేశంలో జరుగుతున్నరోడ్డు ప్రమాదాలలో సదరు హైవేల వాటా మాత్రం అరవై శాతానికి మించి వుంటుండడం ఒకింత ఆందోళన కలిగిస్తోంది. హైవేల పై జరుగుతున్న ఘోర రోడ్డుప్రమాదాలలో25శాతం ప్రమాదాలు రోడ్లపై అత్యవసర స్థితిలో ఆగిన వాహనాలతోనే జరుగుతున్నాయని మోర్త్ లెక్కలే తేల్చి చెప్తున్నాయి. అందులో మితిమీరిన వేగంతో, అలసటతో, నిద్ర మత్తులో, మద్యం మత్తులో వాహనాలను నడపడంతో పాటు రోడ్ల నిర్మాణంలో లోపాలు, వాహనాల ఫిట్‌నెస్ లేకపోవడం లాంటి కారణాలకు తోడుగా జాతీయ రహదారులపై పార్కింగ్ పూర్తిగా నిషేధించబడిన ఏరియాల్లో భారీ వాహనాలను, ట్రక్కులను పార్క్ చేస్తుండడం మూలాన వంద, వంద ఇరవై కిలోమీటర్ల వేగంతో వాహనాలను నడిపే వెసులుబాటు వున్న సదరు రోడ్లపై నిబంధనలకు విరుద్ధంగా నిలిపివేస్తున్న వాహనాల ఉనికిని కలలో కూడా ఊహించని వాహన చోదకులు వాటిని ఢీకొట్టి ఘోర రోడ్డు ప్రమాదాలకు తెరదీస్తుండడం మన దేశ రహదారులపై భద్రతతో కూడిన ప్రయాణాల పట్ల శరాఘాతంగా మారుతుందని భావించక తప్పదు. నేషనల్ పర్మిట్‌తో వేల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తున్న భారీ ట్రక్కులు, కంటైనర్లు, లారీలు, వ్యాన్‌ల డ్రైవర్లే తమ అత్యవసర అవసరాలను తీర్చుకోవడానికో లేదా అలసట నుండి కాసింత సేద దీరడానికో లేదా తమ వాహనాలకు ఏర్పడిన రిపేర్లకోసమో గాని హైవేలపై నిబంధనలకు వ్యతిరేకంగా జాతీయ రహదారులపై వాహనాలను నిలిపివేస్తున్న మూలాన మొన్నటికి మొన్న లక్నోలోని ప్రయాగ్‌రాజ్‌లో, కటక్ భువనేశ్వర్ హైవే పైన తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై కోదాడ ,సూర్యాపేట దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదాలతో పాటు పంజాబ్, హర్యానా, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడులలోనూ నిరంతరంగా జరుగుతుండడం బహిరంగ రహస్యమే. వాటికి కొనసాగింపుగా నిన్నటికి నిన్న తెలంగాణ రాష్ట్రంలో వికారాబాద్ జిల్లా పరిగి మండలం రత్నాపూర్ గ్రామ సమీపంలో బీజాపూర్‌హైదరాబాద్ 163వ జాతీయ రహదారిపై ఆగివున్న లారీని పెళ్లి బస్సువెనుక నుండి ఢీకొట్టిన ఘోర ప్రమాద దుర్ఘటనలో నలుగురు స్పాట్‌లో మరణించగా, ఆరుగురి పరిస్థితి విషమంగా వుంది. మరో ఇరవై మంది క్రిటికల్ కేర్ హాస్పిటల్లలో చావు బతుకులతో పోరాడుతున్నారు. రహదారులపై ఆగివున్న వాహనాలతో జరుగుతున్న ఈ మారణకాండ ప్రతి రోజూ దేశంలో ఏదో ఒక రాష్ట్రంలో ఏదో ఒక రహదారిపై అవిశ్రాంతంగా కొనసాగుతున్న వైనంతో సురక్షిత ప్రయాణానికి నెలవుగా కొనసాగాల్సిన అన్ని రహదారులు నరకానికి రాదారులుగా మారుతుండడం దురదృష్టకరమే. ఎక్స్‌ప్రెస్ వేలు, జాతీయ, రాష్ట్ర రహదారులన్నింటిపై ప్రతి ఏభై కిలోమీటర్లకు ఒకటి చొప్పున డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవడానికి అవసరమైనరెస్ట్ రూములను అన్ని వసతులతో నిర్మించాలి. సదరు విశ్రాంతి



గదులలో డ్రైవర్ల వస్తువులతో పాటు వారి వాహనాలకు పూర్తి భద్రతను కల్పించాలి. అదే విధంగా ఏవైనా వాహనాలు ఫిట్‌నెస్ లోపించి రహదారులపై బ్రేక్ డౌన్ అయి నడిరోడ్డు పై మొరాయించినప్పుడు సదరు వాహనం ఉనికిని తెలియ జేస్తూ అవసరమైన మలుపు కోసంఇండికేటర్లూ, రేడియం స్టిక్కర్లు, తాత్కాలిక బ్యారికేడ్లతో ఆ రోడ్డు పై నడిచే ఇతర వాహనాలకు దారి మళ్లిస్తూ హెచ్చరికలను జారీచేయాలి. ప్రమాద దుర్ఘటనలో గాయపడిన వారికి అవసరమైన తక్షణ వైద్య సహాయాన్ని అందించడానికి సకల వసతులతో కూడిన అంబులెన్స్ సదుపాయంతో పాటు గోల్డెన్ అవర్‌లో ప్రమాదాల్లో గాయపడిన వారిని చేర్చడానికి అవసరమైన క్రిటికల్ కేర్ హాస్పిటల్స్‌ని స్థాపించాల్సిందే. నేషనల్ హైవే అథారిటీ నిబంధనల ప్రకారం హైవే నుండి 250 మీటర్లలోపు ఎలాంటి దాబాలు, హోటల్‌లూ, మద్యం షాప్‌లతో పాటు మరే ఇతర కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లను నెలకొల్పరాదు. నిజానికి ఈ దేశ ప్రజలకు పూర్తి భద్రతతో కూడిన రహదారి ప్రయాణం కలగా కాకుండా నిజంగా మారాలంటే మోర్త్‌చే గుర్తించబడిన రోడ్ సేఫ్టీ స్టేక్ హోల్డర్లయిన రవాణాశాఖ, రోడ్లు భవనాల శాఖ, వైద్యశాఖ, పోలీసుశాఖలు పరిపూర్ణ సమన్వయంతో తమ విధులను నెరవేర్చాల్సిందే. నేషనల్ రోడ్ సేఫ్టీ అథారిటీ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ జాతీయ రహదారులను ఆనుకొని ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాల దగ్గర, నీటి సదుపాయాలు గలిగిన చోట జాతీయ రహదారులపై వాహనాలను నిలిపివేస్తూ ఘోర రోడ్డు ప్రమాదాలకు కారణాలుగా మారుతున్న డ్రైవర్లను ట్రాఫిక్ నియమాల ననుసరించి కఠినంగా శిక్షించాల్సిందే. అదే విధంగా నిర్మాణ లోపాల తో రోడ్లపై బ్లాక్ స్పాట్లుగా మారిన ప్రదేశాలను గుర్తిస్తూ వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలి. లేదా హెచ్చరిక బోర్డులను ఏర్పరచాలి. జాతీయ రహదారులపై విద్యుచ్ఛక్తి సదుపాయం అందుబాటులో లేని చోట సోలార్ సహాయంతో ఎల్.ఇ.డి లైట్లను అమర్చాలి. కృత్రిమ మేధస్సును గరిష్ఠ స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ సి.సి కెమెరాలుఇతర సాంకేతిక వ్యవస్థల తోడ్పాటుతో హైవేల పై వాహనాల కదలికలను వాటి వేగాన్ని ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత నియంత్రణ శాఖలకు తెలియ జేసే ఓ శాశ్వత నిరంతర నిఘావ్యవస్థను ఏర్పాటు చేయాల్సిందే. ఈ నేపథ్యంలో జాతీయ రహదారులపై బస్ బేలు, ఇతర అనుమతించబడిన ప్రదేశాలలో తప్ప రోడ్లపై, రోడ్డు క్రాసింగ్‌లూ, మూల మలుపులూ, ఎత్తైన ప్రదేశాల్లో , వంతెనల లాంటి ప్రదేశాల్లో రోడ్లపై వాహనాలను నిలిపివేసినా విధించబోయే శిక్షలూ, జరిమానాల పట్ల వాహన చోదకులను చైతన్య పరచాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. అదే విధంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాల ఫిట్‌నెస్‌ని సైతం రవాణాశాఖ ఆకస్మికంగా తనిఖీ చేయాల్సిందే. వివిధ సందర్భాలలో ట్రాన్స్‌పోర్ట్ యజమానులు వివిధ ఉత్పత్తి సంస్థలు, డిస్ట్రిబ్యూటర్లతో చేసుకున్న ఒప్పందాల మేరకు కన్ సైన్‌మెంట్‌ను నిర్ణీత సమయం లోపు గమ్యస్థానాలకు చేర్చాల్సిన షరతులను తృప్తిపరిచే క్రమంలో డ్రైవర్లను వేగంగా వెళ్లమని ఒత్తిళ్లకు గురిచేయడం పరిపాటిగా మారుతోంది. ఈ నేపథ్యంలో డ్రైవర్లు మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారకులౌతున్నారు. ఓ వైపు విరామం లేకుండా వాహనాలను నడపాల్సి రావడం మూలాన తమ వాహనాలకు ఏర్పడిన ఏదో రిపేర్ కారణంగా అక్కడనుండి కదల లేక అనుమతి లేని ప్రదేశాల్లో వాహనాలను నిలిపేవారు. మరో వైపు నిర్దిష్ట కాలపరిమితి లోపు సరుకులను గమ్యానికి చేర్చాలనే తొందరలో అతివేగంతో వాహనాల ను నడిపేవారు. ఇద్దరూ కలిసి జాతీయ రహదారుల పై ఘోర రోడ్డు ప్రమాదాలను సృష్టిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. నిలబడిన వాహనాలను ఢీకొడుతున్న వారు మద్యం మత్తులో గాని, నిద్ర మత్తులోగాని వాహనాలను నడుపుతుండవచ్చుననే నిపుణుల అభిప్రాయంతో ఏకీభవించక తప్పదు. ఈ నేపథ్యంలో నేషనల్ పర్మిట్ కలిగిన భారీవాహనాలను, ట్రక్కులనూ, కంటైనర్లను నడిపే వాహనాల డ్రైవర్లకు ఒత్తిళ్లు లేని విధంగా పని గంటలను కేటాయించడంతో పాటువారు మానసిక, శారీరక అలసట నుండిసేద దీరడానికి అవసరమైన సెలవులను ఇచ్చేలా మార్గదర్శకాలను రూపొందించి వాటిని త్రికరణ శుద్ధిగా అమలు పరిచేలా యజమానులపై సంబంధిత ప్రభుత్వశాఖలు తగు చర్యలను తీసుకోవాలి. అదే క్రమం లో హెవీ మోటర్ డ్రైవర్లు సైతం ఓ వైపు రోడ్ల నిర్మాణం లో, మరో వైపు వాహనాల ఫీచర్ల లో వస్తున్న మార్పుల కనుగుణం గా ఎప్పటికప్పుడు తమ డ్రైవింగ్ నైపుణ్యాల ను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిందే. ●

# సామాజిక మాధ్యమాలకు బానిసలవుతున్న యువత

తంగళ్ళ పల్లి కుమార స్వామి

నేడు యువత సామాజిక మాధ్యమాల బారినపడి విలువైన భవిష్యత్‌ని సర్వనాశనం చేసుకుంటూ వున్నారు. కొంత మందికి క్రికెట్ అంటే పిచ్చి. స్నేహితులతో కలిసి ఐపీఎల్‌లో ప్రతి క్రికెట్ మ్యాచ్ తిలకించిన తర్వాత సెల్‌ఫోన్లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లోకి ప్రవేశించి పందేలు కట్టడం ప్రారంభించడం జరుగుతుందని ఆరోపణలు వినవస్తూ వున్నాయి. ఆరంభంలో నగదు రావడంతో మరింత ఉత్సాహం చూపిస్తారు. తరువాత పందేల్లో రూ.వేలనగదు పోగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. తొలుత బంధువులు, తెలిసినవారి వద్ద అప్పులు చేయడం, నగదు కోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకున్న తర్వాత బకాయిలు పెరిగిపోవడంతో చోరీలకు దిగి పోలీసులకు చిక్కిపోతూ వున్నారు. అరచేతిలో ఇమిడే సెల్‌ఫోన్‌తో సమస్త ప్రపంచాన్ని వీక్షించే అవకాశం వచ్చింది. తాము చదివే కోర్సులకు సంబంధించి సమాచారాన్ని సేకరించి, జ్ఞానాన్ని విస్తృతం చేసుకుంటున్నారు. కొందరు మాత్రం సామాజిక మాధ్యమాలు, క్రికెట్ బెట్టింగ్‌లు, ఓటీటీల్లో సినిమాల వీక్షణతో కాలక్షేపం చేస్తూ జీవితాన్ని బలిచేసుకుంటున్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు సెల్‌ఫోన్‌లను ఎక్కువగావాడతారు. తల్లిదండ్రులు కొని ఇస్తే అప్పటి నుంచి వానిని రోజూ రాత్రి ఫోన్లో ఓటీటీ ప్లాట్‌ఫాం, యాప్‌లలో వీడియోలు చూడటం ప్రారంభించడం, నిద్రపోకుండా తెల్లవారుజామున రెండు, మూడు గంటల వరకు సెల్‌ఫోన్ చూస్తూ గడిపేస్తున్నారు. రాత్రి నిద్రపోకపోవడం వల్ల ఉదయం తరగతి గదిలో మత్తుగా ఉండి అధ్యాపకులు చెప్పే పాఠాలు వారికి అర్థం కావడం లేదు. ఏకాగ్రత దెబ్బతిని చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కరోనా లాక్‌డౌన్ కారణంగా ఇంట్లోనే ఉండాల్సి రావడం, ఖాళీ సమయం ఎక్కువగా లభించడంతో యువతఓటీటీలు, యాప్‌లు చూడటానికి అలవాటుపడ్డారు. ఓటీటీలో కొత్త సినిమాలు, వెబ్ సిరీస్‌ల్లో అశ్లీల సన్నివేశాలు, సంభాషణలు నేరుగా ప్రసారమవుతున్నాయి. ప్రస్తుతం ఎలాంటి సెన్సార్‌షిఫ్ లేకపోవడంతో వీటిని చూసి పిల్లలు, యువత పాడైపోతున్నారని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హింసాత్మక, లైంగిక కార్యకలాపాల దృశ్యాలు నేరుగా ప్రసారం అవుతుండటంతో యువత తీవ్రంగా ప్రభావితమై చెడిపోతున్నారు. విద్యార్థులు ఏకాగ్రత దెబ్బతిని సరిగా చదువుపై దృష్టిసారించలేకపోతున్నారు. తలనొప్పి, కంటిచూపు ఇతర అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. యాంత్రిక జీవనంలో సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోతున్నారు. నైతిక విలువలు, ప్రమాణాలు దిగజారిపోయి అడ్డదారులు తొక్కుతున్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం అక్రమ రవాణాచేస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. జల్సాలకు అలవాటు పడి ఈ దందాలోకి దిగినట్లు పోలీసుల విచారణలో తెలుతుంది. ఎనిమిది నుంచి పది గంటలు స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లలో సినిమాలు, వీడియోలు చూడటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. పిల్లలు, యువతలో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తలనొప్పి, కంటి చూపు సమస్యలు వస్తున్నాయి. మానసిక కుంగుబాటుకు లోనవుతున్నారు. మత్తుపదార్థాల సేవనానికి అలవాటుపడి బానిసలై నగదు కోసం నేరాలకు దిగడంచాలా ఆందోళనకరం. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వచ్చిన తర్వాత పోలీసులు నిఘాపెట్టి పట్టుకోవడం కష్టసాధ్యంగా మారింది. ఐపీఎల్ సమయంలో పెద్దఎత్తున బెట్టింగ్‌లలో యువత భారీ ఎత్తున నగదు పోగొట్టుకున్నారు. రూ.లక్షల అప్పు చేసి తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతూ తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగుల్చుతున్నారు. సెల్‌ఫోన్‌ను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. విద్యార్థులు, యువత పలురకాల ఆటలు ఆడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. వారికి ఇష్టమైన కళలో శిక్షణఇప్పిస్తే రాణిస్తారు. యోగ, ధ్యానం సాధన చేయించడం ద్వారా ఏకాగ్రత సాధిస్తారు. పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి పెట్టి దారితప్పక ముందే వారు సన్మార్గంలో నడిచేలా చూడాలి. తల్లిదండ్రులు ఎంత తీరిక లేకుండా ఉన్నా పిల్లలకు మాత్రం తగిన సమయం కేటాయించాలి. వారితో ప్రేమగా మాట్లాడి ఇష్టాయిష్టాలు తెలుసుకోవాలి. మంచి, చెడు గురించి వివరంగా చెప్పాలి. సానుకూల దృక్పథంలో ఆలోచించేలా వుండాలి. విద్యార్థులు, యువత బలహీనతలను ఆసరాగా తీసుకొని బెట్టింగ్ తరహా వ్యాపారాలు కొంతమంది చేస్తున్నారని సామాజికవేత్తలు అభిప్రాయం వెలిబుచ్చుతూ వున్నారు. తొమ్మిది గంటల కల్లా పిల్లలని నిద్రపుచ్చి తెల్లవారుజామున ఐదు గంటలకే నిద్ర లేపి ధ్యానం, యోగా సాధన చేయించాలి. ●

# ప్రజావాక్కు



### చదువు ఖరీదైన వస్తువు

అన్ని ప్రయివేటు విద్యా సంస్థలు కేజి నుండి పేజి వరకు సంవత్సరంఫీజులను ఇబ్బడిముబ్బడిగా పెంచేస్తున్నారు. అంతలా వేతన జీవులకు, రైతులకు, ఇతర వృత్తులవారికి రాబడి లేదు. చదువులు రానురాను అధిక ఖరీదైన వస్తువుగా మారిపోతున్నది. ఇంజినీరింగ్ ఫీజు సాలీనా రెండునుంచి రెండున్నరలక్షల వరకూఉంది. మేనేజిమెంటు సీటుకు సబ్జెక్టును బట్టి కాలేజి స్టేటస్‌ను బట్టి నిర్ణయిస్తారు. అప్పోసొప్పో చేసి నాలుగేళ్లు చదివిస్తే తరువాత తగినఉద్యోగం వస్తుందా రాదాఅనే బెంగ మొదలవుతుంది. ఏటా లక్షల ఇంజినీర్లు కాలేజీల నుండి ఉత్పత్తి అవుతున్నారు. కానీ ఉద్యోగాల్లో అంత డిమాండు లేదు. లక్షల ఖర్చు, నిరుద్యోగం, నిరాశ నిస్పృహలతో ఏదో ఉద్యోగంలో చేరి వచ్చినదాంతో తృప్తిపడి జీవించడం నేర్చుకోవలసి వస్తోంది. ప్రభుత్వంఫీజులు తగ్గించదు. తగ్గిస్తే ఫ్రొఫెసర్లకు ఇతర స్టాఫ్‌కు జీతాలివ్వలేమని యాజమాన్యాల ఆవేదన.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### జీవవైవిధ్య పరిరక్షణ

మానవునికి ప్రకృతి, జీవవైవిధ్యం రెండు కళ్లు వంటివి. ఆధునిక మానవుని జీవనశైలి మార్పు వలన పర్యావరణ లేమితో పుడమి వేడెక్కిపోవటంతో పాటు జీవవైవిధ్యం దెబ్బతింటుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వన, జల, జీవరాశులున్న దేశాల్లోఇండియ స్థానం8వది. ఈ సంవత్సరం జీవవైవిధ్య దినోత్సవం నినాదంప్రకృతితో సామరస్యం, స్థిరమైనఅభివృద్ధి. భారత్‌లో ఉన్న 18 జీవావరణ ప్రదేశాల పరిరక్షణ కోరకు ప్రజల్లో జీవ, పర్యావరణంపై అవగావనను ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మరింత కృషి చేయాలి. పర్యావరణంపై అవగాహన కల్పించాలి.

-షేక్ మీరా, రాజమండ్రి

### పెరుగుతున్న కరోనా కేసులు

ముంబయిలో ఇద్దరు వ్యక్తులు కరోనాతో మరణించడంతో మళ్లీ కరోనా భూతం మొదటికి వచ్చింది అప్పుడు అంత భయం లేకున్నా ఇప్పటికి స్వీయ రక్షణ చర్యలు అవసరంఅని ఈ ఉదంతంచాటుతోంది. అయితే దీనికి ప్రధాన కారణం ప్రజలలో కరోనా పట్ల పెరిగిన అవగాహన కూడా ఒక కారణం కావొచ్చు. ఏది ఏమైనా కరోనా పట్ల తగు జాగ్రత్త అవసరం అని చాటుతున్న సందర్భం ఇది

-భారత అవినాష్, జనగామ

### స్టేషన్ పాయింట్లలో గరిష్ట పరిమితిని తొలగించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల బదిలీ ప్రక్రియ చేపడుతున్నది. ఇందులోభాగంగానే సర్వీస్‌పాయింట్లు, స్టేషన్ పాయింట్లు, స్పెషల్ పాయింట్లు ఇస్తున్నారు. వాటి ఆధారంగా ప్లేసులకు ఆప్షన్స్ ఇవ్వవలసి ఉంటుంది. అయితే ఉపాధ్యాయులు ఒకే పాఠశాలలో ఎనిమిది సంవత్సరాల మించి పనిచేసిన వారు ఉన్నారు. వారు తప్పనిసరిగా బదలీ కావాల్సి ఉంది. అయితే టీచర్లకు స్టేషన్ పాయింట్లు కేటాయించేటప్పుడు ఎనిమిది సంవత్సరాల గరిష్టసీలింగ్ పెట్టినందున వాళ్లకువస్తున్న స్టేషన్ పాయింట్లలో కోత విధించబడుతున్నది. అందువల్ల వారు బదిలీలలో నష్టపోతారు. కాబట్టి వాళ్లు పని చేసిన గరిష్ట కాలానికి మొత్తం స్టేషన్ పాయింట్లు ఎటువంటి సీలింగ్ లేకుండా కేటాయించవలసిందిగా ఉపాధ్యాయులుకోరుతున్నారు. కావున టీచర్ల బదలీల్లో స్టేషన్ పాయింట్లు కేటాయించేటప్పుడు గరిష్టంగా ఎనిమిది సంవత్సరాల పరిమితి తొలగించాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

### ఆహార పదార్థాల కల్తీ

తెలుగు రాష్ట్రాలలో ఆహార పదార్థాలు కల్తీ విపరీతంగా పెరిగిపోతూ వున్నది. ముఖ్యంగాహోటల్స్, బేకరీలు, ఫ్రై సెంటర్స్‌లో ఎక్కువగా కల్తీ పదార్థాలు విక్రయిస్తువున్నారు. ఆహార పదార్థాలల్లో రుచికోసం రంగులుకలపడం, మసాలాలు అధికంగా వాడటంవల్ల అవితిన్నవారికి జీర్ణావస్థలో మార్పులువచ్చి జీర్ణాశయం దెబ్బ తినడం, అల్సర్ల్, కాలేయ వ్యాధులు సంభవించి మృత్యువాత పడుతూ వున్నారు. సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు లేకపోవడంవల్ల వారుఇష్టానుసారం పదార్థాలు తయారు చేసి విక్రయిస్తు వున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు వీరిబారిన పడి అనారోగ్య సమస్యలు తెచ్చుకొని డబ్బులు కూడా విపరీతంగా ఖర్చు పెడుతూ వున్నారు. కల్తీ ఆహార పదార్థాల సెంటర్‌ల మీద దాడులు చేసి వానిని సీజ్ చేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా

### ప్రభుత్వానికి లొంగిపోవాలి

మావోయిస్టులలో చాల మంది బాగా చదువుకున్నవారు కూడా ఉన్నారు. వీరినందరిని మార్చి 26 కల్లా రూపుమాపుతామని, ఒక్కరిని కూడా విడచి పెట్టేది లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు చేస్తోంది. పహల్గామ్ దాడులలో చనిపోయిన వారి మీద అత్యంత సానుభూతి ఏర్పడింది. అలామావోయిస్టుల మరణాల మీద సమాజానికి సానుభూతి కలుగుతుందా?

-ఎన్. రామ్మలక్ష్మి,సికింద్రాబాద్

# సాయుధ సంపదలో భారత్ ముందంజ

బి.మధుపాళి

అత్యంత ఆధునిక ఆయుధ సంపత్తి, స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన పదునైన ఆయుధాలు, మన త్రివిధ దళాల అత్యాధునిక శిక్షణ/అంకితభావం అన్నీ కలిసి నేడు భరతమాతను నాలుగవ అత్యంత శక్తివంతమైన దేశంగా మనల్ని సగర్వంగా నిలిపాయి. భూతలం, సముద్ర ఉపరితలం, గాలిలోనూ అత్యంత శక్తివంతమైన త్రివిధ సాయుధాల దళాలు మనసొంతం. భారత మిలటరీలో 1.45 మిలియన్ల ఆక్టివ్ సైనికులు, 1.15మిలియన్ల రిజర్వ్ రక్షణ బలగాలు, 2,229 ఏయిర్‌క్రాఫ్టులు, 4,201 యుద్ధ ట్యాంకులు, స్వదేశీ తేజాస్/అర్జున్ లాంటి 'మేక్ ఇన్ ఇండియా' ట్యాంకులతో కూడిన ఆయుధ సంపత్తి, నిరంతరం దేశ రక్షణలో సిద్ధంగా ఉన్నాయి. భారతాన్ని అభేద్యమైన దేశంగా నిలుపుతున్నాయి. గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్ 2025" ప్రకారం, 145 దేశాల మిలటరీ పవర్ ఆధార జాబితాలో భారత్‌ది 4వ స్థానంగా నిర్ణయించబడింది. రక్షణశాఖలో సుశిక్షితులైన త్రివిధ బలగాల సంఖ్య, అణ్వాయుధ సామర్థ్యం, స్వదేశీ ఆయుధ పరిజ్ఞానం, అత్యంత ఆధునిక ఆయుధ సంపత్తి, దేశ ఆర్థిక పరిస్థితి, సహజ భౌగోళిక స్థానం, రక్షణశాఖ బడ్జెట్, లాజిస్టిక్స్ అండ్ ఇండస్ట్రియల్ సామర్థ్యం, అందుబాటులో ఉన్న విలువైన సహజ వనరులు లాంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకొని గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్ 2025ను రూపొందించారు. నేడు అమెరికా, రష్యా, చైనా తర్వాత తనదైన 4వ అత్యంత బలమైన శక్తిగల భద్రతావ్యవస్థ మన భారత్ నిలువగా ఇతర స్థానాల్లో సౌత్ కొరియా, యూకె, ఫ్రాన్స్, జపాన్, టర్కీ, ఇటలీ దేశాలు తొలి 10 స్థానాలను ఆక్రమించాయి. మన రక్షణ శాఖలో ఆధునిక టెక్నలాజికల్ ఇన్నొవేషన్లు, సైబర్ వార్‌ఫేర్ సామర్థ్యం, గ్లోబల్ అలియాన్స్, ఆర్థిక ప్రతిష్టత లాంటివని నేడు ఆయాదేశాల రక్షణదళాల బలానికి కారణమవుతున్నాయి. అతి తక్కువ మిలటరీ సగటు వయస్సు కలిగిన దేశంగా భారత్ ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. అత్యంత బలమైన ఆర్మీ, దేశ అధిక జనాభా, సాయుధ వాహనాలు, రహదారులు, బొగ్గు ఉత్పత్తి, లేబర్ ఫోర్స్ లాంటివనరులు అత్యధికంగా కలిగిన 2వ దేశంగా భారత్



నిలబడింది. అత్యంత శక్తివంతమైన రక్షణ వ్యవస్థ కలిగిన 4వ దేశంగా భారత్ ధైర్యంగా నిలబడింది. మొబైల్ ఆర్టిలరీ ఫీల్డ్ గన్స్, నావల్ ఏయిర్ క్రాఫ్ట్ క్యారియర్స్ ఫ్లీట్ బలం, పర్చేజ్ పవర్ పారిటీల్లో 3వ స్థానంలో భారత్‌నిలుస్తున్నది. మొత్తం మిలటరీ ఏయిర్ క్రాఫ్టులు, ఫైటర్ ఏయిర్ క్రాఫ్టులు, ట్రాన్స్‌పోర్ట్ ఏయిర్ క్రాఫ్టులు, హెలీకాప్టర్లు, నావల్ వార్‌షిప్ డిస్ట్రాయర్లు, టోటల్ రైల్వే కవరేజ్, డిఫెన్స్ బడ్జెట్ రంగాల్లో ప్రపంచ దేశాల్లో 4వ స్థానంలో ఉన్నది మన భారతం. భారత ఆర్మీలో 21 లక్షల సైనికులు/సిబ్బంది, ఏయిర్ ఫోర్స్‌లో 2 లక్షలు, నానికా దళంలో 1.42 లక్షల వీర సైనికులు ఉన్నారు. ఈ త్రివిధ దళాలకు తోడుగా బలమైన పారామిలటరీ బలగాలు కూడా ఎల్లవేళల సిద్ధంగా ఉన్నాయి. భారత అమ్ముల పొదలో 5000 కిమీ రేంజ్ కలిగిన ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మెయైల్స్, సబ్‌మెరైన్ బాలిస్టిక్ మెసైల్స్, ఏయిర్‌లాంచ్ క్రూజ్ మెసైల్స్, అత్యంత బలమైన అగ్ని5 మెసైల్స్ లాంటివి మన దేశ రక్షణ బలాన్ని ఇనుమడింప జేస్తున్నాయి. మన మెసైల్స్ వ్యవస్థలో బ్రహ్మోస్ సూపర్ సోనిక్ మెసైల్స్, 5వ తరం అస్త్రా ఏయిర్‌టుఏయిర్ మెసైల్స్, మీడియం రేంజ్ సర్ఫేస్ టుఏయిర్ ఆకాష్ మెయైల్స్ లాంటివి భారత రక్షణ శక్తిని మరింత పెంచుతున్నాయి. మన వైమానిక దళంలో ఏయిర్ టుఏయిర్/ఏయిర్‌టుసర్ఫేస్ సుఖోయ్ ఫైటర్ ఏయిర్ క్రాఫ్టులు, 300 కిమీ రేంజ్ కలిగిన రఫేల్ ఫైటర్ జెట్లు మన వైమానిక భద్రతకు రక్షణ కల్పిస్తున్నాయి. భారత నావికాదళంలో ఐఎన్ఎస్ విక్రమాదిత్య ఏయిర్ క్రాఫ్ట్ క్యారియర్, ఐఎన్ఎస్ కోల్‌కతా డిస్ట్రాయర్, అత్యాధునిక హెవీవెయిట్ వరుణాస్త్ర టార్పెడో లాంటివి సముద్రదళం చేతుల్లో ఉన్నాయి. ఇండియన్ ఆర్మీ, ఇండియన్ ఏయిర్ ఫోర్స్, ఇండియన్ నావల్ సర్వీసులు అత్యంత శక్తివంతమైన ఆయుధాలను, డిఫెన్స్ వ్యవస్థలను కలిగి సైనిక సంఖ్యలో అత్యధిక శక్తివంతమైన దేశంగా నేడు భారత్ ప్రపంచ దేశాల ముందు సగర్వంగా, ఆయుధాలు చేతపట్టుకొని, తలెత్తుకోని, విజయ దరహాసంతో ధైర్యంగా నిలబడుతున్నది. నేడుకొనసాగుతున్న ఆపరేషన్ సింధూర్ 2.0 తర్వాత పూర్తి స్థాయి యుద్ధమే జరిగితే కొన్ని గంటలు లేదా ఒకటి రెండురోజుల్లో పాకిస్థాన్ నేలమట్టం కావడం, పిఓకెను తిరిగి మనంస్వాధీనం చేసుకోవడం ఖాయమని మన బలగాలు రుజువు చేస్తున్నాయి. ●

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఇడి అన్ని హద్దులు దాటేసింది!

## టాస్‌మాక్‌పై దాడి కేసులో 'సుప్రీం' చీవాట్లు



**న్యూఢిల్లీ, మే 22:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అన్ని హద్దులు దాటుతోందని సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అంతేకాకుండా తమిళ నాడు టాస్మాక్ లిక్కర్ కేసు దర్యాప్తునకు సంబంధించి మొత్తం దర్యాప్తుపై స్టే విధిస్తూ ఆదేశాలిచ్చింది. చీఫ్‌జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్‌లోకూడిన బెంచ్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థపై భారీ ఎత్తున దాడులకు దిగడంపై సుప్రీం ఆగ్రహం వ్యక్తంచేసింది. తమిళనాడు ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్లపై ఇడికి సుప్రీం నోటీసులు జారీచేసింది. తమిళ నాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్ ఇడి దాడులను సవాల్‌చేస్తూ పిటిషన్లు దాఖలు చేసింది. దీనితో సుప్రీం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేసవి సెలవుల అనంతరం ఈ పిటిషన్లు విచారిస్తామని, ఈలోపు ఇడి తన వివరణ ఇవ్వాలంటూ సీరియస్ అయింది.

లౌకిక నిర్మాణక్రమాన్ని ఇడి చర్యలు అధిగమించి ఉల్లంఘించాయని టాస్‌మాక్‌పై దర్యాప్తు ఇక్కడితో నిలిపివేయాలని ఆదేశించింది. మీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అన్ని హద్దులు దాటింది. ఒక కార్పొరేషన్‌పై ఈ దర్యాప్తు ఎలా చేస్తారు. దేశ లౌకిక క్రమాన్ని మీరు ఉద్దేశ్యపూర్వకంగా ఉల్లంఘిస్తున్నారని బెంచ్‌పై న్యాయమూర్తులు అదనపు సొలిసిటర్‌జనరల్ ఎస్‌విరాజునుద్దేశించి వ్యాఖ్యలుచేసారు. ఎఎస్‌జి బెంచ్ ఆదేశాలను వ్యతిరేకించారు. సుమారు 1000 కోట్లరూపాయలమేర అవినీతి జరిగిందని, ఇడి తన హద్దులను ఎక్కడా అతిక్రమించలేదని, ఈకేసులో కూడా అతిక్రమించలేదన్నారు. సీనియర్ న్యాయవాదులు కపిల్‌సిబాల్, అమిత్ ఆనంద్ తివారిల వాదనలను కూడా బెంచ్ పరిగణనలోనికి తీసుకుంది. ఇడి సుమారు 40ఎఫ్‌ఐఆర్‌లు ఈకేసుల్లో దాఖలుచేసిందని, 2014నుంచి జారీ అయిన లిక్కర్‌షాప్ లైసెన్సులకు సంబంధించి ఇడి రంగప్రవేశంచేసిందన్నారు. టాస్‌మాక్ కేంద్ర కార్యాలయంపై దాడిచేయడం ఎండిని కస్టడీలోకి తీసుకోవడం వంటివి రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని సీనియర్ న్యాయవాదులు చెప్పారు. రాష్ట్ర అధీనంలోని టాస్‌మాక్‌పై మీరెలా దాడిచేస్తారని ప్రశ్నించారు.

మాజీ అటార్నిజనరల్ ముకుల్ రోహత్గి రాష్ట్రం తరపున వాదనలు వినిపించారు. టాస్‌మాక్ అధికారుల ఫోన్లకు సంబంధించి క్లోనింగ్‌చేసిన కాపీలను కూడా తీసుకున్నదని, వారి గోప్యతను ఉల్లంఘించి కోర్టు మార్గదర్శకాలు సైతం బేఖాతరుచేసిందని స్పష్టంచేసారు. అయితే మద్రాసు హైకోర్టు గత ఏప్రిల్‌నెలలో ఇచ్చిన ఉత్తర్వులప్రకారం ఇడి దాడులుచేసిందని వాదించారు.

హైకోర్టు బెంచ్ టాస్‌మాక్‌పై వచ్చిన ఆరోపణలు తీవ్రస్థాయిలో ఉన్నాయని, మనీలాండరింగ్ నిరోధక చట్టంపరిధిలో ఈ కేసు దర్యాప్తు చేయాల్సి ఉందని వాదించారు. అంతకుముందు ఇడి భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని, రూ.1000 కోట్లు అక్రమ లావాదేవీలు జరిగాయని, బ్రూవరీలు, బాట్లింగ్ యూనిట్లు సాయంతో లెక్కలు తేలని నగదును దారి మళ్లించారని, అలాగే కాంట్రాక్టులు దక్కించుకోడంకోసం కిక్‌బ్యాక్స్ పెద్దమొత్తంలో అందాయని టాస్‌మాక్‌నుంచి మరింతగా ఆర్డర్లు పొందేందుకు వీలుగా ముడుపులు ముట్టచెప్పారన్నారు.



# ఉత్తరాదిలో వడగండ్ల వాన

## ఢిల్లీలో భారీ వర్షాలకు ఇద్దరు మృతి, 11 మందికి గాయాలు

### విమానంలో కుదుపులతో ఇండిగో అత్యవసర ల్యాండింగ్

**న్యూఢిల్లీ, మే 22:** ఉత్తరాదిరాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారడంవల్ల ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో బలమైన గాలులతోకూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఈ క్రమంలోనే ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న ఓ ఇండిగో విమానం గాల్లో ఉండగా తీవ్ర కుదుపులకు లోనైంది. ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురై కేకలు వేశారు. వెంటనే పైలట్ ఎమర్జెన్సీ ప్రకటించి, సురక్షితంగా ల్యాండ్ చేశారు. కానీ, వడగండ్ల ధాటికి విమానం ముందు భాగం దెబ్బతింది. ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు బయలుదేరిన ఇండిగో విమానంలో 220మందికిపైగా ప్రయాణికులు ఉన్నారు. మధ్యలో ప్రతికూల వాతావరణం కావడం వల్ల ఒక్కసారిగా విమానం తీవ్ర కుదుపులకు లోనయ్యింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళలతో అరుపులు, కేకలు వేస్తూ గట్టిగా సీట్లను పట్టుకున్నారు. వెంటనే ఎమర్జెన్సీ ప్రకటించిన పైలట్, శ్రీనగర్ ఎటిసికి సమాచారం ఇచ్చారు. దీంతో విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యేందుకు చర్యలు చేపట్టారు. చివరకు విమానం సజావుగా దిగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కానీ, విమానం ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. బుధవారం సాయంత్రం 6:30 గంటలకు శ్రీనగర్‌లో విమానం సురక్షితంగా ల్యాండ్ అయినట్లు ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారి తెలిపారు. దీనిపై ఇండిగో ఓ ప్రకటనను కూడా విడుదల చేసింది. పైలట్, క్యాబిన్ సిబ్బంది ప్రోటోకాల్‌ను అనుసరించి విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసినట్లు పేర్కొంది. మరోవైపు వర్ష బీభత్సానికి ఢిల్లీలో అనేక ప్రాంతాల్లో చెట్లు, హోర్డింగ్‌లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది.

చెట్లు, విద్యుత్ స్తంభం మీద పడటంతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతిచెందగా 11 మందికి గాయపడ్డారు. లోధిరోడ్ పైవంతెన సమీపంలో ట్రైసైకిల్‌పై వెళుతున్న దివ్యాంగుడిపై విద్యుత్ స్తంభం పడటంవల్ల అక్కడికక్కడే మృతిచెందాడు. గోకుల్‌పురి ప్రాంతంలో చెట్టు పడటం వల్ల ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ముఖర్జీనగర్ సమీపంలో పాదాచారుల వంతెనకు సంబంధించిన ఓ భాగం ఊడిపడటంతో ఆరుగురు గాయపడ్డారు.

మంగోళ్‌పురి ప్రాంతంలో ఓభవంతిలోని బాల్కనీ పడటంతో నలుగురు గాయపడ్డారు. ఢిల్లీ-నోయిడా, ఢిల్లీ-గజియా బాద్, ఢిల్లీ-గురుగ్రామ్ రహదారులపై చెట్లు పడటంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బలమైన గాలులధాటికి ట్రాక్‌లపై పలు వస్తువులు పడటంతో మెట్రో రైళ్ల సేవలకు ఆటంకం కలిగింది. దిల్లీతో పాటు శివారు ప్రాంతాల్లో 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని వాతావరణ శాఖ తెలిపింది.



## సల్మాన్‌నివాసంలోకి చొరబడేందుకు యత్నించిన ఇద్దరి అరెస్టు

**ముంబయి, మే 22:** బాలివుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌నివాసంలోప్రవేశించేందుకు ప్రయత్నించిన ఒకమహిళ మరో వ్యక్తిని ముంబయి పోలీసులు అరెస్టుచేసారు. బాంద్రా వెస్ట్‌లోని గెలాక్సీ అపార్టుమెంట్లలో ఉన్న సల్మాన్‌ఖాన్ నివాసంలోని వీరిద్దరు విడివిడిగా ప్రయత్నాలు చేసినట్లు తేలింది. నిందితులు 23 ఏళ్ల జితేంద్ర కుమార్, 32 ఏళ్ల ఇషాఛాబ్రాగా గుర్తించారు. సింగ్ ఛత్తీస్‌ఘర్‌కు చెందినవాడని ఖాన్ ఇంటిముందు ఉదయం 9.45 గంటలకు తచ్చాడుతూ కనిపించాడని పోలీసులు తెలిపారు. సల్మాన్ సెక్యూరిటీగా ఏర్పాటుచేసిన పోలీస్ వెంటనే అక్కడినుంచి వెళ్లిపోవాలని హెచ్చరించాడు. అసహనంతో ఈ నిందితుడు తన మొబైల్‌ఫోన్‌ను నేలకేసి కొట్టినట్లు తెలుస్తోంది. తిరిగిసాయంత్రం గెలాక్సీ అపార్టుమెంట్‌లోకి అదే అపార్టుమెంట్‌లో నివసిస్తున్న ఒక వ్యక్తి కారులో వచ్చాడు. అయితే పోలీసులు మళ్లీ ఆతడిని నిలువరించారు. ఈసారి బాంద్రా పోలీసులకు ఆతడిని అప్పగించారు. ఇంటరాగేషన్‌లో సింగ్ తాను సల్మాన్‌ను కలవాలని భావించానని, పోలీసులు అడ్డుకున్నారని, ఎలాగైనా కలిసేనెపంతోనే తాను భనంలోకి ప్రవేశించానని అన్నారు. ఆ తర్వాతరోజు ఇషా చాబ్రా అనే మహిళా ఇదేవిధంగా తెల్లవారురూామున 3.30 గంటలకు ప్రయత్నించింది. అపార్టుమెంట్ లిఫ్ట్‌వరకూ రాగలిగిందని అక్కడ నిలిపివేసామన్నారు. అక్రమంగా ఇతరుల ఇళ్ల లోకి ప్రవేశించే ప్రయత్నం కింద వారిద్దరిని అరెస్టుచేసి కేసునమోదుచేసినట్లు తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ 14వ తేదీనుంచి కూడాసల్మాన్ ఖాన్ హైసెక్యూరిటీలో కొనసాగుతున్నారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు సల్మాన్‌ఖాన్ గెలాక్సీ అపార్టుమెంట్లవద్ద కాల్పులుజరపడంతో సెక్యూరిటీ పెంచారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందినవారే ఈ పనిచేసారని అప్పట్లో పోలీసులు భావించారు. 2023లో ఎన్ఐఎ బిష్ణోయ్‌గ్యాంగ్ టార్గెట్‌చేసిన టాప్ పదిమందిలో

## జెవిష్ మ్యూజియంలో ఇద్దరు ఇజ్రాయెల్ ఎంబసీ సిబ్బందిపై కాల్పులు



**వాషింగ్టన్,మే 22:** వాషింగ్టన్‌లోని ఇజ్రాయెల్ రాయభార కార్యాలయంలో ఇద్దరు సిబ్బందిపై ఆగంతకులు కాల్పులు జరపడంతో వారు చనిపోయారు. జెవిష్ మ్యూజియంలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొన్న సందర్భంగా ఈ కాల్పులు జరపడంతోపాటు ఆగంతకుడు పాలస్తీనాకు స్వేచ్ఛ నివ్వాలంటూ గట్టిగా అరిచినట్లు తేలింది. వెంటనే అప్రమత్తం అయిన సిబ్బంది ఆగంతకుడిని అరెస్టుచేసింది. ఇజ్రాయెల్ విదేశాంగమంత్రి గిడియాన్ సార్ మృతులు యారోన్ లిసిన్‌స్కీ, సారా మిలిగ్రిమ్‌లుగా గుర్తించి టనట్లు తెలిపారు. లిషిన్‌స్కీ ఒక రీసెర్చి అసిస్టెంట్ అని మిలిగ్రిమ్ బృందాలను ఇజ్రాయల్‌కు పంపించడం, పర్యటనలకు ప్రణాళికలు వేస్తారని తెలిపారు. వాషింగ్టన్‌లోని జెవిష్ మ్యూజియంలో జరిగిన కార్యక్రమంనుంచి వెళ్లిపోతుండగా నలుగురు ఉన్న గ్రూప్‌వైపునకు దూసుకువచ్చి కాల్పులుజరిపాడని మెట్రోపాలిటన్ చీఫ్ పమేలా స్మిత్ చెప్పారు. చికాగోకు చెందిన ఎలియాస్ రోడ్రిగ్‌గా ఆగంతకుడిని గుర్తించారు. కాల్పులకు ముందు మ్యూజియం బయట తచ్చాడినట్లు పరిశీలనలో తేలింది. కాల్పులుజరిపిన వెంటనే ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెక్యూరిటీ ఆతడిని వెంటనే పట్టుకున్నదని పమేలాస్మిత్ చెప్పారు. పాలస్తీనాకు స్వేచ్ఛ ఇవ్వండి, స్వేచ్ఛను ఇవ్వండి అంటూ గట్టిగా అరిచాడన్నారు.

ప్రస్తుతం ఎలాంటి ముప్పు లేదని శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం లేదన్నారు. ఈ దాడితో ఇజ్రాయెల్ దౌత్యకేంద్రానికి భద్రతను పెంచారు. విద్వేషం, విప్లవభావాలకు అమెరికాలో తావులేని ఈ దాడి సమాచారం తెలిసిన అధ్యక్షుడు ట్రంప్ తన ట్రూత్ సోషల్‌మీడియాలోపేర్కొన్నారు. హోంల్యాండ్ సెక్యూరిటీకార్యదర్శి క్రిస్టి నియోమ్ వీరి మరణాలను ధృవీకరించారు. ఎఫ్‌బిఐ క్షేత్ర కార్యాలయానికి సమీపంలోనేజెవిష్ మ్యూజియం ఉందని, అక్కడ జరిగిన కార్యక్రమంలోనే ఈ కాల్పులు జరిపినట్లు తెలిపారు. అటార్నిజనరల్ పామ్ బోండి మాట్లాడుతూ తాను మాజీ జడ్జి జీయనైన్ పిర్రోతో కలిసి ఆకార్యక్రమంలోనే ఉన్నానని తెలిపారు. అమెరికాలో ఇజ్రాయెల్ రాయబారి డ్యానీ డానన్ మాట్లాడుతూ ఈ చర్యలు దుర్మార్గానికి పరాకాష్ట అని తెలిపారు. ఈ కాల్పులకు ప్రత్యేక కారణం అంటూ ఏదీ కనిపించలేదని పోలీసులు తెలిపారు. అయితే చనిపోయిన ఇద్దరిలో మహిళా ఇజ్రాయెల్ ఎంబసీలో పనిచేస్తున్న అమెరికా దేశస్తురాలని, పురుషుడు మాత్రం ఇజ్రాయెల్ దేశస్తుడని మాజీ రాయబారి మైక్ హెర్జోగ్ తెలిపారు.

## మోడీ 3.0 యేడాదిపూర్తి సందర్భంగా పాదయాత్రలు, మెగార్యాలీలు



**న్యూఢిల్లీ, మే 22:** ప్రధాని నరేంద్రమోడీ ముచ్చటగా మూడోసారి ప్రధాని బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా బిజెపి పెద్దఎత్తున ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలను రూపొందించింది. జూన్9వ తేదీతో ప్రధానిమోడీ బాధ్యతలుస్వీకరించి సంవత్సరం అవుతున్న సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో మెగా ర్యాలీలు, పాదయాత్రలు చేపట్టాలనినిర్ణయించింది. ఇందుకోసం అధికారపార్టీ కార్యకర్తలు, నాయకులు, మంత్రులతో కమిటీలను ఏర్పాటు చేసి నిర్దిష్టమైన ప్రణాళికలు వేసింది. కేంద్ర మంత్రులు సుమారు 20నుంచి 25 కిలోమీటర్ల మేర ప్రతినిత్యం పాదయాత్రలుచేస్తారు. ప్రతి వారంలో రెండు రోజులు ఈ పాదయాత్రలుంటాయి. మంత్రులు తమతమపార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఈ పాదయాత్రలు నిర్వహిస్తారు. కొందరు సీనియర్ బిజెపి నాయకులు కూడా ఈ పాదయాత్రల్లో పాల్గొంటారు. అలాగేనరేంద్రమోడీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి జూన్9వ తేదీనాటికి 11 ఏళ్లు పూర్తి చేసుకుంటారు.

దేశవ్యాప్తంగా ఈసందర్భాన్ని పురస్కరించుకుని ర్యాలీలు నిర్వహించాలని పార్టీ ఆదేశించింది. ప్రభుత్వ సంక్షేమపథకాలు, ఆపరేషన్ సిందూర్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రశిబిరాలను ధ్వంసంచేయడం ప్రధానిమోడీ తాజాగా ప్రకటించిన దేశవ్యాప్త కులగణన వంటివిప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. అలాగే జూన్9వ తేదీ ప్రధానిమోడీ జ్ఞాన భారతమ్ మిషన్‌ను ప్రారంభించనున్నారు. కోటికిపైగా ఉన్న పురాతన తాళపత్ర గ్రంధాలను డిజిటైజ్ చేయాలని నిర్ణయించారు.

## బ్రిక్స్‌బ్యాంకులో ఆఫ్రికాదేశం అల్జీరియాకు సభ్యత్వం!

**న్యూఢిల్లీ, మే 22:** ఆఫ్రికా ఖండంలో పెద్దదేశంగా ఉన్నఅల్జీరియా బ్రిక్స్‌బ్యాంకు న్యూడెవలెప్‌మెంట్ బ్యాంకులో సభ్యదేశంగాచేరింది. బ్రెజిల్, రష్యా, ఇండియా,చైనా, దక్షిణాఫ్రికాల కూటమితో ఏర్పాటయిన బ్రిక్స్‌బ్యాంకు చైనాలోని బీజింగ్ ప్రధాన కార్యాలయంగాపనిచేస్తోంది. 2015లో ఏర్పాటయిన ఈ బ్యాంకులో మరికొన్ని దేశాలకు సభ్యత్వం కల్పించాలని బ్రిక్స్ భావించింది. అంతర్జాతీయ ఆర్థిక వేదికగా మారుతున్న బ్రిక్స్ బ్యాంకు అంటే ఎన్డీబీకి అధ్యక్షురాలిగా దిల్మా రౌసెఫ్ కొనసాగుతున్నారు. అల్జీరియా సభ్యదేశంగా చేరేందుకు అవసరమైన డిపాజిట్లుచేసిందని ఆమెవివరించారు. ఉత్తర ఆఫ్రికా ఖండంలో ప్రధాన ఆర్థిక వ్యవస్థ కలిగిన అల్జీరియా ఇపుడు ఎన్డీబీలో భాగస్వామ్యదేశంగా మారిందన్నారు. అల్జీరియా ఆర్థిక మంత్రి అబ్దెల్‌కరీమ్ బౌజ్‌రెడ్ మాట్లాడుతూ ఎన్డీబీలో సభ్యత్వం పొందడం మంచి పరిణామం అన్నారు. అంతర్జాతీయ అభివృద్ధిలో ఇపుడుతాముసైతం కీలకంగా మారుతున్నట్లు ఆయన అన్నారు. వర్ధమాన మార్కెట్ ఆర్థికవ్యవస్థలు, అభివృద్ధిచెందుతున్న దేశాల్లో మౌలికవనరులు, ఆర్థికపరిష్కారాలను అందించేందుకు ఏర్పాటుచేసిన బ్యాంకులో తాము భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు.

## యూట్యూబర్ జ్యోతికి మరో 4రోజులు రిమాండ్

### భారత్‌లోని బ్లాకౌట్ వివరాలు పాక్‌కు చేరవేత

### ఒడిశాలోని పూరి, కోణార్క్ ఆలయాలు చిత్రించిన జ్యోతి




**న్యూఢిల్లీ,మే 22:** పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులతో సంబంధాలున్నట్లు ఎన్ఐఎ విచారణలో ఒప్పుకున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు హిసార్ జిల్లా కోర్టు మరో నాలుగు రోజుల రిమాండ్‌పొడిగించింది. ఆపరేషన్ సింధూర్ సమయంలోకూడా ఆమె ఐఎస్ఐతో టచ్‌లో ఉంటూ బ్లాకౌట్ వివరాలు అందించింది. ఐదు రోజులపాటు జ్యోతిని విచారించిన ఎన్ఐఎ అధికారులు ఆమెను నుంచి కీలక సమాచారం రాబట్టారు. అలాగే ఆమె సింగపూర్, బ్యాంకాక్ ట్రిప్‌లకు సౌదీకిచెందిన వెగో అనే ట్రావెల్ సంస్థ స్పాన్సర్‌చేసిందని దర్యాప్తులో తేలింది. మరోవైపు ఆమె పోలీసు కస్టడి ముగియగా జ్యోతిని హిసార్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. జ్యోతిని మరికొన్నిరోజులు పోలీస్ కస్టడీకి ఇవ్వాలన్న పోలీసుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న హిస్సార్ జిల్లా కోర్టు మరో 4 రోజుల పాటు ఆమెకు పోలీస్ రిమాండ్ విధించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులతో టచ్‌లో ఉన్న జ్యోతి భారత్‌లో బ్లాకౌట్ సమాచారాన్ని సైతం పాక్‌కు చేరవేసింది. భారత్‌పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నాలుగు రోజుల పాటు దిల్లీలోని పాక్ హైకమిషన్ సిబ్బంది ఎషాన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్‌తో టచ్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్ మల్హోత్రాను ఒక మంచి అసెట్‌గా వాడుకున్నట్లు తేలింది. మరోవైపు, జ్యోతి మల్హోత్రా కేసులో లాగినకొద్దీ డొంకకదులుతోంది. జ్యోతి ఒడిశాలోని పూరి ఆలయంతో పాటు ప్రపంచ ప్రఖ్యాత కోణార్క్ ఆలయాన్నికూడా సందర్శించినట్లు పూరి క్రైమ్ బ్రాంచ్ ఐజీ సార్థక్ సడంగి తెలిపారు. ఈమేరకు ఒడిశాకుచెందిన యూట్యూబర్ ప్రియాంకను విచారించగా వెలుగులోకి వచ్చిందన్నారు. ప్రియాంక జ్యోతిని పూరి, చిలికా, కోణార్క్‌కు తీసుకెళ్లానని ఒప్పుకుందని ఐజీ వెల్లడించారు. కాగా, వారి ఇద్దరు తీసిన వీడియో ఫుటేజీపై దర్యాప్తు కొనసాగుతోంది. దీంతో జ్యోతి ప్రియాంక మధ్య ఉన్న సంబంధం, జ్యోతి నుంచి ప్రియాంకకు ఏమైనా ఆర్థిక ప్రయోజనాలు లభించాయా, వారు ట్రావెల్ టికెట్లు ఎలా కొనుగోలు చేశారు, వారికి మరెవరితోనైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## వక్ఫ్‌సవరణ చట్టంపై సుప్రీం తీర్పు రిజర్వు

**న్యూఢిల్లీ, మే 22:** వక్ఫ్ సవరణ చట్టం2025ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంపై తీర్పును రిజర్వ్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం కేంద్ర తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, పిటిషనర్ల తరపున న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ వాదనలను మూడురోజుల పాటు విన్నది. అనంతరం తీర్పును సీజేఐ జస్టిస్ గవాయ్ ధర్మాసనం రిజర్వ్ చేస్తున్నట్లు గురువారం వెల్లడించింది. వాదనల సమయంలో కేంద్రప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని గట్టిగా సమర్థించింది ఆ చట్టాన్ని నిలిపివేయలేమని కోర్టుకు తెలిపింది. వక్ఫ్‌అనేది లౌకికభావన అని, ఇస్లాంలో భాగం కాదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలిపారు. ప్రభుత్వ భూమిపై ఎవరికీ హక్కు ఉండదని అన్నారు. ప్రభుత్వానికి చెందిన ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటిస్తే ప్రభుత్వం ఆ ఆస్తిని కాపాడుకోగలదని గతంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చెబుతోందని గుర్తుచేశారు. చట్టపరమైన, రాజ్యాంగ సూత్రాల నుంచి పూర్తిగా నిష్క్రమించిన చట్టంగా వక్ఫ్ చట్టాన్ని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వర్ణించారు. న్యాయరహిత ప్రక్రియ ద్వారా వక్ఫ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఒక మార్గమని అన్నారు. వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలన్న ఆలోచనతోనే సవరణ చట్టంలో పలు నిబంధనలను రూపొందించారని ఆరోపించారు. ప్రస్తుతదశలో మూడుకీలక అంశాలపై మధ్యంతర ఉత్తర్వులు కోరారు. న్యాయస్థానాలు వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించిన వాటిని డీనోటిఫై చేసే అధికారం ,కేంద్ర వక్ఫ్ కౌన్సిల్, రాష్ట్ర వక్ఫ్ మండళ్ల కూర్పు, ప్రభుత్వ భూమిని వక్ఫ్ ఆస్తిగా పేర్కొనడంపై తలెత్తిన వివాదంలో కలెక్టర్ విచారణ జరిపితే దానిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించకపోవడం. పార్లమెంటు ఉభయ సభల ఆమోదం, ఆ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సమ్మతితో వక్ఫ్ సవరణ చట్టం2025 ఇటీవల అమల్లోకి వచ్చింది. వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో 14 గంటలకుపైగా చర్చ జరిగింది. అనంతరం సవరణలవారీగా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించగా బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232మంది సభ్యులు ఓటేశారు. రాజ్యసభలో అనుకూలంగా 128 మంది, వ్యతిరేకంగా 95 మంది సభ్యులు ఓటేశారు.

## కేరళలో విజృంభిస్తున్న కరోనా!

### ఒక్కనెలలోనే 182 కేసులునమోదు

**తిరువనంతపురం, మే 22:** కరోనా మళ్లీ విజృంభిస్తోంది. కరోనా మహమ్మారి కేరళకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. రోజురోజుకు కొవిడ్ కేసులు పెరుగుతుండడంతో ఆ రాష్ట్ర అధికార యంత్రాంగం ఆందోళనకు గురవుతుంది. ఒక్క మే నెలలోనే కేరళలో 182 కొవిడ్ కేసులు నమోదయ్యాయని ఆ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు. అత్యధికంగా కొట్టాయం జిల్లాలో 57 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఎర్నాకుళంలో 34, తిరువనంతపురంలో 30 కేసులు ఉన్నట్లు చెప్పారు. కేరళలో కొవిడ్ కేసుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జలుబు, దగ్గు, శ్వాస సంబంధిత లక్షణాలతో బాధపడేవారు తప్పనసరిగా మాస్క్ ధరించాలని వీణా జార్జ్ అన్నారు. మరోవైపు మహారాష్ట్రలో జనవరి నుంచి ఇప్పటివరకు నమోదైన కొవిడ్ కేసుల్లో ఇద్దరు మరణించినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే. మరణించిన వారిలో ఒకరికి క్యాన్సర్ ఉన్నట్లు పేర్కొంది. జనవరి నుంచి మొత్తం 6,066 స్వాబ్ టెస్టులు చేయగా, 106 కేసులు పాజిటివ్ నిర్ధారణ అయ్యాయన్నారు.

వీరిలో 101 మంది ముంబయికి చెందిన వారు కాగా, మిగిలిన వారు పుణె, థానే, కొల్హాపూర్ చెందినవారుగా పేర్కొంది. ప్రస్తుతం రాష్ట్రంలో 52 కేసులు పాజిటివ్ కేసులు ఉన్నట్లు, వారిలో 16మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లుగా ఆరోగ్యశాఖ చెప్పింది. మే 19నాటికి దేశవ్యాప్తంగా 257 కొవిడ్ కేసులు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది.

## జమ్ముకాశ్మీర్‌కు తక్షణమే రాష్ట్రహోదా కల్పించాలి

### ముఖ్యమంత్రిని కలిసిన టిఎంసి ప్రతినిధిబృందం



**శ్రీనగర్, మే 22:** జమ్ముకాశ్మీర్‌కు తక్షణమే రాష్ట్రహోదా కల్పించాలని తద్వారా స్థానిక ప్రభుత్వాలకు సాధికారత ఏర్పరిచినట్లవుతుందని తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ప్రతినిధి బృందం స్పష్టంచేసింది. టిఎంసికి చెందిన ఐదుగురు సభ్యులబృందం ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లాను కలిసి చర్చలు జరిపింది. జమ్ముకాశ్మీర్‌ప్రజల చిరకాల కాంక్ష రాష్ట్రహోదా సాధించుకోవడమేనని, తక్షణమే జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్రహోదా కల్పించాలనివారంతా అన్నారు. టిఎంసి రాజ్యసభ ఎంపి సాగరికాఘోష్ ముఖ్యమంత్రిని కలిసిన వివరాలను వెల్లడించారు. ఎన్నికైన ప్రజాప్రభుత్వానికి రాజ్యాంగ అధికారణల ప్రకారం స్వయంపాలిత అదికారాలు కల్పించాలని, అందుకు రాష్ట్రహోదా ఒక్కటే మార్గమని అన్నారు. జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్రహోదా కల్పించాలన్న డిమాండ్‌కు టిఎంసి సంపూర్ణ మద్దతునిస్తుందని, కాశ్మీర్‌ప్రజల సంక్షేమం అభ్యున్నతి, అభివృద్ధిని కోరుకునే ప్రజలకు తక్షణమే రాష్ట్రహోదా ఉండాలని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లాతో 90 నిమిషాలపాటు చర్చలు జరిపినట్లు ఎంపి సాగరికా ఘోష్ తెలిపారు. ముఖ్యమంత్రితో అత్యంత సామరస్య వాతావరణంలో చర్చలుజరిగాయని, సరిహద్దుగ్రామాల్లోని ప్రజల సమస్యలపైనా చర్చించినట్లు తెలిపారు. పూంఛ్, రాజౌరి, యూరి జిల్లాలోని సరిహద్దుగ్రామాల ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వారన్నారు. పాకిస్థాన్‌చేస్తున్న కాల్పులు, ప్రయోగిస్తున్న మోర్టార్లతో ఎన్నో ఇళ్లు ధ్వంసం అయ్యాయని పహల్గాం ఉగ్రదాడికంటే వీరి సమస్యలు మరింత ఎక్కువ ఉన్నట్లుగా కనిపిస్తోందని సాగరికా ఘోష్ తెలిపారు. సరిహద్దు గ్రామాలప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు కృషిచేయాలని వారుసూచించారు. వైద్యసాయం, పాఠశాలలు, కళాశాలలు పునర్నిర్మాణం, మృతులకుటుంబాలకు పరిహారంవంటివి అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో శాయశక్తులా సాయంచేస్తున్నట్లు తెలిపారు. ఓమర్ అబ్దుల్లా ప్రభుత్వం ఇందుకోసం తక్షణమే స్వయంసాధికారత సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టిఎంసి ప్రతినిధిబృందం ముఖ్యమంత్రితో చర్చల అనంతరం సరిహద్దుల్లోని పూంఛ్ జిల్లాకు వెళ్లింది.

## అత్యంత శక్తిమంతమైన ఖండాంతర అణు క్షిపణిని పరీక్షించిన యుఎస్

**వాషింగ్టన్, మే 22:** అమెరికా అత్యంత శక్తిమంతమైన ఖండాంతర అణు క్షిపణి మినిట్‌మ్యాన్-3ను పరీక్షించింది. ఓ పక్క అధ్యక్షుడు ట్రంప్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ గోల్డెన్‌డోమ్ నిర్మిస్తున్నట్లు ప్రకటించిన వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం విశేషం. కాలిఫోర్నియాలోని వాన్డెన్‌బెర్గ్ స్పేస్ బేస్‌లో ఈ పరీక్ష జరిగింది. ఈ క్షిపణి గంటలకు 15,000 వేగంతో.. 4,200 కిలోమీటర్లు ప్రయాణించింది. చివరికి మార్షల్ ఐల్యాండ్స్‌లోని అమెరికా స్పేస్ అండ్ మిసైల్ డిఫెన్స్ కమాండ్‌కు చెందిన బాలిస్టిక్ డిఫెన్స్ టెస్ట్ ప్రదేశానిరి చేరింది. ఈ పరీక్షపై అమెరికా గ్లోబల్ స్ట్రయిక్‌కమాండ్ జనరల్ థామస్ బుస్సెరీ ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఈ ఐసిబిఎం పరీక్ష అమెరికా సన్నద్ధతకు, శక్తికి చిహ్నం' అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలకు.. ఈపరీక్షి ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. రొటీన్‌లో భాగంగానే ఇది జరిందనిచెప్పారు. మినిట్‌మ్యాన్-3లో అత్యంత శక్తిమంతమైన మార్క్-21 రీఎంట్రీ వెహికల్ ఉంటుంది. దీనిలో న్యూక్లియర్ పేలోడ్‌ను అమర్చవచ్చు. గతంలో పలుమార్లు దీని శక్తి సామర్థ్యాలను అమెరికా పరీక్షించింది. గతేడాది నవంబరులో ట్రంప్ విజయానికి ముందు కూడా ఒకసారి పరీక్షించారు. వాస్తవానికి మినిట్‌మ్యాన్ క్షిపణి 1970ల నాటిది. దీనిని సెంటెనిల్ సిస్టమ్‌తో భర్తీ చేయాలని అమెరికా భావిస్తోంది. కానీ, మినిట్‌మ్యాన్-3మాత్రం అమెరికా వాయుసేన అత్యంత నమ్మకమైన క్షిపణిగా భావిస్తోంది. భవిష్యత్తులో అమెరికా గగనతలంలోకి ఏ క్షపణీ ప్రవేశించకుండా, ఏ అణ్వాయుధమూ సమీపించకుండా 'గోల్డెన్ డోమ్' అనే అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థ నిర్మించేందుకు అగ్రరాజ్యం శ్రీకారం చుట్టింది.

## సరస్వతి పుష్కరాల్లో 8వ రోజు కొనసాగుతున్న భక్తుల రద్దీ

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** భక్తుల రద్దీ కొనసాగుతోంది. సరస్వతి నదీ పుష్కర మహోత్సవాల్లో భాగంగా గురువారం 8వ రోజు ఘనంగా కొనసాగుతోంది.తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున మన రాష్ట్రం నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి పెద్దఎత్తున తరలివచ్చి పుష్కరస్నానాలు ఆచరిస్తున్నారు. పుణ్యస్నానాలు, ప్రత్యేక పూజలు, హారతులతో ఘాట్‌ల పరిసరాలు భక్తిశ్రద్ధలతో మార్మోగుతున్నాయి. భక్తులు అమ్మవారి దర్శనార్థం బారీ క్యూలైన్లలో నిలబడి భక్తిని చాటుకుంటున్నారు.పుష్కర స్నానానికి భద్ర తాదళాలు, పోలీసు సిబ్బంది, వైద్యసిబ్బంది సహా వాలంటీర్లు సమ ర్థంగా సేవలందిస్తున్నారు. భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశమున్న నేప థ్యంలో, అధికారులు అదనపు ఏర్పాట్లు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణ, నీటి సరఫరా, వైద్యసహాయ కేంద్రాలు, విస్తృతంగా అందుబాటులో తెచ్చారు. పుష్కరాల ముగింపునకు ఇంకా 4 రోజులు సమయం ఉన్నందున భక్తులు అధిక సంఖ్యలో వచ్చేఅవకాశం ఉన్న నేపథ్యంలో యంత్రాంగం అన్ని ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. భక్తులు పుష్కరాల్లో పాల్గొనాలని, సూచిం చిన మార్గదర్శకాలను పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ విజ్ఞప్తి చేశారు.



## దివ్యాంగుల సంక్షేమం కోసం మరిన్ని పథకాలు అమలు చేస్తాం

### పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్,మే 22 ,ప్రభాతవార్త :** దివ్యాంగుల సంక్షేమము, ఉన్నతి కోసం మరిన్ని పథకాలు అమలు చేసేందుకు కృషి చేస్తామని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం దివ్యాంగుల సంఘం నాయకులు సచివాయంలో కలిశారు.ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ లక్ష పథకం అమలు చేసినందుకు ఆమెకు వారు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఆర్టీసీ బస్సులు దివ్యాంగులకు ఉచిత రవాణా అంశము ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు.అర్హుల జాబితాలో దివ్యాంగులుంటే, వారి పేరు మీద ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేలా నిబంధనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించాలని మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ కు ఆదేశాలు జారీ చేశారు. దివ్యాంగుల పేరు పైన ఇద్దరమ్మ ఇండ్ల మంజూరు, ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే అంశాలను సంబంధిత శాఖ మంత్రులతో,ప్రభుత్వంతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తున్న మంత్రి సీతక్కకు దివ్యాంగ సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు ధైనంపల్లి మల్లికార్జున్, వికలాంగుల హక్కుల కార్యకర్త రాజేందర్‌తో పాటు దివ్యాంగ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

## సరస్వతి పుష్కరాలకు వెళ్లొస్తూ ప్రమాదం

### ఎదురెదురుగా ఢీకొన్న కారు, ఆటో

### ఇద్దరు మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం

**కాటారం, మే 22, ప్రభాతవార్త:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాకాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ఆచరించానికి వెళ్తున్న భక్తులు, ఆచరించి వస్తున్న భక్తులకు అనుకోని ప్రమాదం వారి కుటుంబాల్లో విషాదం నింపింది.ఈ సంఘటన గురువారం కాటారం టూ భూపాలపల్లి జాతీయ రహదారి మధ్యలో జరగ్గా ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాల య్యాయి.. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం క్షతగాత్రులను వరంగల్లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.ఇక పూర్తి వివరాల్లోకి వెళితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వరికోలుపల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబం సరస్వతి పుష్కర స్నానం కోసం ఆటో లో కాళేశ్వరం వెళ్తున్నారు. అలాగే హైదరాబాద్ కు చెందిన మరో కుటుంబం కారులో కాళేశ్వరం పుష్కర స్నానం ఆచరించి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో కాటారం మండలం లోని మేడిపల్లి, భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ మధ్యలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి.కాగా ఈ ఘటనలో ఆటో లో ప్రయాణిస్తున్న పది మంది వ్యక్తుల్లో రజిత(32), విష్ణు(20)లు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. అలాగే కారులో ప్రయానిస్తున్న మరో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. క్షతగాత్రులను అంబులెన్సు లో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజిఎంకు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కాటారం పోలీసులు దర్యాప్తు పడుతున్నారు.



## జూపార్కుల నిర్వహణలో ప్రపంచ స్థాయి విధానాలను పాటించాలి

### మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్,మే 22,ప్రభాతవార్త:** ప్రపంచ స్థాయి విధానాలను అవలంభించి రాష్ట్రంలోని జూ పార్కులను నడపాలని తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్రంలోని జూ పార్కుల్లో జంతువుల పరిరక్షణకి ప్రత్యేక చర్యలు అవసరమన్నారు.తెలంగాణలోని అన్ని జూ పార్కులతో పాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కులను మెరుగైన సౌకర్యాలతో తీర్చిదిద్దాలని మంత్రి సురేఖ చెప్పారు.జూలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే సందర్శకులు పెద్ద సంఖ్యలో వస్తారని అన్నారు.గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం కాన్ఫరెన్స్ హాలులో మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (జపాట్) 14వ గవర్నింగ్ బాడీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ,సందర్శకుల అభిరుచుల మేరకు,పర్యావరణానికి ఏమాత్రం ఇబ్బంది కలగకుండా, అటవీశాఖకు ఆదాయం సమకూరే విధంగా పకడ్బందీ ప్రణాళికలతో జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పనిచేయాలని చెప్పారు.ప్రపంచవ్యాప్తంగా జూ పార్కుల్లో అవలంబిస్తున్న విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.రాష్ట్రంలోని నెహ్రూ జూ పార్క్, కాకతీయ జూ పార్క్, పిల్లలమర్రి మినీ జూపార్క్, లోయర్ మానేరు డీర్ పార్క్, కిన్నెరసాని డీర్ పార్క్ జంతు సంరక్షణ చర్యలు,కేబీఆర్, మృగవని, మహవీర్ హరిణ వనస్థలి,ఇతర అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో సందర్శకుల సంఖ్య పెరిగినట్టు అధికారులు మంత్రికి వివరించారు. సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, అదనపు సౌకర్యాలపై దృష్టి సారించాలని, అందుకు సంబంధించిన అం శాలపై మంత్రి,శాఖ ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు.

## భూవిస్తీర్ణం, లావాదేవీల మేరకు సర్వేయర్ల నియామకం

### ప్రతి మండలానికి 6 నుంచి 8 మంది సర్వేయర్లు

### నక్షా లేని గ్రామాల్లో గ్రామసభలు పూర్తి: మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా లైసె న్స్‌డ్ సర్వేయర్ల నియామకం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలివిడతలో ఐదువేల మంది లైసె న్స్‌డ్ సర్వేయర్లను తీసుకోనున్నట్లు తెలిపారు. నక్షా లేని గ్రామాలు, లైసెన్స్‌డ్ సర్వే యర్ల శిక్ష ణపై గురువారం మంత్రి అధికారులతో సమీక్షిం చారు. వీరికి ఈనెల 26వ తేదీ నుంచి ఆయా జిల్లా కేంద్రాల్లోనే శిక్షణా కార్యక్రమాలను నిర్వహి స్తామన్నారు.రెండు నెలల పాటు వీరికి శిక్షణ ఇస్తామని, దరఖాస్తుదారులు సోమవారం ఆయా జిల్లాసర్వే అధికారులను సంప్రదిం చాలన్నారు. శిక్షణ పూర్తయినవెంటనే ఆయా మండలాల్లో భూవిస్తీర్ణం,భూ లావాదేవీలనుబట్టి 6 నుంచి 8మంది సర్వేయర్లను నియమిస్తామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతిగ్రామంలో, మండలంలో, రెవెన్యూ డివిజన్‌లో పట్టణ ప్రాంతాల్లో భూము లకు సంబంధించిన అనేక పంచాయితీలను ఈ సర్వేయర్ల ద్వారా శాశ్వత భూ పరిష్కారం చూపు తామన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఎమ్మార్వో, సబ్‌రిజిస్ట్రార్ దగ్గర భూములకు సంబంధించిన డాక్యుమెంట్లతో పాటు సర్వే పత్రాన్ని కూడా జతపరచాలని భూభారతి చట్టంలో పేర్కొన్న మంత్రి ఇందుకు అనుగుణంగానే సర్వే విభాగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో నిజాం కాలం నుంచి సర్వే జరగని ఇప్పటివరకు సర్వే రికార్డులు లేని 413 నక్షా గ్రామాలలో రీసర్వే చేపడు తున్నామని ఇందులో భాగంగా ప్రయోగా త్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామం,ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ ,ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు,సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఐదు గ్రామాల్లో ముందుగా గ్రామసభలు నిర్వహించి సర్వేకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించామన్నారు. నెలరోజుల్లో ఈ సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా ఏ సంస్కరణలు చేపట్టినా ప్రజాకోణంలో ఆలోచించి తీసుకుంటుందని ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికారులు పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు.

## పెండింగ్ బిల్లులన్నీ విడుదల చేయాలి

### పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శిని కలిసిన సర్పంచ్‌ల సంఘం జెఎసి అధ్యక్షుడు యాదయ్యగౌడ్

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** పంచాయతీరాజ్ శాఖ బుధవారం విడుదల చేసిన పెండింగ్ బిల్లులు ఏమాత్రం సరిపోవని, పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జెఏసి అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన సచివాలయంలో పంచాయతీ రాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి లోకేష్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు మంజూరు అంటూ ప్రభుత్వం చేసిన ప్రకటనలు అవాస్తవమన్నారు. గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అనేకమంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటే, ఆందోళన కార్యక్రమాలు చేస్తుంటే బుధవారం ప్రభుత్వం రూ.153 కోట్లు నిధులు విడుదల చేశామని చెప్పడం దాంట్లో సర్పంచ్ల పెండింగ్ బిల్లులు ఇచ్చామనే దాంట్లో సర్పంచులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు.

**బిల్లుల విడుదలలో స్పష్టత లేదు: లక్ష్మీనర్సింహారెడ్డి**

రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల విడుదలలో స్పష్టత లేదంటూ సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి గురువారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం 12,769 గ్రామపంచాయతీలకు గాను రూ.153 కోట్లు మాత్రమే విడుదల చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.1200 కోట్ల రూపాయల బకాయిలకు సర్పం చులకు సంబంధించి ఎంత శాతం పెండింగ్ బకాయిలు విడుదల చేశారని ఆయన ప్రశ్నించారు. గ్రామపంచాయతీ వారిగా బకాయిలు ఎన్ని, విడుదల చేసిన బిల్లులు ఎన్ని,ఇంకా ఎన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలన్నారు.

## విక్టోరియా హోమ్‌ను సందర్శించిన మిస్ వరల్డ్ పోటీదారులు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త :** సరూర్‌నగర్‌లోని హెరిటేజ్ భవనం విక్టోరియా హోమ్‌లో 107 దేశాల మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు గురువారం సందడి చేశారు. వారికి అధికారులు, రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. 122 సంవత్సరాల పురాతన విక్టోరియా హోమ్ భవన నిర్మాణాన్ని చూసి అందాల భామలు అబ్బురపడ్డారు. చిన్నారులతో కలిసి సుందరీ మణులు సందడి చేశారు. ఫార్చునర్ హాస్పిటల్ టీ అండ్ ఇన్ఫ్రా లాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛారిటీ ఈవెంట్‌లో పాల్గొన్న ముద్దుగుమ్మలు, వీఎం హోమ్‌లో వరల్డ్ లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, ఏవీ రూమ్‌ను ప్రారంభించారు. వీఎం హోమ్‌లో చదువుకునే అనాథ పిల్లలతో ముచ్చటించిన ముద్దుగుమ్మలు, హోమ్‌లో చదువుకునే 300 మంది అనాథ పిల్లలకు డ్రెస్‌లు, సూట్‌కేసులు, బుక్స్, స్టేషనరీ ఐటమ్స్, కాళ్లకు పట్టగొలుసులు అందించారు. విక్టోరియా హోమ్‌కు వచ్చిన అందగత్తెలను చీర, గోల్డ్ కాయిన్‌తో సత్కరించారు. అంతకుముందు శిల్పారామంలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందడి చేశారు.



**ఇందిరా మహిళా శక్తిబజార్‌ను సందర్శించిన మిస్ వరల్డ్ పోటీదారులు**

ఎర్న్,ఎంపవర్, ఎవాల్వ్ సాధనే మా లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. గురువారం మాదాపూర్ లోని శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజా రును మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మిస్ వరల్డ్ పోటీదారులను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే సంకల్పంతో సిఎంరేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోం దన్నారు. మహిళలకు ఆర్థికస్వేచ్ఛ కల్పించేందుకు మహిళా సంఘాల ద్వారా ఎన్నో రకాల వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నా మన్నారు. మహిళా ప్రగతి సమాజ ప్రగతిఅన్న అంబేద్కర్ ఆశయాన్ని ఆచరణలో చేసి చూపిస్తున్నా మన్నారు.మిస్ వరల్డ్ పోటీదారులు తెలంగాణ చారిత్రక సాంస్క ృతిక వారసత్వ ప్రదేశాలను సందర్శించడం అభినందనీ యమన్నారు.అవి కేవలం చారిత్రక ప్రదేశాలే కావు.కష్టానికి, తెగింపునకు, పోరాటానికి కేంద్రాలన్నారు. నాగరిక చరిత్రలో మొదట మాతృస్వామ్య వ్యవస్థ ఉండేదని,కానీ ప్రపంచం మొత్తం పితృస్వామ్య వ్యవస్థలోకి వెళ్లింద న్నారు.దీంతో మహిళలు తమ ఆర్థిక స్వతంత్రతను కోల్పోయారన్నారు. కానీ కాలం మారిందని, అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.మిస్ వరల్డ్ పోటీలను 72 ఏళ్ళ తర్వాతఏళ్ల తర్వాత తెలంగాణ వేదికవ్వడం మార్పుకు సంకేతమ న్నారు. అందం అంటే బాహ్య సౌందర్యం కాదని, అందమంటే అంతర్గత శక్తి సామర్థ్యాలు, మేదస్సు, స్వేచ్ఛ భావన, స్థితప్రజ్ఞత అని వివరిం చారు. మహిళలు కోల్పోయిన ఆర్థిక స్వతంత్రతను,సాధికారతను తిరిగి సాధించేందుకు ఇందిరా మహిళాశక్తి విధానాన్ని అమలుచేస్తు న్నామన్నారు. సాధికారత అంటే విద్యకు, ఉపాధికి,ఆర్థిక శక్తికి, సమాన హక్కులకు అవకాశాలు కల్పించడమని,గ్రామీణ పేదరిక మహిళలకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.ఇందిరా మహిళా శక్తి బజార్ మహిళల కలలు,నైపుణ్యం,కష్టపడే తత్వానికి కలబోతగా నిలుస్తోంద న్నారు. సుందరీమణులు, గ్రామీణ శ్రామిక మహిళలు సమానమే అని చాటి చెప్పేందుకు మిస్ వరల్డ్ పోటీదారులను ఆహ్వానించామన్నారు.

## మార్కెటింగ్ శాఖ అధికారులకు మెమో

### అధికారుల పనితీరును పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త :** మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు అధికారులకు ప్రభుత్వం మెమో ఇచ్చింది. విధుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారనే కారణంతో చర్యలు చేపట్టింది. హైదరాబాద్ బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయాన్ని గురువారం ఆయన అధికారుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలస్యంగా వచ్చిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయానికి హాజరు కాని అధికారులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యంగా వచ్చిన సిబ్బందికి వెంటనే మెమో ఇచ్చి, సంజాయిషీ తీసుకోవాల్సిందిగా మార్కెటింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు. రైతులకు అధికారులు అందుబాటులో లేకపోతే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. మొత్తం 53 మంది రెగ్యులర్ సిబ్బందిలో 16 మంది, 42 ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో 5గురు ఆలస్యంగా హాజరయినట్లు గుర్తించారు. వారికి మెమో జారీ చేయాలని తెలిపారు. అంతేకాకుండా కార్యాలయంలో ఫేస్ రికగనైజేషన్‌తో బయో మెట్రిక్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతిరోజు సిబ్బంది హాజరు వివరాలను తమ కార్యాలయానికి పంపాలన్నారు. ఇకపై ఆలస్యాన్ని వచ్చిన అధికారులు మరియు అందుబాటులో లేని అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు.

## భాగ్యరెడ్డివర్మ గొప్ప దళిత సంస్కర్త, మహామేధావి

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య

### సంగిశెట్టి శ్రీనివాస్‌కు భాగ్యరెడ్డివర్మ స్మారక జీవనసాఫల్య పురస్కారం-2025 ప్రదానం



సంగిశెట్టి శ్రీనివాస్‌కు భాగ్యరెడ్డివర్మ స్మారక జీవితసాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న వెంకటయ్య, వెన్నెల, మామిడిహరికృష్ణ, ఘంటా చక్రపాణి, క్షితిజ తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మే 22, ప్రభాతవార్త :** మాదరి భాగ్యరెడ్డివర్మ గొప్ప దళిత సంస్కర్త, మహామేధావని అని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర షెడ్యూ ల్డు కులాల అభివృద్ధిశాఖ, తెలంగాణ భాషా సాం స్కృతికశాఖ, ఆది-హిందూ సోసల్ సర్వీస్ లీగ్ సంయుక్త ఆధ్వర్యం లో రవీంద్ర భారతిలో ఈరోజు రాత్రి జరిగిన మాదరి భాగ్య రెడ్డివర్మ 137 జయంతో త్స వం కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ సాం స్కృతిక సారధి అధ్యక్షురాలు జి.వి. వెన్నెల, డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యా లయం ఉపా ధ్యక్షుడు ఘంటా చక్రపాణి, రాష్ట్ర షెడ్యూల్డు కులాల అభివృద్ధిశాఖ కమిషనర్ ఎస్.క్షితిజ, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, ఆదిహిందూ సోషల్ సర్వీస్‌లీగ్ అధ్యక్షుడు డా. రాహుల్ అమోలక్‌శాస్త్రి తదితరులతో కలిసి భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడుతూ దళితులు ఏవిధంగా వెనక్కు నెట్టివేయ బడ్డారు... వారికి ఏవిధంగా సహాయ సహకారాలు అందించాలని బాగా ఆలోచించిన మహానుభావుడని కొని యాడుతూ, అతని అడుగుజాడల్లో నడుచుకుంటూ ఆయన ఆశయసాధన కోసం ట్రస్టు ఏర్పాటు చేయబడ్డాదో వారు భాగ్యరెడ్డివర్మ ఆశయాలకు అనుగుణంగా కొనసాగింపుగా మనందరం కంకణబద్ధులం కావాలని పిలుపునిచ్చారు. జి.వి.వెన్నెల మాట్లాడుతూ భాగ్యరెడ్డివర్మ వేసిన పునాదులమీద నవసమాజం, సమసమాజం ఏర్పడాలనేది తన కోరిక అన్నారు. భాగ్యరెడ్డి వర్మమీద గద్దర్ రాసిన భాగ్యరెడ్డివర్మ మా భాగ్య రేఖనమ్మా పాటను పాడి వినిపించారు. అనంతరం ఘంటా చక్రపాణి ప్రసంగించారు. అతిథుల చేతులమీదుగా ప్రముఖ రచయిత, చరిత్రకారుడు డా. సంగిశెట్టి శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించి భాగ్యరెడ్డివర్మ స్మారక జీవితసాఫల్య పురస్కారం-2025ను ప్రదానం చేసి ఎంతగానో అభినందించారు.

## మీరు నీతిమంతులైతే విచారణ చేయమని సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయండి

### కెటిఆర్‌పై పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ విసుర్లు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణంలో ఏలాంటి అక్రమాలకు పాల్పడకపోతే మీరు నిజంగా నీతిమంతులైతే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విచారణ చేయాలని బిఆర్‌ఎస్ వర్కింగ్‌ప్రసిడెంట్ కెటిఆర్ కోరాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ తెలిపారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసి ఏ విచారణ కావాలో అడగండిధైర్యం ఉంటే, సిఐడి విచారణ కావాలా,జుడిషియల్ విచారణ కావాలా అన్నది ప్రభుత్వానికి రాయండి అని ఆయన కోరారు.దీనిపై అప్పుడు అవినీతి ఏవిధంగా జరిగిందో బట్టబయలవుతుందినిజాయతీని నిరూపించుకునేందుకు కేటీఆర్ ముందుకు రావాలని మహేష్ సూచించారు.కోర్టు ఇచ్చిన తీర్పుపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మహేష్‌కుమార్ స్పందిస్తూ పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై న్యాయస్థానం తీర్పు తమకు అనుకూలంగా ఇచ్చినట్లు, తామంతా నీతిమంతులైనట్లు చెప్పేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నాడు కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాగం జనార్ధన్ రెడ్డి ఈ పథకంపై కోర్టులో కేసు వేశారు. ఆయన పూర్తి ఆధారాలతో ఆ రోజు న్యాయస్థానంలో కేసు వేశారని వివరించారు. ఆయనను బిఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకుని ఆ కేసును నీరుగార్చేట్లు, వీగిపోయేట్లు వ్యవహరించారని ఆరోపించారు. మీ పార్టీలో ఉన్న నాయకుడు మీ పార్టీ అధినేత కేసీఆర్‌పై ఎలా కొట్లాడతారని అన్నారు. దీంతో తామంతా నీతిమంతులమని, చేసిన అవినీతి మాయమైనట్లు కేటీఆర్ మాట్లాడుతున్నారని ఆయన అన్నారు.

## తడిసిన ధాన్యం కొనుగోలుకు కలెక్టర్లకు ఆదేశాలు

### ధాన్యం కొనుగోలులో బిఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం

### రబీ సీజన్‌లో నేటికి 60.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

### పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరబాద్, మే22,ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు అంశంలో బి.ఆర్.ఎస్ అసత్యప్రచారనికి పూనుకుని ప్రజల్లో గందరగోళం సృష్టిస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఈ రబీ సీజన్ లో గురువారం సాయంత్రం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 60.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ఆయన గణాంకాలతో వెల్లడించారు.అదే బి.ఆర్ ఎస్ పాలన లో అంటే 2022-23 రబీ సీజన్ లో నాటి పాలకులు మే 22 నాటికి కొనుగోలు చేసింది కేవలం 36.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే నని ఆయన పేర్కొన్నారు.బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో సాగు అయిన చివరి రబీ సీజన్ లో నాటి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంతో పోల్చి చూస్తే ఈ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత రబీ సీజన్లో అదే మే 22 నాటికి రాష్ట్ర ప్రభుత్వం 24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా కొనుగోలు చేసిందన్నారు. ఈ గణాంకాలే బి.ఆర్.ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారానికి నిదర్శనమన్నారుచివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకున్న రైతాంగ అనుకూల విధానాలతో అటు ఖరీఫ్ ఇటు రబీ లోనూ రికార్డు స్థాయిలో ధాన్యాం దిగుబడి అయ్యిందన్నారు అత్యధికంగా దిగుబడి అయిన ధాన్యం దిగుబడిని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలను పెద్ద సంఖ్యలో పెంచామని ఆయన తెలిపారు.


## కెఆర్ఎంబి ఆదేశాలకు అనుగుణంగా ఎన్ఎస్‌పి నుంచి నీటి విడుదల

**హైదరాబాద్, మే 22,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలకు నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి గురువారం తాగునీటి నీరు విడుదల చేస్తున్నారు.శ్రీశైలం,నాగార్జునసాగర్‌లో 16.972టిఎంసిలు వినియోగానికి అందుబాటులో ఉన్నాయి. ఇందులో 10.26టిఎంసిలు తెలంగాణకు ,4టిఎంసిలు ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేస్తారు.ఈమేరకు కెఆర్ఎంబి ఛైర్మన్ ఉత్తర్వులు జారీచేశారు.జూలై 31వరకు శ్రీశైలం రిజర్వాయర్ 800అడుగులు నీటి నిల్వఉండలా చూసుకోవాలని కెఆర్ఎంబి తెలిపింది.

## నాకు ఎలాంటి షోకాజు నోటీసులు రాలేదు

### మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** ఆలిండియా మహిళా కాంగ్రెస్ నుంచి ఇప్పటి వరకు తనకు ఎలాంటి షోకాజు నోటిసులు అందలేదని తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతరావు అన్నారు.గురువారం గాంధీ భవన్‌కు వచ్చిన సునీతరావు మాట్లాడుతూ తనపై కొందరు తప్పడు ప్రచారం చేస్తు న్నారని, అసలు తాను చేసిన తప్పేందో పార్టీ పెద్దలే చెప్పాలని సునీత రావు కోరారు. తనకు ఇప్పటి వరకు షోకాజు నోటిసులు రాలేదని వస్తే మీడియా సమావేశం పెట్టి అన్ని వివరాలు చెబుతానని విలేఖరులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానం ఇచ్చారు.మహిళా కాంగ్రెస్ నాయకులకు పార్టీ పదవుల కోసం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ కలిస్తే ఆమె పిసిసి చీఫ్‌ను కలవమన్నారని వివరించారు. బుధవారం తెలంగాణ మహిళా కాంగ్రెస్ విభాగం అధ్యక్షురాలు సునీతకు ఆలిండియా మహిళ కాం గ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబ షోకాజ నోటిసులు జారీచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ సంస్థాగత బలోపేతం కోసం కృషి చేసిన మహళ కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీలో ప్రాధన్యత కలిగిన పోస్టు లు ఇవ్వాలని కోరుతూ గాంధీ భవన్‌లో పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ చాంబర్ ముందు బైఠాయించి నిరసన చేయడంతో పార్టీ హైకమాండ్ ఆగ్రహానికి ఆమె గురైంది. దీనితో అల్కాలాంబా సునీతారావుకు నోటీసులు జారీచేశారు.




ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌లో వామపక్షాల ఆధ్వర్యంలలో నిరసన ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

## మావోయిస్టు కేశవరావు మృతిపై వామపక్షాల ఆందోళన

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 22, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ పేరుతో మావో యిస్టు అగ్రనేత నంబాల కేశవరావుసహా 27 మంది ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ వామ పక్షాలు, సిపిఐ(మాస్‌లైన్), సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసిపిఐ(యు), ఎస్‌యుసిఐ(సి), సిపిఐ(ఎంఎల్), ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసి క్రాస్‌రోడ్స్ లో తీవ్రనిరసన వ్యక్తం చేశారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావుతోపాటు మరో 27 మందిని ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపా రనడాన్ని సిపిఎం కార్యదర్శివర్గసభ్యుడు వీరయ్య, సిపిఐ నేత పశ్యపద్మ, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఎం.హన్మేష్, సిపిఐ(ఎంఎల్) వేములపల్లి వెంక ట్రామయ్య, ఎస్‌యుసిఐ(యు) మురహరి, ప్రసాద్, సుధాకర్ మాట్లాడుతూ తప్పుబట్టారు. సమస్యల పరిష్కారానికి చర్చలే మార్గమని కేంద్ర ప్రభు త్వానికి పలుమార్లు సూచించినా పట్టించుకోలేదని, ఇప్పుడు ప్రజాస్వామ్య విలువలకు వ్యతిరేకంగా ప్రాణాలు తీస్తోందని మండిపడ్డారు. శాంతిచర్చల విషయంలో కేంద్రప్రభుత్వంగానీ, బిజెపి పాలనలో ఉన్న ఛత్తీస్‌గఢ్ సర్కారు గానీ సాను కూలంగా స్పందించడం లేదని స్పష్టం చేశారు.

## సిఎం ఓఎస్డీనంటూ బెదిరించిన కేసులో మాజీ క్రికెటర్ నాగరాజు అరెస్ట్

### ర్యాపిడో, కంట్రీ డిలైట్ ఎండిలకు ఫోన్లు చేసి డబ్బులు డిమాండ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 22:** ముఖ్యమంత్రి కార్యాలయంలోని కీలక అధికారి పేరు చెప్పి బెదిరింపులకు, వసూళ్లకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలపై ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ రంజీ క్రికెటర్ బుడుమూరు నాగరాజును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాగరాజు పలువురు వ్యాపారవేత్తలను లక్ష్యంగా చేసుకుని ఈ మోసాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం జిల్లా, పొలాకి మండలం, వ్యాయిరిపేటకు చెందిన బుడుమూరు నాగరాజు, తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓఎస్ అని పరిచయం చేసుకుంటూ పలు మోసాలకు ఒడిగట్టినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ప్రముఖ రవాణా సేవల సంస్థ ర్యాపిడో, పాల ఉత్పత్తుల సంస్థ కంట్రీ డిలైట్ మేనేజింగ్ డైరెక్టర్లకు ఫోన్లు చేసి, నాగరాజు డబ్బులు డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులు అందాయి. పలు రియల్ ఎస్టేట్ కంపెనీల ఛైర్మన్లకు కూడా సీఎం ఓఎస్డీ పేరుతో వాట్సాప్ ద్వారా సందేశాలు పంపి బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

ఈ వ్యవహారంలో మరింత నమ్మకం కలిగించేందుకు, నాగరాజు ఏకంగా సీఎం ఓఎస్డీ పేరుతో ఒక నకిలీ ఈమెయిల్ ఐడీని కూడా సృష్టించినట్లు సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అందిన ఫిర్యాదుల ఆధారంగా రంగంలోకి దిగిన పోలీసులు, పక్కా సమాచారంతో శ్రీకాకుళంలో నాగరాజును అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని హైదరాబాద్‌కు తరలించి, కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు సైబర్ క్రైమ్ అధికారులు తెలియజేశారు. బుడుమూరు నాగరాజుకు గతంలోనూ నేర చరిత్ర ఉంది. గతంలో అతడు కోడెల శివ రాంపై కొన్ని తప్పుడు కేసులు పెట్టి, ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకున్న ఘటన చర్చనీయాంశమైంది. అంతేకాకుండా, 2023లో శ్రీకాకుళం ప్రాంతంలో సుమారు 22 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడిన కేసులోనూ నాగరాజు నిందితుడిగా ఉన్నాడు.

## ప్రభుత్వ లక్ష్యానికి సహకరించండి

### వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత
### సామాజిక బాధ్యతలో ముందుండాలి
### బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త :** ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలకు సంబంధించిన లక్ష్యాలను అధిగమించేందుకు బ్యాంకులు సహకరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో సామాజిక బాధ్యత నిర్వహణలో ముందుండాలని సూచించారు. హైదరాబాదులో గురువారం రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. ఇందులో వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావుతో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలు రానటువంటి నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాస పథకం అమలులో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి సహకరించాలన్నారు. ఐదు లక్షల మంది యువతకు రూ.9 వేల కోట్ల విలువైన మంజూరు పత్రాలు జూన్ 2న ఇవ్వడం దేశ చరిత్రలో ఏ రాష్ట్రం కూడా తీసుకురాలేదని అన్నారు. ఇందుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలన్నారు. ఈ పథకానికి రూ.6,250 కోట్ల సబ్సిడీ ఇస్తున్నామని చెప్పారు. ఇందు కోసం రూ.8 లక్షల కోట్ల రూపాయల పైబడి లక్ష్యంగా పెట్టుకున్న వార్షిక రుణ ప్రణాళికలో బ్యాంకర్లు 0.2 శాతం మాత్రమే వెచ్చించాల్సి ఉంటుందన్నారు. చదువుకునే ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి చదివిస్తున్నామన్నారు. తద్వారా విద్యలో నైపుణ్యం కలిగిన యువత ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని చెప్పారు. అలాగే రాష్ట్రంలో మానవ వనరులను అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఇందుకోసం రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అభివృద్ధికి కావలసిన మౌళిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కాగా వ్యవసాయానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందులోనూ ఉద్యానవన పంటలకు ప్రాముఖ్యత కల్పిస్తూ రాష్ట్ర డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆయిల్ ఫామ్ పంటలకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులో ఉదారంగా వ్యవహరించాలని కోరారు. అలాగే రూ.2 లక్షల రుణాలు ఉన్న రైతులందరికీ ఏకకాలంలో రూ.21 వేల కోట్లను బ్యాంకుల్లో జమ చేశామన్నారు. రైతు భరోసా అందిస్తున్నామని, రైతు బీమా ప్రీమియం డబ్బులను కూడా ప్రభుత్వమే చెల్లిస్తున్నదని వివరించారు. అదేవిధంగా అడవి బిడ్డల జీవన ప్రమాణాలు పెంచే లక్ష్యంగా కలిగి ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొంది ఉన్న 6.70 లక్షల ఎకరాలను సౌర విద్యుత్తు ద్వారా సాగులోకి తీసుకురావడానికి రూ.12,600 కోట్లను కేటాయించామని వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఈ ఏడాది వడ్డీ లేకుండా రూ.20 వేల కోట్లకు పైగా రుణాలు ఇచ్చామని, రానున్న 4 ఏళ్లలో రూ.లక్ష కోట్లు ఇచ్చే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ సంఘాల్లోని సభ్యులకు ఆర్టీసీలో అద్దె బస్సులు పెట్టుకోవడానికి, సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో న్యూ ఎనర్జీ పాలసీ తీసుకువచ్చి 2030 సంవత్సరం నాటికి 20వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో మూసి పునర్జీవం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్డు మధ్యన అనేక రకాలైన క్లస్టర్‌తో పరిశ్రమల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. 2025-26 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. సామాజిక బాధ్యతను నెరవేర్చే క్రమంలో బ్యాంకర్లు ముందంజలో ఉండాలని సూచించారు. ప్రభుత్వాలు బ్యాంకింగ్ రంగం రెండు కలిసి సామాజిక బాధ్యతను నెరవేర్చడానికి ముందుకు వెళితే సమాజంలో అశాంతి లేకుండా ఉంటుందన్నారు. ఇందులోఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్బిఐ రీజినల్ డైరెక్టర్ చిన్మోయ్ కుమార్, నాబార్డ్ సీజీఎం ఉదయ్ భాస్కర్, ఎస్ఎల్‌బిసి కన్వీనర్ ప్రకాష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌తో మరోసారి హరీశ్‌రావు భేటీ


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 22:** కాళేశ్వరం కమిషన్ నోటీసుల నేపథ్యంలో బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌తో మాజీ మంత్రి హరీష్‌రావు మరోసారి భేటీ అయ్యారు. విచారణలో భాగంగా మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్‌కు మంగళవారం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రెండు రోజుల మాజీ సిఎం కెసిఆర్‌తో ఎర్రవల్లి నివాసంలో హరీష్‌రావు సమావేశం కాగా, గురువారం మరోసారి భేటీ అయ్యారు.

కాళేశ్వరం కమిషన్ నోటీసులపై కెసిఆర్, హరీష్‌రావు సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. నోటీసులకు ఎలా స్పందించాలన్న అంశంపై ఇరువురు మంతనాలు జరిపినట్లు సమాచారం. అయితే, కమిషన్ ముందు కెసిఆర్, హరీష్‌రావులు విచారణకు హాజరవుతారా..? లేదా లేక తమ ప్రతినిధి ద్వారా కమిషన్‌కు సమాధానం ఇస్తారా..అనేది చర్చ జరుగుతోంది.

## జమ్మూకాశ్మీర్ మాజీ గవర్నర్‌పై సిబిఐ ఛార్జ్‌షీట్!

**శ్రీనగర్, మే 22:** కిరు జలవిద్యుత్ ప్రాజెక్టులో రూ.2,200 కోట్ల సివిల్ పనుల కేటాయింపులో అవినీతి ఆరోపణలపై జమ్మూ కశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌తో పాటు మరో ఐదుగురిపై గురువారం కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) చార్జిషీట్ దాఖలు చేసింది. మూడేళ్ల దర్యాప్తు తర్వాత సీబీఐ తన నివేదికను ప్రత్యేక కోర్టుకు సమర్పించింది. జమ్మూ కశ్మీర్ ప్రభుత్వ అభ్యర్థన మేరకు సీబీఐ ఏప్రిల్ 2022లో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. సత్యపాల్ మాలిక్ ఆగస్టు 2018 నుంచి అక్టోబర్ 2019 వరకు జమ్మూ కశ్మీర్ గవర్నర్‌గా కొనసాగారు. ఈ వైపు సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత ఆయన ఆసుపత్రిలో చేరారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. తాను ఎవరితోనూ మాట్లాడలేని స్థితిలో ఉన్నానని ఇన్‌స్టా పోస్ట్‌లో పేర్కొన్నారు. తనకు చాలామంది శ్రేయోభిలాషుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తున్నాయని.. వాటికి తాను సమాధానం చెప్పలేకపోతున్నానన్నారు. మాలిక్ 2018 ఆగస్టు 23 నుంచి 2019 అక్టోబర్ 30 వరకు జమ్మూ కశ్మీర్ గవర్నర్‌గా ఉన్నారు. కిరు జల విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన రెండు ఫైల్స్‌ను అప్రూవ్ చేసేందుకు తనకు రూ.300కోట్ల లంచం ఆఫర్ చేశారని ఆయన వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. గతేడాది సీబీఐ సోదాల తర్వాత తనపై వచ్చిన అవినీతి ఆరోపణలను ఆయన ఖండించారు. తానే ఫిర్యాదు చేస్తే తన ఇంట్లో సోదాలు నిర్వహించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను ఆయన ఖండించారు.

అవినీతికి పాల్పడిన వారిపై దర్యాప్తు చేయడానికి బదులుగా సీబీఐ తన నివాసంపై దాడులు చేసిందని మాలిక్ పేర్కొన్నారు. దాడుల్లో నాలుగైదు కుర్తాలు, పైజామాలు తప్ప వారికేమీ దొరకవని.. ప్రభుత్వ సంస్థలను దుర్వినియోగం చేయడం, నియంత తనను భయపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను రైతు కొడుకునని భయపడను, తలవంచనని స్పష్టం చేశారు. సీబీఐ అప్పటి చీనాబ్ వ్యాలీ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ నవీన్ కుమార్ చౌదరి, ఎంఎస్ బాబు, ఎంకే మిట్టల్, అరుణ్ కుమార్ మిశ్రాతో పాటు ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ పటేల్ ఇంజినీరింగ్ లిమిటెడ్‌పై కేసు నమోదు చేసింది. 2022 ఏప్రిల్‌లో సీబీఐ నమోదుచేసిన ఈ కేసు



దర్యాప్తులో భాగంగా 2024 ఫిబ్రవరిలో ఢిల్లీ, జమ్మూకశ్మీర్‌లోని సత్యపాల్ మాలిక్ నివాసాలతో సహా 30కు పైగా ప్రదేశాల్లో సీబీఐ సోదాలు నిర్వహించింది. మాలిక్ సహచరులు, కిరు జలవిద్యుత్ ప్రాజెక్టు అమలు సంస్థ చీనాబ్ వ్యాలీ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో సంబంధం ఉన్న అధికారులను కూడా సీబీఐ లక్ష్యంగా దాడులు సోదాలు నిర్వహించింది. రీటెండరింగ్ ద్వారా ప్రాజెక్టును తిరిగి టెండర్ చేయాలని బోర్డు మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నప్పటికీ అది అమలు కాలేదని, చివరకు కాంట్రాక్టును పటేల్ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కు అప్పగించారని, ఇందులో అక్రమాలు జరిగాయని సీబీఐ ఆరోపించింది.

## కొలనుపాక సోమేశ్వర ఆలయానికి నిధులు కేటాయించండి

### కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు
### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి వినతి

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** యాదాద్రిభువనగిరి జిల్లాలోని కొలనుపాకలో ఉన్న శ్రీ సోమేశ్వర స్వామి ఆలయానికి ప్రసాద్ 2.0 పథకం కింద నిధులను విడుదల చేయాలని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. గురువారం కేంద్ర మంత్రిని కలిసి ఆలయ విశిష్టతను, పరిస్థితులను వివరించారు. ప్రసాద్ పథకంలో నిధులను కేటాయించాలని కోరారు. శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం చాళుక్య కాలం (7-10వ శతాబ్దం సిఈ) నాటి గొప్ప వారసత్వం కలిగిన పురాతన శివాలయం అని వివరించారు. తరువాత కాకతీయ రాజవంశం (12-13వ శతాబ్దం సిఈ) కింద అభివృద్ధి చెందిందన్నారు. ఈ ఆలయం చాళుక్య శైలి శిల్పాలు, కాకతీయ యుగం శిల్పాలను ప్రదర్శించే ఒక నిర్మాణ అద్భుతం అన్నారు. ఉజ్జయిని జగద్గురు శ్రీ సిద్ధలింగ రాజదేశికేంద్ర శివాచార్య స్వామీజీ ప్రస్తుతం ఆలయ పరిపాలనను పర్యవేక్షిస్తున్నారని వివరించారు. సోమేశ్వర స్వామి ఆలయానికి ఆనుకుని ఉన్న 2,000 సంవత్సరాల నాటి ప్రముఖ శ్వేతాంబర జైన తీర్థంకర మందిరం ఈ గ్రామాన్ని బహుళ మత తీర్థయాత్ర కేంద్రంగా మారుస్తుందన్నారు. కొలనుపాక మతపరమైన ప్రాముఖ్యతను మరింత పెంచుతూ, ఇక్కడ అనేక సమాజ ఆధారిత మఠాలు స్థాపించబడ్డాయన్నారు. శివరాత్రి పండుగను వైభవంగా జరుపుకుంటారని, ఇక్కడి పొరుగు రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు వస్తారన్నారు. చారిత్రక, మతపరమైన ప్రాముఖ్యత ఉన్నప్పటికీ, శ్రీ సోమేశ్వరస్వామి ఆలయానికి తక్షణ మౌలిక సదుపాయాలు, పర్యాటక అభివృద్ధి అవసరం అన్నారు. భక్తుల కోరికలను పరిగణనలోకి తీసుకుని, ఈ చారిత్రక తీర్థయాత్ర స్థలాన్ని ప్రసాద్ 2.0 పథకం కింద చేర్చాలని, పునరుద్ధరణకు ఆర్థిక సహాయం మంజూరు చేయాలంటూ కేంద్ర మంత్రిని కోరారు. ఈమేరకు ఒక వినతి పత్రాన్ని సైతం అందించారు.

## పాకిస్థాన్ కోసం గూఢచర్యం.. వారణాసి వ్యక్తి అరెస్ట్



**లక్నో, మే 22:** పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్నాడన్న ఆరోపణలతో వారణాసికి చెందిన వ్యక్తిని ఉత్తరప్రదేశ్ ఉగ్రవాద నిరోధక దళం పోలీసులు అరెస్ట్ చేశారు. కీలక సమాచారాన్ని పాకిస్థాన్ వ్యక్తులకు అతడు చేరవేసినట్లు ఆరోపించారు. దేశ అంతర్గత భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పాకిస్థాన్ వ్యక్తులకు అతడు చేరవేసినట్లు ఆరోపించారు. నిందితుడ్ని వారణాసికి చెందిన తుఫైల్‌గా పేర్కొన్నారు. కాగా, నిషేధిత పాక్ ఉగ్రవాద సంస్థ తెహ్రీక్‌ఎ లబ్బాయిక్ నేత మోలానా షా రిజ్వీ వీడియోలను వాట్సాప్ గ్రూపులలో అతడు షేర్ చేశాడని పోలీసులు తెలిపారు. బాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రతీకారం తీర్చుకోవాలని, భారత్‌లో షరియా చట్టాన్ని అమలు చేయాలని పిలుపునిచ్చే సందేశాలతో పాటు, 'ఘజ్వాఎహింద్' కోసం సందేశాలు పంపాడని ఏటీఎస్ అధికారులు చెప్పారు. మరోవైపు వారణాసిలోని రాజ్‌ఘాట్, నమో ఘాట్, జ్ఞాన్‌వాపి, రైల్వే స్టేషన్, ఢిల్లీలోని ఎర్రకోట వంటి సున్నితమైన ప్రదేశాల ఫోటోలను పాకిస్థాన్‌లోని పరిచయస్తులకు తుఫైల్ షేర్ చేశాడని పోలీసులు ఆరోపించారు. స్థానిక వ్యక్తులు, పాక్ నెట్‌వర్క్‌ల మధ్య కమ్యూనికేషన్ కోసం వారణాసిలోని వాట్సాప్ గ్రూప్ లింక్‌లను కూడా నిందితుడు షేర్ చేసినట్లు తెలిపారు. అతడిపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్‌రావు ఇంటికి నోటీసులు అంటించిన సిట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 22:** ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు ఇంటికి సిట్ టీమ్ చేరుకుని నోటీసులు అంటించారు. ప్రభాకర్ రావును ప్రొక్లయిమ్డ్ అఫెండర్‌గా ప్రకటించాలని నాంపల్లి కోర్టును పోలీసులు కోరారు. దీనికి సంబంధించి జనవరిలో పోలీసులు పిటిషన్ వేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం రెండు రోజుల క్రితం కీలకమైన ఆదేశాలు ఇచ్చింది. ప్రభాకర్ రావు గడువులోపు న్యాయస్థానం ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. కోర్ట్ ఇచ్చిన గడువులోపు హాజరుకాకుంటే ప్రకటిత నేరస్తుడిగా ప్రకటిస్తామని కోర్టు తెలియజేసింది.

ప్రభాకర్‌రావు ప్రకటిత నేరస్తుడిగా ప్రకటిస్తే ఆయన స్థిర, చర ఆస్తులను జప్తు చేసే అవకాశం ఉంది. జూన్ 20 లోపు వ్యక్తిగతంగా న్యాయస్థానం ముందు హాజరుకావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో గురువారం) తారామతిలోని ప్రభాకర్ రావు ఇంటికి పోలీసులు చేరుకున్నారు. అయితే ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ ఇంటికి పోలీసులు నోటీసులు అంటించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నారు. అందులో భాగంగా పోలీసుల విచారణలో కీలకమైన అంశాలు వెలుగు చూశాయి.

ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు అయిన తర్వాత ప్రభాకర్ రావు అమెరికాలో తలదాచుకున్నాడు. దీంతో సీబీఐకి తెలంగాణ సీఐడీ లేఖ రాసింది. దీనిపై స్పందించిన సీబీఐ.. ఇంటర్‌పోల్ సాయంతో రెడ్ కార్నర్ నోటీసును జారీ చేసింది. అయినప్పటికీ ప్రభాకర్ రావు అమెరికా నుంచి ఇండియాకు రాలేదు. దీంతో ఆయన పాస్‌పోర్టును కూడా సస్పెండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు ప్రభాకర్ రావు విచారణకు రాకుండా దుమ్మాకొడుతూ వచ్చారు. మరోవైపు నాంపల్లి కోర్టు గతంలో ప్రభాకర్ రావుకు నాన్ బెయిలబుల్ వారెంట్ ఇచ్చింది.

దాన్ని తెలంగాణ హైకోర్టులో ప్రభాకర్ రావు సవాల్ చేయగా... అక్కడ కూడా అతడికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. కొద్దిరోజుల క్రితమే ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ తెలంగాణ హైకోర్టులో ప్రభాకర్ రావు పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ హైకోర్టు కూడా ప్రభాకర్ రావుకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు దారులన్నీ మూసుకు పోయాయి. దీంతో కచ్చితంగా పోలీసుల విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంది. ఒకవేళ కోర్టు ఇచ్చిన గడువులోపు విచారణకు ప్రభాకర్ రావు హాజరుకాకపోతే తదుపరి చర్యలు తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## గుజరాత్‌పై లక్నో జట్టు సూపర్ విక్టరీ

### 33 పరుగులతో ఓటమి చవిచూసిన గుజరాత్ టైటాన్స్

**అహ్మదాబాద్, మే 22:** ఐపిఎల్ 18వ సీజన్‌లో 64వ మ్యాచ్ ఆత్యంతం ఆసక్తినిరేకెత్తించింది. లక్నోసూపర్‌జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ మధ్యజరిగిన పోరు ఉత్కంఠభరితంగా సాగింది. చివరివరకూ అదే తీరులో కొనసాగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌చేసిన లక్నోసూపర్‌జెయింట్స్‌నే వరించింది. తొలుత బ్యాటింగ్‌చేపట్టిన లక్నో జట్టు రెండు వికెట్ల నష్టానికి 235 పరుగులుచేస్తే తదనంతరం టార్గెట్ ఛేదనకు వచ్చిన గుజరాత్ టైటాన్స్ తొమ్మిది వికెట్ల నష్టానికిగాను 20 ఓవర్లలో 202 పరుగులుమాత్రమే చేయగలిగింది. దీనితో లక్నోసూపర్‌జెయింట్స్ జట్టు 33 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బానయటింగ్‌చేపట్టిన లక్నో జట్టు ఓపెనర్ మిచెల్‌మార్ష్ 117 పరుగులుచేసిశతకంతో చెలరేగాడు. ఐపిఎల్‌లో తొలిసెంచరీనమోదుచేసిన ఆతడు నికోలస్ పూరన్ 56 పరుగులుచేసినా జతగా మరింత రెచ్చిపోయాడు. రెండో వికెట్‌కు 121 పరుగులుసాధించి లక్నోస్కోరును 200 దాటించాడు. మార్ష్ ఔట్ అయ్యాక కెప్టెన్ రిషబ్‌పంత్ 16 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. దాంతో లక్నో నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 234 పరుగులుచేసి ప్రత్యర్థికి 235 పరుగుల లక్ష్యం విధించింది. అయితే లక్ష్యఛేదనలో గుజరాత్ టైటాన్ వికెట్లు నష్టపోతూ రావడంతో చివరకు 33 పరుగుల తేడాతో లక్నోసూపర్‌జెయింట్స్ విక్టరీ నమోదుచేసింది.

## బిసి గురుకులాల్లో 6,7,8,9 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల పరీక్ష ఫలితాలు విడుదల

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిసి సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న గురుకులాల్లోని 6,7,8,9 తరగతుల బ్యాగ్ లాగ్ సీట్ల ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల గురువారం విడుదల చేశారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందని బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. రేపటి(మే 24) నుంచి భర్తీ ప్రక్రియను కొనసాగించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని బిసి గురుకులాల్లోని 6,7,8,9 తరగతుల బ్యాగ్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశపరీక్షఫలితాలను గురుకుల సొసైటీ అధికారికి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ మార్కుల ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బిసి గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9వ తరగతులలో 6,832 బ్యాగ్‌లాగ్ సీట్లు ఉండగా ఆన్‌లైన్‌లో 23,611 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్షను నిర్వహించారు. అందుకు సంబంధించిన ఫలితాలను గురువారం విడుదల చేశారు. మెరిట్ విద్యార్థులకు ఈనెల 24న కౌన్సిలింగ్ ఉంటుం దని, మెరిట్ వచ్చి, ఎంపిక కాబడిన విద్యార్థులు తమ సర్టిఫికెట్స్ అన్ని సిద్ధం చేసుకోవాలని సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ప్రకటనలో తెలిపారు.

## గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేసిన మహనీయుడు పివి

### కార్యక్రమంలో వక్తల అభిప్రాయం

**హైదరాబాద్ (నాంపల్లి), మే 22, ప్రభాతవార్త :** కేంద్రప్రభుత్వ బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించి గ్రామీణ వ్యవస్థను బలోపేతం చేసిన మహనీయుడు పి.వి.నరసింహారావు అని ముఖ్యఅతిథులు కొనియాడారు. పి.వి.నరసింహా రావు మెమోరియల్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాదంశెట్టి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జూన్ 28న న్యూఢిల్లీలో జరిగే పి.వి.నరసింహారావు మెమోరియల్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమ పోస్టర్, యూట్యూబ్ ఛానల్‌ను గురువారం రాత్రి నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన పి.వి.నరసింహారావు సోదరుడు పి.వి.మనోహర్‌రావు, రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి, మాజీ డిజిపి హెచ్‌జె.దొర, సీనియర్ సంపాదకుడు కొండుభట్ల రామచంద్రమూర్తి, ఆర్టీఏ మాజీ కమిషనర్ విజయబాబు తదితరులు ముందుగా భారత మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి ప్రసంగించారు.

పి.వి చరిత్రను దశదిశలా విస్తరింపజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కివక్కా ణించారు. పీవి జ్ఞాపకా లను, ఆయన చేసిన నిరంతర సేవలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న శిష్యుడు అనిల్‌కుమార్ అభినందనీయుడని వారు ప్రశంసించారు.



పివి చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పిస్తున్న మనోహర్‌రావు, సురేష్‌రెడ్డి, దొర, రామచంద్రమూర్తి, విజయబాబు తదితరులు

ఈ సందర్భంగా అనిల్ కుమార్ పీవి నరసింహారావు స్మారక అవార్డును మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పాయ్‌కి ప్రకటించామని, దానిని బిజెపి జాతీయ మాజీ అధ్యక్షుడు, పద్మ విభూషణ్ డా. మురళీమనోహర్ జోషికి అందజేయనున్నట్లు తెలిపారు.

## 29 నుంచి గ్రూప్-2కు ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

### తెలుగు వర్సిటీలో వెరిఫికేషన్ ప్రక్రియ
### షెడ్యూల్ విడుదల చేసిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రూప్-2 పోస్టులకి ఎంపికైన అభ్యర్థులకి ఈ నెల 29 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించ నున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను జూన్ 10 వరకు కొనసాగించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) ప్రకటించింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ఈనెల 29 నుంచి జూన్ 10 వరకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నాం 1.30 గంటల వరకు.. తిరిగి మధ్యాహ్నాం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగించనున్నారు. సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు టిజిపిఎస్‌సి ప్రకటించింది.

## అంతర్మథనంలో మావోయిస్టు పార్టీ

### దళపతిని కోల్పోయి మరింత దిగాలు
### ఇక చర్చల ప్రసక్తి లేనట్లే..
### ప్రతిదాడులకు వ్యూహాలు

**చర్ల, మే 22, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి దిశానిర్దేశం చేసే పెద్ద దిక్కును కోల్పోవడంతో విషాదంలో మునిగిన కేడర్ కు ఒక వైపు ధైర్యం నూరిపోస్తూ అదును చూసి దాడులు చేసి ప్రతికారం తీర్చుకునే ఆలోచనలో మావోయిస్టు పార్టీ ఉన్నారా..? అంటే అవుననే సమాదానం వినిపిస్తుంది.మావోలకు మరణం తప్ప శరణం అనే మాటే లేదని తాజా ఎన్ కౌంటర్ సందర్భంగా కేంద్రం సుస్పష్టం చేసింది.దీంతో ఇక చర్చల ప్రశక్తే లేదని ఉదాసీనంగా ఉంటే నాలుగు దశాబ్ధాల ఉద్యమానికి నీలినీడలు కమ్ముకొనున్నాయని ఇక ఉపేక్షించ కుండా అదును చూసి ఆచిచూసి తాడోపేడో తేల్చుకోనున్నరా మావోల అలోచన విధానం అంతుపట్టని విధంగా ఉంది. మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంభాల కేశవరావు మృతిని జీర్ణించుకోలేని మావోలు ప్రతి దాడులకు దిగే ఆస్కారం ఉందని ప్రధాని మోడినే బలగాలు అప్రమత్తం గా ఉండాలని సూచించడంతో పాటు కేంద్ర నిఘావర్గాలు సైతం ఇదే అంశంపై హెచ్చరికలు జారీ చెయ్యడంతో దాడులు జరిగే అవకాశం ఉండవచ్చునేది సుస్పష్టం.

#### శరణమా..మరణమా

నాలుగు దశబ్ధాల ఉద్యమ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా గడ్డు పరిస్థితులు ఎదురుకావడంతో మావోయిస్టులను అంతుపట్టడంలేదు. ఎటువంటి చర్చలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్దంగా లేకపోవడంతో ఇక శరణమా..లేక మరణమా అనేది తేల్చుకోనున్నారు...సిద్దాంత పరంగా శరణమనేది వారి హిస్టరీలో లేని అంశం.ఇక దాడులకు దిగితే నాడు ఉన్న పరిస్థితి నేడు లేవనే చెప్పవచ్చును.ఈ క్రమంలో ఏం చెయ్యాలి అన్న ఆలోచనలోనే ఉన్న పరిస్థితి నేడు కనిపిస్తుంది.చెట్టుకొక్కరు పుట్టకొక్కరు ఉన్న నేటి పరిస్థితి లో పార్టీ పొలిట్ బ్యూరో నిర్ణయం తీసుకోవడం కష్టతరంగా మారింది.ముందుగా ఆ పార్టీ దృష్టి పెట్టాల్సిన ప్రధాన అంశం ఏదైనా ఉందంటే పార్టీ చీఫ్‌ను ఎన్నుకోవడమే వారి ముందు ఉన్న ప్రధాన కర్తవ్యం..

#### ఉద్యమానికి చీకటి రోజులు

మావోయిస్టు ఉద్యమానికి చీకటిరోజు అంటు ఏదైనా ఉంది అంటే మాఢ్ ఏరియా లో జరిగిన ఎన్ కౌంటర్ అని చెప్పవచ్చును.ఆ ఎన్ కౌంటర్ 27 మంది మృతిచెందగా అందులో పార్టీ చీఫ్ ఉండటం అత్యంత భాదాకరమైన అంశం డివిజన్ జిల్లా రాష్ట్ర స్థాయి నేతలకే భారీ భద్రత ఉంటుంది.వారిని హతమార్చడమే పెద్ద కష్టంతో కూడిన అంశం..అందులో పార్టీ చీఫ్ నే ఎన్ కౌంటర్ పై భారీ స్కెచ్ జరిగిందని ఊహించవచ్చును..నంబాల కేశవరావును పట్టుకొని హత్యచేసి ఎన్ కౌంటర్ అనే కట్టుకధ అల్లినారు అని ప్రజా సంఘాలు మానవ హక్కుల సంఘాలు ఆరోపించిన మాటల్లో వాస్తవం ఉండే పరిస్థితులు కన్పిస్తున్నాయి...కేశవరావు అనారోగ్యం తో ఒరిస్సాలోని ఓ రహస్య ప్రాంతంలో ఉండి చికిత్సలు నిర్వహిస్తుండగా పట్టుకొని కాల్చి చంపారని అరోపనలు సైతం చేసారు.మావోయిస్టు రహిత భారత్ లక్షంగా ముందుకు సాగుతున్న ఆపరేషన్ లో ఎటువండి ఆరోపనలకు చర్చలకు లొంగకుండా 2026 మార్చి31 పెట్టుకున్న టార్గెట్ పూర్తిచెయ్యాలని లక్షమే ముందున్న కర్తవ్యంగా కనిపిస్తుంది. ప్రభుత్వ విధానం ఈ విధంగా ఉండటంతో మావోలు సైతం ఉద్యమానికి మరింత ఊతం ఇచ్చే అవకాశం ఉండవచ్చని తాజా పరినామాలను పరిశీలిస్తున్న విష్లేషకులు అంచనా వేస్తున్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు అణుగుణంగా మావోయిస్టు పార్టీ సైతం అందుకు సన్నద్దం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి..కాకపోతే నేటి పరిస్థితుల్లో ఆది సాద్యం కాకపొయినా ప్రతి దాడులు తప్పవు అనే స్పస్పష్టం.

#### ఎన్‌కౌంటర్ మృతుల గుర్తింపు

మాడ్ ఏరియా జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టుల గుర్తింపు పక్రియ పూర్తి అయ్యింది.ఈ మేరకు గురువారం పత్రికలకు ప్రకటన విడుదల చేసారు..వారి వివరాలు ఇలా ఉన్నాయి.. నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు (రూ.10కోట్లు రివార్డు.. అన్ని రాష్ట్రాలతో కలిపి), జంగు నవీన్ అలియాస్ మధు (రూ.25లక్షల రివార్డు), సంగీత (రూ.10లక్షల రివార్డు), పాత్ర (రూ.10లక్షలు), రోషన్ అలియాస్ టిప్పు, మహేస్, అనిల్, చందర్ మొడియం (రూ.10లక్షలు), సోమ్లీ అలియాస్ సంజంతిన్, హిడ్మే (రూ.10లక్షలు), యుగేంద్ర అలియాస్ వివేక్ (రూ.8లక్షలు), ఉంగ అలియాస్ నవీన్, గుడ్డ మద్వి, బుచ్చి అకా బసంతి, అకా రామేముచకి (రూ.8లక్షలు), బిమే అలియాస్ భీమ్, మాఏస మద్ది, భర్త లాల్సు ఓర్సా (రూ.8లక్షలు), రవి వాండో (రూ.8లక్షలు), గీతా (రూ.8లక్షలు), జుగో అలియాస్ జమున పొడియం (రూ.8లక్షలు), విజ్జ అకా లాల్సు ఉర్సా హ, చోటి అకా రేష్మా పొడియం (రూ.8లక్షలు), కోసి అలియాస్ క్రాంతి మద్వి (రూ.8లక్షలు), ఈడెమే అకా సాంకి ముచక్ (రూ.8లక్షలు), సూర్య అలియాస్ సంతు తాటి (రూ.8లక్షలు), కోసా అలియాస్ నాగేష్ హోడి (రూ.8లక్షలు), రాజు ఓయం (రూ.8లక్షలు), భద్రు ఒడి (రూ.8లక్షలు), మాండ్కో అలియాస్ సరిత, రాజేష్ తెల్లం అలియాస్ జిల్లా (రూ.8లక్షలు), శ్లోకా అలియాస్ రాగోవేకో (రూ.8లక్షలు), కల్పన అవలం అలియాస్ ఎడో (రూ.8లక్షలు), నందు అలియాస్ నీలేష్ మాండవి (రూ.8లక్షలు), సునీల్ (రూ.8లక్షలు)లు ఉన్నారు.

## మావోయిస్టు కేశవరావు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌తోపాటు ఆపరేషన్ కగార్ ఘటనలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతోపాటు పలువురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. నంబాల ఎన్‌కౌంటర్‌పై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయని, ఈ వయసులో అడివిలో ఉన్నారా? లేదా తీసుకెళ్లి అక్కడ మట్టుపెట్టారా అనే కథనాలు వస్తున్నాయన్నారు. దాంతోపాటు గత కొంతకాలంగా జరుగుతున్న మావోయిస్టుల, ఆదివాసీల ఎన్‌కౌంటర్లపై కూడా విచారణలో చేర్చాలన్నారు. ఆపరేషన్ కగార్ మొదలైన నాటి నుండి ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్ల గురించి విచారణ అంశంలో చేర్చాలని కోరారు. బుధవారం ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు.

# 'వృషభ' ఫస్ట్ లుక్

కంప్లీట్ యాక్టర్ మోహన్‌లాల్ పుట్టిన రోజు సందర్భంగా ఫ్యాన్స్‌కు మంచి ట్రీట్ ఇచ్చారు. మాలీవుడ్‌లోనే కాకుండా ప్యాన్ ఇండియా వైడ్‌గా వస్తున్న క్రేజీ ప్రాజెక్టుల్లో వృషభ చిత్రం ఒకటి. అత్యంత భారీ బడ్జెట్‌తో రాబోతోన్న ఈ చిత్రం నుంచి మోహన్‌లాల్ బర్త్ డే సందర్భంగా అదిరిపోయే పోస్టర్‌ను రిలీజ్ చేశారు. వృషభ నుంచి రిలీజ్ చేసిన ఈ మోషన్ పోస్టర్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. ఇందులో మోహన్‌లాల్ కనిపించిన తీరుకు అంతా ఫిదా అవుతున్నారు. మోహన్‌లాల్ ఆహార్యం, కనిపించిన విధానం, ఆ కత్తి పట్టుకున్న తీరు, జుట్టు ఎగురుతున్న స్టైల్



ఇవన్నీచూస్తుంటే ఇందులో ఉత్తమ యోధుడిలా కనిపించబోతోన్నారని పిస్తోంది. నాఅభిమానులకు బర్త్ డే సందర్భంగా ఈ అప్డేట్‌ను అంకితం చేస్తున్నాను. ఇకపై వారి ఎదురు చూపులకు తెరదించినట్టే.. అందరినీ కట్టి పడేసేలా, అందరినీ ఆకట్టుకునేలా వృషభ చిత్రం ఉంటుంది అని మోహన్‌లాల్ పోస్ట్ వేశారు. కనెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిలిమ్స్ సమర్పణలో నంద కిషోర్ రచన, దర్శకత్వంలో వృషభ రాబోతోంది. యాక్షన్, ఎమోషన్, పౌరాణిక గాథలను అద్భుతంగా మిళితం చేసి ఓ దృశ్య కావ్యంలా సినిమాను రూపొందిస్తున్నారు. మలయాళం, తెలుగులో ఏకకాలంలో చిత్రీకరిస్తున్న ఈ మూవీని అక్టోబర్ 16, 2025న తెలుగు, మలయాళం, హిందీ, తమిళం, కన్నడ అనే ఐదు భాషల్లో విడుదల చేయనున్నారు.

# 'ఏస్' ప్రిరిలీజ్ ఈవెంట్

వెర్సటైల్ యాక్టర్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా ఏస్ అనే చిత్రం మే 23న ఆడియెన్స్ ముందుకు రానుంది. దర్శక, నిర్మాత అరుముగ కుమార్ ఈ మూవీని 7సిఎస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కించారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతికి జోడిగా రుక్మిణి వసంత్ నటించారు. ఈ చిత్రాన్ని మే 23న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమాను శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్ మీద బి. శివ ప్రసాద్ తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రిరిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ సందడి చేసింది. ఈఈవెంట్‌లో శ్రీ పద్మిణి సినిమాస్ అధినేత దర్శక, నిర్మాత బి. శివ ప్రసాద్ మాట్లాడుతూ, ఏస్ సినిమా ఆల్రెడీ బ్లాక్ బస్టర్ హిట్ అయినట్టు కనిపిస్తోంది. అందరి మొహాల్లో సంతోషం ఉంది. ఈ కథ, కారెక్టర్స్ అన్నీ అద్భుతంగా ఉండబోతున్నాయి. విజయ్ సేతుపతి గారు మళ్లీ అందరినీ ఆకట్టుకోబోతున్నారు. ఆయన చాలా మంచి వ్యక్తి. అన్నీ సెట్ అయితే రొమాంటిక్ డాన్స్ అనే సినిమాను ఆయనతో త్వరలోనే ప్రకటిస్తాను. ఏస్ సినిమాగానూ అందరికీ ముందుగానే కంగ్రాట్స్. మే 23న ఈ చిత్రం పెద్ద విజయం సాధించబోతోంది అని అన్నారు. మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి మాట్లాడుతూ, అరుముగ కుమార్ నాకు చాలా ఏళ్ల నుంచి తెలుసు. నాకు సినిమాలో మొదటి చాన్స్ ఇచ్చింది కూడా ఆయనే. మళ్లీ ఇప్పుడు ఆయనతో పని చేస్తుండటం ఆనందంగా ఉంది. ఇందులో యాక్షన్, రొమాన్స్ అన్నీ అంశాలు ఉంటాయి. ఈ చిత్రంలో పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ మూవీ అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. తెలుగు డబ్బింగ్ చాలా బాగా ఉంది. బి.శివ ప్రసాద్ మల్టీ టాలెంటెడ్. ఆయనకు ఆల్ ది బెస్ట్. మే 23న మా సినిమాను అందరూ చూసి సక్సెస్ చేయండి అని అన్నారు. దర్శక, నిర్మాత అరుముగ కుమార్ మాట్లాడుతూ, ఏస్ సినిమాలో అన్ని రకాల అంశాలుంటాయి. యాక్షన్, రొమాన్స్, ఫన్ ఇలా అన్నీ రకాల ఎలిమెంట్స్ ఉంటాయి. ఫుల్ మీల్స్‌లా ఈ చిత్రం ఉంటుంది. అన్ని కమర్షియల్ అంశాలుంటాయి. విజయ్ సేతుపతి ఆల్ రౌండర్. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. మే 23న మా సినిమాను అందరూ చూడండి అని అన్నారు. దివ్యా పిళ్లై మాట్లాడుతూ, ఏస్ చిత్రంలో నటించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన దర్శకుడికి థాంక్స్.




# 'థగ్ లైఫ్' నుంచి సెకండ్ సింగిల్ రిలీజ్



యూనివర్సల్ హీరో కమల్ హాసన్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'థగ్‌లైఫ్‌లోని మ్యూజికల్ యూనివర్స్ మరింత స్వీట్ గా మారింది. మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా మూవీ సింగిల్ "షుగర్ బేబీ" రిలీజ్ అయ్యింది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాట ఆడియన్స్ మనసుల్ని కొల్లగొట్టింది. స్లిజీ చార్మ్‌తో పాటు, అదిరిపోయే వైబ్‌తో ఈ పాట, రిథమ్, అటిట్యూడ్ బ్లెండ్‌తో ఓ బోల్డ్ కాక్‌టెయిల్‌లా ఆకట్టుకుంటోంది. రెహమాన్ సంగీతంమ్యాజికల్‌గా వుంది. సాఫ్ట్, మెలోడిక్ బీట్స్ కట్టిపడేసింది. అలెగ్జాండ్రా జాయ్, శుభ, నకుల్ అభ్యంకర్ వోకల్స్‌తోసాంగ్‌ని మరింత లైవ్లీగా మార్చారు. ఒక్కో సింగర్ వారి స్వంత వాయిస్‌టెక్స్చర్‌తో పాటకు ప్రత్యేకఫ్లేవర్‌ను ఇచ్చారు. ఆనంత శ్రీరామ్ రాసిన సాహిత్యం అదిరిపోయింది. లిరిక్స్ మనసులో నిలిచిపోయేలా వున్నాయి. త్రిషా కృష్ణన్ మెస్మరైజింగ్ బ్యూటీతో కనువిందు చేసింది. ఆమె లుక్స్, గ్రేస్, అన్నీ కలసి తెరపై మ్యాజిక్‌ని సృష్టించాయి. రవికే చంద్రన్ అందించిన విజువల్ ఎస్తెటిక్ టచ్‌తో ప్రతి ఫ్రేమ్ విజువల్ ట్రీట్‌గా కనిపిస్తోంది. రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, ఈ చిత్రం జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.




# 'వైభవం' ప్రిరిలీజ్ వేడుక

తమకు జన్మనిచ్చి, పెంచి పెద్ద చేసి ప్రయోజకుల్ని చేయడమే కాకుండా, కార్పొరేట్ ఉద్యోగాలను వదిలిపెట్టి, సినిమా రంగంలో తమ ఉనికిని చాటుకోవాలన్న తమ తపనను కూడా ప్రోత్సహించిన తమమాతృమూర్తిని సాదరంగా సత్కరించుకున్నారు దర్శకహీరో ద్వయం సాత్విక్ రుత్విక్ విద్యాధికులైన ఈ సోదరుల్లో.. తమ్ముడు సాత్విక్ దర్శకుడిగా అన్నయ్య రుత్విక్ హీరోగా పరిచయమవుతూ, తల్లి రమాదేవి నిర్మాతగా రమాదేవి ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కిన క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ వైభవం ఈ శుక్రవారం (మే 23) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన వైభవం ప్రిరిలీజ్ వేడుకలో తమ మాతృమూర్తి రమాదేవిని సాదరంగా సత్కరించుకున్నారు హీరో రుత్విక్ డైరెక్టర్ సాత్విక్. అంతేకాదు తమ మాతృమూర్తే ముఖ్య అతిథిగా వేడుకను నిర్వహించుకు న్నారు. చిన్నప్పటి నుంచి చదువులో, ఆట పాటల్లో అన్నిటా ముందుండి, మంచి ఉద్యోగాలు సంపాదించుకుని, తనకు ఎనలేని పుత్రోత్సాహం పంచి.. తమ ప్యాషన్ కోసం ఉద్యోగాలు విడిచి పెట్టి వైభవం చిత్రంతో సినిమా రంగ ప్రవేశం చేస్తున్న తన బిడ్డలు ఈ రంగంలోనూవిజయబావుటా ఎగురవేస్తారనే నమ్మకం తనకుందనిఅన్నారు. స్వతహా లాయర్ అయిన రమాదేవి తమ మాతృమూర్తి తమ మీద పెట్టుకున్న నమ్మకంవమ్ముకాదని, వైభవం చిత్రం తమకు సినిమా రంగంలోనూ మంచి ఆరంభం ఇస్తుందని హీరోరుత్విక్, దర్శకుడు సాత్విక్ పేర్కొన్నారు.



# ఆకట్టుకుంటోన్న 'కొత్తలవాడి' టీజర్

రాకింగ్ స్టార్ యష్ గురించి ప్రత్యేకమైన పరిచయం అక్కర్లేదు. ఆయన అమ్మ శ్రీమతి పుష్ప అరుణ్‌కుమార్ ఇప్పుడు నిర్మాతగా మారారు. కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేయటానికి ఆమె పిఎ ప్రొడక్షన్స్ పేరుతో ఆమె చిత్ర నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టారు. కన్నడ చిత్ర పరిశ్రమలో సుప్రసిద్ధ నటుడు డా.రాజ్‌కుమార్, ఆయన సతీమణి పార్వతమ్మ రాజ్‌కుమార్‌ల స్ఫూర్తితో కొత్త బ్యానర్‌ను స్థాపించి కొత్తవారికి అవకాశం ఇవ్వటానికి పుష్ప అరుణ్‌కుమార్ నిర్మాతగా మారారు. పుష్ప అరుణ్ కుమార్ నిర్మాతగా రూపొందించిన తొలి చిత్రం కొత్తలవాడి . టాలెంటెడ్ యాక్టర్ పృథ్వీ అంబార్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమా ప్రామిసింగ్ ఫిల్మ్ మేకర్ సిరాజ్ రచన, దర్శకత్వంలో రూపొందుతోంది. గత నెలలో ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన వచ్చి సినిమాపై అందరిలో ఆసక్తిని రేకెత్తించింది. కొత్తలవాడి సినిమాపై ఉన్న అంచనాలను మరింతగా పెంచుతూ మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌ను గమనిస్తే సినిమా పాత్రల్లోని ఇన్‌టెన్సిటీనీ తెలియజేసేలా ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేశారు. మాస్ అండ్ కమర్షియల్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆకట్టుకుంటోంది. సినిమాటోగ్రాఫర్ కార్తీక్ అందించిన సూపర్బ్ విజువల్స్, అభినందన్ కశ్యప్ కంపోజ్ చేసిన పవర్‌ఫుల్ బ్యాగ్రౌండ్ మ్యూజిక్ ఆడియెన్స్‌ను మెప్పిస్తున్నాయి. కథానాయకుడు పృథ్వీ అంబర్ రగ్డ్, ఎనర్జిటిక్ లుక్ ప్రేక్షకులను ఎంతో ప్రభావవంతంగా మెప్పిస్తోంది. 90 సెకన్ల పాటు ఉన్న ఈ టీజర్ సినిమాపై ఉన్న అంచనాలను మరింతగా పెంచింది. రూటెడ్, పవర్‌ఫుల్ కథతో కొత్తలవాడ్డి సినిమాను మన ముందుకు డైరెక్టర్ సిరాజ్ తీసుకురాబోతున్నారనే విషయం అర్థమవుతుంది. కొత్తలవాడి అనేది కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లాలోని గుండ్లుపేట్ తాలూకులో ఉన్న ఒక గ్రామం పేరు,. అందుకనే ఇక్కడ చిత్రం ఎక్కువ భాగాన్ని చిత్రీకరించారు. సినిమా కథకు సంబంధించిన స్థానికత, దాని మూలాలకు నిజమైన రీతిలో ఉండేలా బృందం స్థానిక యాసను కూడా సంభాషణల్లో ఉపయోగించారు. పృథ్వీ అంబార్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రంలో గోపాల్ దేశ్‌పాండే, రాజేష్ నటరంగ, అవినాష్, కావ్య శైవ, మన్సి సుధీర్, రఘు రమణ కొప్ప, చేతన్ గంధర్వ ఇతర పాత్రల్లో నటించారు. పా ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న కొత్తలవాడి చిత్రం ద్వారా ఇద్దరు కొత్త సంగీత దర్శకులను మేకర్స్ పరిచయం చేస్తున్నారు. వికాష్ వశిష్ట సినిమాలోని పాటలకు సంగీతాన్ని అందిస్తుంటే, అభినందన్ కశ్యప్ బ్యాగ్రౌండ్ స్కోర్‌ను అందిస్తున్నారు. రఘు నీనందల్లి సినిమాకు మాటలు రాశారు. రామిశెట్టి పవన్ ఎడిటర్‌గా, దినేష్ అశోక్ పోస్టర్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు. రా కంటెంట్‌తో తెరకెక్కుతోన్న కొత్తలవాడ్డి చిత్రంలో భావోద్వేగాలు ప్రధానంగా ఉంటాయి. అలాగే ప్రేక్షకులకు కావాల్సిన కమర్షియల్ ఎలిమెంట్స్ సినిమా రూపొందుతోంది.



# 'కలాం' టైటిల్ పోస్టర్ ఆవిష్కరణ

జాతీయ అవార్డు గ్రహీత, మల్టీ టాలెంటెడ్ ధనుష్ మరోసారి తన నటనా ప్రతిభతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యాడు. ఈసారి ధనుష్ భారతదేశ ప్రియతమ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ఆధారంగా రూపొందుతున్న ఒక భారీ బయోపిక్‌లో నటించనున్నాడు. ఈ సినిమా టైటిల్ పోస్టర్ ప్రతిష్ఠాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆవిష్కరించబడింది. ఈ చిత్రానికి కలాం అనే టైటిల్‌తో పాటు "ది మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా" అనే ట్యాగ్‌లైన్ ఫిక్స్ చేశారు. ఈ చిత్రాన్ని తానాజీ: ది అన్‌సంగ్ వారియర్, ఆదిపురుష్ లాంటి విజయవంతమైన చిత్రాల దర్శకుడు ఓం రౌత్ రూపొందిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌ను అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, మరియు టీసిరీస్ ఫిల్మ్స్ బ్యానర్ల కింద అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర, భూషణ్ కుమార్, కృషన్ కుమార్, గుల్షన్ కుమార్, తేజ్ నారాయణ్ అగర్వాల్, నిర్మిస్తున్నారు. డాక్టర్ కలాం జీవితం, భారత అంతరిక్ష, రక్షణ కార్యక్రమాలకు ఆయన చేసిన అమూల్యమైన సేవను ఈ చిత్రం ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆవిష్కరించిన కలాం సినిమా టైటిల్ పోస్టర్ అందరినీ ఆకర్షించింది. డాక్టర్ కలాం యొక్క సిల్హౌట్‌తో పాటు, ఒక మిస్సైల్ చిత్రం ఆవిష్కరణాత్మకంగా రూపొందించబడింది, ఇది ఆయన భారత మిస్సైల్ టెక్నాలజీకి చేసిన కృషిని సూచిస్తుంది. భారతీయ సినిమాలో మోస్ట్ టాలెంటెడ్ నటులలో ఒకరిగా గుర్తింపు పొందిన ధనుష్, డాక్టర్ కలాం పాత్రను పోషించేందుకు చాలా ఫిజికల్ బాడీ ట్రాన్స్ ఫర్ మిషన్ అయ్యాడు. ప్రస్తుతం ఈ చిత్రంలో ధనుష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించినా ఇతర తారాగణం, సాంకేతిక బృందం వివరాలు త్వరలో ప్రకటించబడనున్నాయి. ఈ చిత్రం డాక్టర్ కలాం జీవితాన్ని, ఆయన స్ఫూర్తిదాయకమైన జీవన ప్రయాణాన్ని ప్రపంచానికి చాటి చెప్పే ఒక గొప్ప సినిమాగా రూపొందనుంది.



సాంకేతిక వివరాలు
దర్శకుడు: ఓం రౌత్
నిర్మాతలు: అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర, భూషణ్ కుమార్, కృషన్ కుమార్, బ్యానర్లు: అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్
ప్రెజెంటర్లు: గుల్షన్ కుమార్, తేజ్ నారాయణ్ అగర్వాల్, టీసిరీస్ ఫిల్మ్స్,
పీఆర్ఓ: వంశీ శేఖర్
మార్కెటింగ్: ఫస్ట్‌షో.

# నేడే 'నిశ్శబ్ద ప్రేమ' విడుదల

పలు సూపర్ హిట్ సినిమాలు, వెబ్ సిరీస్‌లతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హీరో శ్రీరామ్. ఆయన నటించిన కొత్త సినిమా నిశ్శబ్ద ప్రేమ. ఈ చిత్రంలో ప్రియాంక తిమ్మేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాను సెలబ్రైట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత కార్తికేయన్.ఎస్ నిర్మించారు. లవ్ అండ్ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా దర్శకుడు రాజ్ దేవ్ రూపొందించారు. నిశ్శబ్ద ప్రేమ సినిమా ఈ నెల 23న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా ట్రైలర్, సాంగ్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్, డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్, నిర్మాత చింతపల్లి రామారావు నిర్మాత రాజేశ్ పుత్ర, డిస్ట్రిబ్యూటర్ సుబ్బారెడ్డి తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ ట్రైలర్ లాంచ్ చేయగా, డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్ సాంగ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్ మాట్లాడుతూ, నిశ్శబ్ద ప్రేమ చిత్రంతో మా పరిటాల రాంబాబు డిస్ట్రిబ్యూటర్‌గా మారడం సంతోషంగా ఉంది. తమిళంలో ఈ సినిమా పెద్ద సక్సెస్ సాధించింది. 50 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు చేసింది. లవ్ రొమాంటిక్ థ్రిల్లర్‌గా తెలుగు ప్రేక్షకుల్ని కూడా ఆకట్టుకుంటుందని నమ్ముతున్నా. హీరో శ్రీరామ్ మరో మంచి మూవీతో మన ముందుకు రాబోతున్నారు. నిశ్శబ్ద ప్రేమ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, నిశ్శబ్దప్రేమ చాలా మంచి టైటిల్. శ్రీరామ్ మన తెలుగు హీరో. ఆయన రోజాపూలు సినిమా అప్పట్లో సెన్సేషనల్ హిట్ అయ్యింది. వయలెన్స్ కంటే సైలెన్స్‌శక్తి ఉన్నది. నిశ్శబ్ద ప్రేమ సినిమాలో ఒక మంచి మూవీకి కావాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి. ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి. అలాగే నిర్మాత కార్తికేయన్ ఫారెన్‌లో జాబ్ చేస్తూ సినిమా మీద ఫ్యాషన్‌తో వచ్చి ఈ సినిమా రూపొందించారు. ఆయన మంచి అభిరుచి గల నిర్మాత అని అర్థమవుతుంది. అటువంటి ఆయన త్వరలో తెలుగులో కూడా సినిమా తీయాలని కోరుకుంటున్నాను.




# 'రానా నాయుడు సీజన్2' పోస్టర్ లాంచ్

హైదరాబాద్‌లో ప్రముఖమైన ప్రసాద్ సినిమాస్ దగ్గర అభిమానులు, ప్రేక్షకులు భారీగా హాజరయ్యారు. అందరిలో ఉత్సాహం ఉరకలేస్తుంది. ఈ ప్రత్యేకమైన వేడుకలకు విలక్షణ నటుడు రానా దగ్గుబాటి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. వెర్సటైల్, డైనమిక్ యాక్టర్ అర్జున్ రాంపాల్ కూడా ఈ వేడుకల్లో భాగమయ్యారు. నెట్‌ఫిక్స్‌లో సూపర్ హిట్ అయిన సిరీస్ రానా నాయుడు సీజన్2 కోసం ఈ ఇద్దరు స్టార్స్ తమదైన స్టైల్‌లో ఎంట్రీ ఇచ్చేసి రానా నాయుడు సీజన్2 భారీ పోస్టర్‌ను విడుదల చేశారు. రానా నాయుడు సీజన్2 కోసం ఫ్యాన్స్ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ సరికొత్త ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయటం విశేషం. జూన్13 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్న రానానాయుడు సీజన్2పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సీజన్ వన్ కంటే సీజన్2 మరింత వైల్డ్‌గా ఉంటుంది అని పేర్కొన్నారు రానా. ఈ సీజన్ మరింత పెద్దదిగా, వ్యక్తిగతంగా ఉంటుంది. రానానాయుడు సీజన్2 కోసం మరోసారి టీమ్‌ను కలవటం చాలా ఆనందంగా ఉంది. పాత్రలు మరింత లోతుగా ఉంటాయి. అవన్నీ గందరగోళంగా అనిపిస్తాయి. అన్నీ విషయాల్లో హద్దులను మరింతగా పెంచాం. మీరు ఇష్టపడిన విషయాలను మరో లెవల్‌కు తీసుకెళ్లాం. మొదటి సీజన్‌కు అభిమానుల నుంచి గొప్ప స్పందన వచ్చింది. ఇప్పుడు సీజన్2కి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను అభిమానుల సమక్షంలో ఎక్స్‌క్లూజివ్‌గా విడుదల చేయటం ఆనందంగా ఉంది. నేను నేను రానా నాయుడుగా నటిస్తే, రవుఫ్ పాత్రలో అర్జున్ రాంపాల్ నటించారు. ఇద్దరం ఢీ అంటే ఢీ అనేలా నటించాం. కానీ హైదరాబాద్‌లో నేను హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాన్న అని రానా తెలిపారు. అర్జున్ రాంపాల్ మాట్లాడుతూ, రవుఫ్ పాత్రకు జీవం పోయటం చాలా కష్టమైంది. అయితే కరణ్ అన్షుమన్ పట్టుదల, అంకితభావంతో అది సాధ్యమైంది. ఆయన పాత్రల్లో అనేక వేరియేషన్స్ చూపిస్తూ చక్కగా రాశారు. దీని వల్ల నా పాత్రను నేను చేయటం చాలా సులభమైంది. చాలా ఎంజాయ్ చేశాను. ఎలాంటి భయం లేని రానా నాయుడుకి ఈ సీజన్‌లో చాలా కష్టాలుంటాయి. పాత్ర పరంగా నేను చాలా కఠినంగా నటించినప్పటికీ షూటింగ్ సమయంలో నేను రానాతో చక్కగా కలిసిపోయాను. తను చాలా మంచి కోస్టార్. తనతో వర్క్ చేయటం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఇక వెంకటేష్ కూడా అలాంటి సరదా వ్యక్తే. సూపర్ టాలెంటెడ్ టీమ్‌తో కలిసి పనిచేశాను. నెట్‌ఫ్లిక్స్‌లో నేను చేసిన మొదటి సిరీస్ కావటంతో చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ఈ సీజన్ గొప్పగా రావటానికి మేకర్స్ ఎంతగానో ఇన్వాల్వ్ అయ్యారు. మంచి ఔట్‌పుట్ రావటం కోసం దోహదపడ్డారు. కరణ్, సుపర్ణ్, అభయ్.. ఇలా ముగ్గురు దర్శకులతో ఒకేసారి పని చేయటం నాకు కూడా మొదటిసారే. ముగ్గురు వేర్వేరు వ్యక్తులైనప్పటికీ వారి ఆలోచనలు, మేకింగ్ సరిగ్గా ఒకటే అన్నట్లున్నాయి. ఇప్పుడు రానా నాయుడు సీజన్2 ఫస్ట్ లుక్‌తో అభిమానులు సంతోషపడుంటారు. జూన్13కి ఎంతో సమయం లేదు. నెట్‌ఫ్లిక్స్‌ను ట్యూన్ చేసుకోండి అన్నారు. రానా దగ్గుబాటి, వెంకటేష్ దగ్గుబాటి, అర్జున్ రాంపాల్, సుర్వీన్ చావ్లా, కృతి కర్బందా, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, డినో మోరియా వంటి తారాగణంతో, రానా నాయుడు సీజన్ 2 ప్రేక్షకులు కోరుకునేడ్రామా, సంఘర్షణ, భావోద్వేగాలతో తుఫాను సందడిని సృష్టించటానికి సిద్ధంగా ఉంది. సుందర్ ఆరోన్ మరియు లోకోమోటివ్ గ్లోబల్ నిర్మించిన ఈ సిరీస్‌ను కరణ్ అన్షుమాన్ క్రియేట్ చేయగా, కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ ఎస్. వర్మ, మరియు అభయ్ చోప్రా దర్శకత్వం వహించారు.



# పుచ్చకాయ గింజలూ మంచివే !



వేసవిలో మండుటెండల నుంచి ఉపశమనం పొందాలంటే పుచ్చకాయకు మించిన పండు మరొకటి లేదు. దాదాపు 95 శాతం నీటిని నింపుకొన్న ఈ సీజనల్ ఫ్రూట్‌లో శరీరానికి చలువనిచ్చే గుణాలు పుష్కలంగా ఉంటాయి. అయితే చాలామంది ఈ పండును తినేటప్పుడు గింజలను పక్కన పడేస్తుంటారు. అయితే ఇలా పుచ్చకాయ గింజలు పడేయడమంటే చేతికందిన పోషకాలను దూరం చేసుకున్నట్లేనని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ప్రొటీన్స్, విటమిన్స్ లాంటి పోషకాలు వీటిలో పుష్కలంగా ఉంటాయని వాపోతున్నారు. పండ్లలోనే కాదు.. గింజల్లోనూ! పుచ్చకాయ పండులో ఉన్న పోషక విలువల్లో ఎక్కువ భాగం వాటి గింజల నుంచే లభిస్తుంది. వీటిలో ప్రొటీన్లు, విటమిన్లతో పాటు మెగ్నీషియం, ఐరన్, పొటాషియం, కాపర్, జింక్, మాంగా ఒమేగా 3, ఒమేగా6 ఫ్యాటీ ఆమ్లాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందించడమే కాకుండా చర్మం, జుట్టు సంరక్షణలోనూ కీలక పాత్ర పోషిస్తాయి.

**చర్మ సంరక్షణకు..** ముఖంపై ముడతలు తొలగిపోయి మిలమిలలాడాలంటే పుచ్చకాయ గింజలను డైట్‌లో చేర్చుకోవాల్సిందే అంటున్నారు నిపుణులు. ఇందులోని మెగ్నీషియం, జింక్, ఇతర ఖనిజ చర్మంలోని విష తుల్యాలను తొలగిస్తాయి. వృద్ధాప్య ఛాయలు రాకుండా అడ్డుపడతాయి. డైరెక్టుగా తీసుకోవడం ఇష్టం లేకపోతే వేయించుకుని తినవచ్చు. ఈ గింజల్లో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది.

**కుదుళ్లు బలంగా..!** చర్మమే కాదు కురుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఎన్నో పోషకాలు పుచ్చకాయ గింజల్లో ఉన్నాయి. జుట్టు పొడవుగా పెరిగేందుకు సహకరిస్తాయి. ఈ గింజల్లోని మాంగనీస్ జుట్టు రాలిపోవడాన్ని బాగా నిరోధిస్తుంది. కురులను మృదువుగా సిల్కీగా మార్చడంలో ఇందులో కాపర్ కీలక పాత్ర పోషిస్తుంది.

**ఎముకల ఆరోగ్యానికి..** సాధారణంగా వయసు పెరిగే కొద్దీ ఎముకలు కూడా బలహీనంగా మారిపోతాయి. చిన్న చిన్న వృత్తి దెబ్బలు తగిలినా చాలా రోజుల పాటు వెంటాడుతుంటాయి. మీరు పుచ్చకాయ గింజలను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చు. ఈ గింజల్లోని మెగ్నీషియం, కాపర్, పొటాషియం వంటి పోషకాలు కుదరలను దృఢంగా మార్చుతాయి.

ఇలా తినవచ్చు సాధారణంగా చాలామంది పుచ్చకాయ గింజలను ఎండబెట్టి తింటారు. ఇలా డైరెక్టుగా తినడం ఇష్టం లేకపోతే వేయించుకుని తినవచ్చు. అదేవిధంగా వీటిని పొడిగా చేసుకుని వివిధ రకాల ఫ్రూట్ సలాడ్స్, సూప్స్, స్మూతీలలో కలుపుకుని కూడా తీసుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

**గుండె పనితీరును..** పుచ్చకాయ గింజల్లో పాలీ అన్ శ్యాచురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి.



ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. ఇక మాంగనీస్ రక్తపోటులో హెచ్చు తగ్గులను నివారిస్తే.. శరీరంలోని వివిధ భాగాలకు రక్తాన్ని చేరవేయడంలో ఐరన్ కీలక పాత్ర పోషిస్తున్న నిపుణులు. ❒

# మహిళల కథలతో 'బుకర్' ప్రైజ్



సమాజంలో మహిళలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇంత, బయట తమకెదురయ్యే అసమానతలు, అవమానాలను జయించేందుకు నిత్యం పోరాటం చేస్తున్నారు. అలాంటి కొందరు మహిళల కథల్ని 'హార్ట్ ల్యాంప్' పేరుతో ఓ పుస్తకంగా తీసుకొచ్చారు కన్నడ రచయిత్రి బానూ ముష్తఖ్. ప్రపంచ పుస్తక ప్రేమికుల మనసుల్ని కదిలించిన ఈ కథ సంపుటికి తాజాగా 'అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ 2025' దక్కింది. 12 లక్షల కథలతో కూడిన ఈ పుస్తకం.. ఈ ప్రతిష్టాత్మక పురస్కారం గెలుచుకున్న తొలి 'షార్ట్ స్టోరీ కలెక్షన్'గా నిలిచింది. దీనితో బాను పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోంది.

మన చుట్టూ రోజూ ఎన్నో సంఘటనలు జరుగుతుంటాయి. వాటిలో కొన్ని మహిళా సమస్యలూ మన దృష్టికి వస్తాయి. అయినా వాటిని చూసి చూడనట్లుగా వదిలేస్తుంటారు చాలామంది. ఇక కొంతమంది వారికి తోచిన విధంగా వారికి సహాయపడే ప్రయత్నం చేస్తారు. కానీ బానూ ఓ కవి హృదయంతో ఆలోచించారు. ఆ మహిళల సమస్యల్నే కథలుగా కూర్చి ఈ ప్రపంచానికి తెలియజేయాలనుకున్నారు. ఇలా తన ఆలోచననే 'హార్ట్ ల్యాంప్' పుస్తకంగా తీసుకొచ్చారామె.

12 చిన్న చిన్న కథలతో కూడిన పుస్తకమిది. దక్షిణ భారతంలోని పితృస్వామ్య వ్యవస్థలో మహిళలు, బాలికల దైనందిన జీవితాలను ఇది ప్రతిబింబిస్తుంది. ఇందులోని ఓ కథలో భాగంగా.. ఓ మహిళ తన సమస్యలతో విసిగిపోయి ఆత్మహత్య చేసుకుంటుంది. కానీ తన కూతురిని ప్రేమగా హత్తుకున్న మరుక్షణం ఆమె తన మనసు మార్చుకుం టుంది. ఇకపై తన కోసం, తన కూతురి కోసం బతకాలని నిర్ణయించుకుంటుంది. ఇక మరో కథలో భాగంగా.. ఓ భర్త తన భార్యకు ప్రేమతో హీల్స్ తీసుకొస్తాడు. వాటిని ధరించి నడవాలని భార్యను కోరతాడు. అయితే ఆమెకు ఇవి ఇష్టమా? కాదా?, తనకు అనుకూలంగా ఉంటాయా? లేదా? అన్న విషయాలేవీ ఆలోచించు. దీనితో పాదాల్లో నొప్పి పుడుతున్నా వాటిని ధరించే నడుస్తుందామె. ఇలా తన భర్త సంతృప్తి కోసం తన సంతోషాన్ని త్యాగం చేస్తుంది. ఇలా ఒకటి కాదు, రెండు కాదు.. మొత్తంగా 12 కథలతో కూడిన సంపుటి ఇది. వంటగది, పూజగది మొదలు పడకగది దాకా... మహిళలు ఇంట్లో ఎదుర్కొంటున్న హింస/ఇతర సమస్యలను కళ్లకు కడుతుందీ పుస్తకం. బాను దీన్ని కన్నడ భాషలో రాయగా.. కర్ణాటకలోని కొడగుకు చెందిన రచయిత్రి, సాహిత్య అనువాదకురాలు దీపా భష్టి ఇంగ్లీషులోకి అనువదించారు.

**అవే నాకు స్ఫూర్తి!** ప్రపంచ సాహిత్య ప్రియులను ఆకట్టుకున్న 'హార్ట్ ల్యాంప్' తాజాగా ప్రతిష్టాత్మక 'అంతర్జాతీయ ప్రైజ్' గెలుచుకుంది. ఇలా లఘు కథలతో కూడిన పుస్తకానికి బుకర్ ప్రైజ్ దక్కడం ఇదే తొలిసారి. కాగా, బాను రచనల్లో ఆంగ్లంలోకి అనువదించిన తొలి పుస్తకం కూడా ఇదే కావాల్సిన విశేషం! ఇలా ఈ ప్రతిష్టాత్మక సాహిత్య పురస్కారం అందుకున్న రెండో భారతీయ రచయిత్రిగా చరిత్ర సృష్టించారు బాను. 'నా ఈ లఘు కథలన్నీ మహిళల చుట్టూనే అల్లుకున్నాయి. కులమతాలు, రాజకీయాలు, సమాజం.. వాళ్ల నోళ్లు నొక్కేసి వారిపై ఎలా ఆధిపత్యం చెలాయిస్తున్నాయో ఈ కథల గురించి ప్రపంచానికి తెలియజేయాల న్నారు. మీడియాలో వచ్చిన ఘటనలు, నా చుట్టూ జరిగే సంఘటనలే నాకు స్ఫూర్తి! ఈ మహిళల బాధ, నిస్సహాయత నన్ను తీవ్ర భావోద్వేగాలకు గురిచేశాయి. ఈ ఎమోషన్స్‌లో పుట్టిందే హార్ట్ ల్యాంప్.. అంటూ తనకు బుకర్ తెచ్చిపెట్టిన పుస్తకం గురించి చెప్పారు బాను.

**నాన్న ప్రోత్సాహంతో...** కర్ణాటకలోని హాస్సన్ పట్టణంలో 1948లో ఓ ముస్లిం కుటుంబంలో పుట్టారు బాను. మొదట ఉర్దూ మీడియంలో విద్యనభ్యసించినా.. తన ఎనిమిదేళ్ల వయసులో కన్నడ భాష బోధించే పాఠశాలలోకి మారారు. ఏ విషయాన్నైనా సరే.. ఇట్టే గ్రహించే నైపుణ్యాలున్న ఆమె.. కేవలం నెల రోజుల్లోనే కన్నడ భాషపై పూర్తి పట్టు పెంచుకున్నారు. కథలు చదవడం, రాయడంలో చిన్నతనం నుంచే మక్కువ చూపిన బాను ఆమె తండ్రి ఇదే దిశగా ప్రోత్సహించారు. స్కూలింగ్ దశలోనే రచనలపై పట్టు పెంచుకున్న ఆమె.. పెళ్లయ్యాక తన మొదటి లఘు కథను రాశారు. అది అక్కడి ఓ ప్రముఖ పత్రికలో ప్రచురితమైంది. తనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. అయినా బాను ఇలా రచనలు చేయడం ఆమె అత్తింటి వారికి నచ్చలేదు. దాంతో ఓ రోజు గొడవ జరిగింది, దాంతో తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఓ సందర్భంలో పంచుకున్నారామె. 'నా ఇష్టానికి వ్యతిరేకంగా, సామాజిక కట్టుబాట్లలో మగ్గిపోవడం నాకు ఇష్టం లేదు. అందుకే ఇంట్లో తరచూ గొడవలు జరిగేవి. అలా ఓ రోజు మా అత్తింటి వారితో పెద్ద గొడవైంది. దాంతో ఆత్మహత్య చేసుకుదామని ఒంటిపై పెట్రోల్ పోసుకున్నా. తృటిలో మా వారొచ్చి ఆపారు. చేతిలో ఉన్న అగ్గిపెట్టె లాక్కొని 'ఎందుకిలా చేస్తున్నావ్?' అనడిగారు. ఆపై నా మనసు తెలుసుకున్న నా భర్త నన్ను రచనల దిశగా ప్రోత్సహిం చారు.. అంటూ అప్పటి సంఘటనను గుర్తు చేసుకున్నారు బాను.



**కత్తిపోటుకు వెరవక..!** విప్లవ భావాలున్న బాను.. తన ఆలోచనల్ని కథలుగా, పుస్తకాలుగా రాయడం. ఈ నేపథ్యంలో ఎక్కువగా మహిళా అంశాలను స్పృశించిన ఆమె.. తన కథలతో మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారు. అంతేకాదు.. పలు ఉద్యమాలు, ర్యాలీల్లో పాల్గొని నిరసన తెలిపారు. 1980లో కర్ణాటకలో కుల, వర్గ వ్యవస్థల్ని విమర్శిస్తూ సాగిన 'బండయ సాహిత్యం' ఉద్యమంలోనూ పాల్గొని తన నిరసన తెలిపారామె. ఈ విధంగా ఓసారి కత్తి పోటుకు గురై.. దాన్నుంచి క్రమంగా కోలుకున్నారు. ఇప్పటివరకు ఆరు లఘుకథలు పుస్తకాలు, ఓ నవల, పలు వ్యాసాలు, కొన్ని కవితలు రాసిన బాను.. తన రచనలతో ఎంతోమంది స్ఫూర్తి రగిలించారు. ఇందుకు గతంలో 'కర్ణాటక సాహిత్య అకాడమీ', 'దాన 'చింతామణి అత్తిమాబే' వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు. ఇక ఇప్పుడు బుకర్ ప్రైజ్‌తో అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక వృత్తిరీత్యా లాయర్ అయిన ఆమెకు మహిళల హక్కుల ఉద్యమకారిణిగానూ పేరుంది.

**రైటర్ ట్రాన్స్‌లేటర్ !** బాను కన్నడలో రాసిన 'హార్ట్ ల్యాంప్' పుస్తకాన్ని ఆంగ్లంలోకి అనువదించి అంతర్జాతీయ సాహిత్య ప్రియులకు దీన్ని చేరువ చేశారు. దీనితో అనువాదం ఆమెకు బుకర్ ప్రైజ్ దక్కింది. ఇలా ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్న తొలి భారతీయ అనువాదకురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు దీప కర్ణాటకలోని కొడగులో పుట్టి పెరిగిన ఆమె.. రచయిత్రిగా, ట్రాన్స్‌లేటర్‌గా పేరు తెచ్చుకున్నారు. ఆమె రాసిన వ్యాసాలు, కథనాలు, పలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ప్రముఖ కన్నడ రైటర్స్ కోట శివరామ కారంత్, కొడగిన గౌరమ్మ రాసిన నవలలెన్నో ఆంగ్లంలోకి అనువదించారు దీప అవి ఆమెకు అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చాయి. బాను రాసిన 'టహార్ట్ ల్యాంప్' పుస్తకాన్ని అనువదించినందుకు గాను బుకర్ ప్రైజ్ కంటే ముందు "PEN Translates" అవార్డు అందుకున్నారు. ❒

# చర్మం, జుట్టు మృదువుగా..



కొంచెం కాఫీ తాగితే ఎంత హాయిగా ఉంటుందో.. కాఫీ ప్రియులు తరచుగా చెప్పే మాట ఇది. మూడ్‌ని ఉల్లాసంగా మార్చే కాఫీ సౌందర్య పోషణలోనూ ఉపకరిస్తుందంటున్నారు నిపుణులు. కాఫీ పొడి/గింజల వల్లఎన్నో సౌందర్యపరమైన ప్రయోజనాలున్నాయని చెబుతున్నారు.

**స్క్రబ్‌గా...** కాఫీపొడి చర్మానికి మంచి స్క్రబ్‌గా పని చేస్తుంది. ఇది చర్మంపై ఉన్న మృతకణాలను సులభంగా తొలగిస్తుంది. ఫలితంగా నిగనిగలాడే మేని మెరుపు సొంతమవుతుంది. ఇందుకోసం స్నానం చేసే సమయంలో కాఫీఫొడిని నేరుగా చర్మంపై రుద్దుకుంటే సరిపోతుంది. స్క్రబింగ్ కోసంకాఫీ గింజలను సైతం వాడచ్చు.

**ముడతలు పడకుండా....** చర్మం ముడతలు పడకుండా యాంటీ ఏజింగ్ క్రీంలను ఉపయోగించడం సహజం. ఈక్రమంలో కాఫీ మంచి యాంటీ ఏజింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. దీనికోసం రెండు కప్పుల కాఫీ గింజలకు ఒక కప్పు నీటిని, కొన్ని చుక్కలు టీట్రీ నూనెను కలపాలి. ఈ మిశ్రమాన్ని బ్లెండర్‌తో బాగాకలిపి, బ్రష్‌తో ముఖానికి రాసుకోవాలి. కాసేపటి తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మిశ్రమం చర్మాన్ని బిగుతుగా మార్చడంతో పాటు చర్మం మీద పేరుకున్న మృతకణాలను కూడా తొలగిస్తుంది.

**కళ్ల విషయంలో...** నిద్ర తక్కువ కావడం, ఒత్తిడికి లోనవడం వల్ల కళ్ల కింద నల్లటి వలయాలు వస్తూ ఉంటాయి. వాటి కోసం సహజమైన ఉత్పత్తులతో పాటు మార్కెట్లో దొరికే వాటిని కూడా వాడుతూ ఉంటాం. ఈ క్రమంలో ఒకసారి కాఫీపొడిని కూడా ప్రయత్నించి చూడచ్చంటున్నారు నిపుణులు. కాఫీలో ఉన్న ఔషధ గుణాలు ఒత్తిడిని తగ్గించడంతో పాటు, నిద్ర లేకపోవడం వల్ల అలసటకు గురైన కళ్లను తిరిగి సాధారణ స్థితిని తీసుకొస్తాయి. అలాగే కళ్ల కింద వచ్చే నల్లటి వలయాలను తగ్గించుకోవడానికి మనం ఉపయోగించే క్రీంలో మెత్తగా ఉండే కాఫీపొడి కొద్ది మొత్తంలో కలిపి రాసుకోవాలి. అయితే ఎప్పుడూ కాఫీ పొడిని నేరుగా మాత్రం కళ్ల కింద రాసుకోకూడదు.

**కురుల ఆరోగ్యాన్ని పెంచేలా...**
జుట్టును సంరక్షించుకోవడానికి మనం అనేక రకాల ఉత్పత్తులను ఉపయోగిస్తుంటాం. మరి కాఫీ వల్ల జుట్టుకి కలిగే ప్రయోజనమేంటి అనుకుంటున్నారా? ఇది మంచి కండిషనర్‌గా పనిచేసి జుట్టును మృదువుగా అయ్యేలా చేస్తుంది. దీని కోసం కాఫీపొడిని నీటిలో వేసి బాగా మరిగించాలి. తర్వాత దీనిని ఒక గిన్నెలోకి వడ పోయాలి. ఈ నీటిని జుట్టుకు అప్లై చేసి ఇరవై నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. కాఫీపొడి జుట్టుకు కలరింగ్ ఏజెంట్‌లా కూడా పనిచేస్తుంది. ❒

## పెరి మెనోపాజ్ ట్రాకర్

మెనోపాజ్.. స్త్రీ పునరుత్పత్తి వయసు అయిపోయిన తర్వాతి దశ. సాధారణంగా మహిళల్లో 47 నుంచి 55 వయసు మధ్య ఈ దశ ప్రారంభమవుతుంది. కానీ ఈ మెనోపాజ్‌కి 5 నుంచి 7 సంవత్సరాల ముందు నుంచే కొన్ని మార్పులు ప్రారంభమవుతాయి. వీటిని గుర్తించడం చాలా కష్టం. ఈ విషయం తెలియక చాలామంది ఆందోళన చెందుతుంటారు. ఇప్పుడు ఈ సమస్యను 'పెరి మెనోపాజ్' ట్రాకింగ్ డివైజ్‌తో సులభంగా గుర్తించవచ్చు. ఈ చిన్న డివైజ్‌ను నడుము భాగంలో అతికించుకుంటే, వెంటనే పెరిమెనోపాజ్ లక్షణాలను తెలుసుకోవచ్చు. దీనిని మొబైల్ యాప్‌తో అనుసంధానం చేసుకొని వాడుకోవచ్చు. ఎపనపటికప్పుడు మెనోపాజ్ లక్షణాలను ట్రాక్ చేస్తూ సమచారం అందిస్తుంది. ❒

## ఊబకాయాన్ని నివారించే యోగర్ట్

అనేక వంటల్లో యోగర్ట్ ఉపయోగిస్తుంటాం. ఇంతకీ యోగర్ట్ రుచికి మాత్రమేనా అంటే కాదు. ఇది మంచి పోషకాహారం. ఇందులో క్యాల్షియం, విటమిన్లు, రైబోఫ్లావిన్, భాస్వరం, మెగ్నీసియం, పొటాషియం విస్తారంగా ఉన్నాయి. ఆరోగ్యనిపుణులు దీన్ని ఇమ్యూనిటీ బూస్టర్ అంటారు. యోగర్ట్‌లో ఎన్ని ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయో చూడండి. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తుంది. ఎముకలను దృఢంగా ఉంచుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా, మృదువుగా ఉంచుతుంది. అరుచి, ఆకలి



మందగించడం లాంటి సమస్యలను నివారిస్తుంది. ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా చేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. కడుపు ఉబ్బరం, డయేరియా, మలబద్ధకం లాంటి సమస్యలను నివారి స్తుంది. ఊబకాయం రానివ్వదు. ❒

## ఎండ నుంచి రక్షగా !

ఎండలు ఎంతలా మండిపోతున్నా మనం బయటకు వెళ్లి తీరాల్సిందే! అలా వెళ్లేటప్పుడు వాటర్ బాటిల్‌ని తీసుకెళ్తున్నారా? అందులో ఉత్తనీరుని కాకుండా ఇవి కూడా జోడించండి. ఎండ నుంచి ఉపశమనంతో పాటు పోషకాలు కూడా అందుతాయి.



★ నీటిని కొద్దిగ తేనె, నిమ్మరసం, దంచిన అల్లం కలిపితే.. శరీరం నుంచి వ్యర్థాలు బయటకు పోవడంతోపాటు వ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలుంటే తొలగిపోతాయి.

★ తరిగిన కీరాదోస ముక్కలు, కచ్చాపచ్చాగా దంచిన పుదీనా ఆకులు కలిపిన నీళ్లు తాగితే ఎండ నుంచి ఉపశమనంతోపాటు, శరీరంలోని మలినాలు బయటకు పోతాయి. బరువు తగ్గడంతోపాటు హైబిపి నుంచి ఉపశమనం ఉంటుంది.

★ సన్నగా తరిగిన ఫైనాపిల్ ముక్కలు, కొబ్బరి ముక్కలు వీటిని నీటికి జోడించి రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచి తెల్లారి తాగి చూడండి. శరీరానికి మేలు చేసే కొవ్వులు అందడంతోపాటు.. ఎండ నుంచి తక్షణ ఉపశమనం కలిగించే ఎలక్ట్రోలైట్లు అందుతాయి.

★ దానిమ్మ గింజలు, దాల్చిన చెక్క వీటిని కలిపి తాగితే బిపి తగ్గి.. వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.

★ సన్నగా చక్రాల్లా తరిగిన ఆరెంజ్ స్లైసులని నీళ్లలో కలిపి తాగితే బరువు తగ్గడంతోపాటు శరీరం ఎక్కువ సేపు తేమగా ఉంటుంది. ❒

## విశ్వమే ఒక మాయ

ఈ సువిశాల విశ్వమే ఒక మాయ. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతూ వుంటుంది. అందుకే ఒక్కోచోట ఒక రకంగా వాతావరణం మారుతూ ఉంటుంది. మనకు పగలు అయినప్పుడు, కొన్ని చోట్ల రాత్రి అవుతుంది. మనకు వర్షం పడితే కొన్నిచోట్ల చల్లని గాలులు విస్తూ ఉంటాయి. ప్రకృతి అంతా ఒకే తీరుగా ఉండదు. ఇలా ఒక వాతావరణం అంటూ ఉండదు. ఈ విశ్వ మాయకు మానవుడు అలవాటు పడుతున్నాడు. జీవన శైలి కూడ ఒక్కో చోట ఒక్కొక్క తీరుగా ఉంటుంది. మన ఆచారాలు, సంప్రదాయాలు ఒక రకంగా ఉంటాయి. పరాయి దేశస్తులవి వేరే విధంగా ఉంటాయి. అయితే చాలా దేశాలలో భారత్‌నే ఇష్టపడుతున్నారు. ఆస్తికులు కావొచ్చు నాస్తికులు కావొచ్చు మారుతున్న కాలానికి అబ్బుర పడవలసిందే. ఆస్తికులు అయితే ఇదంతా దైవలీల అంటారు. నాస్తికులు మాత్రం దీనితో ఏకీభవించరు . ఇది దైవలీల ఎలా అవుతుంది, అంటూ పలు రకాలుగా మాట్లాడుతూ, భూగోళంలో మార్పులు జరుగుతూ ఉంటాయి. సైన్స్ అభివృద్ధి చెందింది అంటూ ఘర్షణకు దిగుతారు. విశ్వం ఒక మాయ అంటే, కాదు అంటారు. ఆకాశంలో మార్పులు, నక్షత్రాలు, చంద్రుడు, సూర్యుడు వగైరా అంతా దైవ కృప అంటూ తమ వాదన సాగిస్తారు ఆస్తికులు. దీనికి ఎంత మాత్రం ఒప్పుపోరు నాస్తికులు. వాదనలు, తర్జన భర్జనలు ఎలా ఉన్నా వాస్తవానికి విశ్వంలో మార్పులు సహజం. ఆ మార్పులు వ్యక్తి జీవన విధానానికి తగ్గట్లుగా మానవుడు నడచుకుంటున్నాడు. నిజానికి ఒక్కో దేశంలో ఒక్కో వాతావరణం ఉన్నప్పుడుమనమే ఇదంతా భగవంతుని లీల అంటూ ఉంటాం. ఆ మాటలు విన్న నాస్తికులు మాత్రం ఇది ప్రకృతి మార్పు అంటారే కాని దైవ లీల అని మాత్రం అనరు. వాళ్ళు ఎంత మాత్రం దైవం అనే మాట ఎత్తరు. మానవుని మేధస్సుతోనే ఇలా జరుగుతోంది. దైవనికి ఇక్కడ స్థానమే లేదు అని ఖరా ఖండిగా చెబుతారు. మానవ శక్తి ముందు దైవ శక్తి ఎందుకు కొరగాదు అంటూ మానవునికే ప్రథమ స్థానం ఇస్తారు. ఆ ప్రథమ స్థానం దైవం ఇచ్చిందే అని ఆస్తికుల భావన. మార్క్స్ చెప్పినట్లు చారిత్రక గతి తార్కిక బౌతిక వాదం ఉంది అనేది వీరి ఆలోచన. ఏది ఏమైనా విశ్వం అనేది ఒక మాయ లోకం అది అందరూ భావించవలసిందే. ఆ మాయ లోకంలో మానవులందరూ పావులు. మాయ లోకానికి అనుగుణంగానే మానవులు నడచుకుంటారు.

- కనుమ ఎల్లారెడ్డి

ఆధ్యాత్మికం

## ఆరోగ్యానికి పండ్ల రసాలు

ఆరోగ్యకరమైన జీవితానికి పునాది పసితనంలోనే పడుతుందంటారు. అయితే ఆ పునాదులను నిర్మించే బాధ్యత మాత్రం తల్లిదండ్రుల చేతుల్లోనే ఉంది. బయట ఎండలు మండుతున్నాయి కొంచెం తాగిస్తే ఏమవుతుందిలే అన్న భావనతో కొంతమంది తల్లిదండ్రులు చిన్న పిల్లలకు కూడా కూల్‌డ్రింక్స్, చక్కెరలు అధికంగా ఉండే పానీయాలు వంటివి ఇస్తుంటారు. కానీ వీటి విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలంటున్నారు నిపుణులు. బాల్యంలో చక్కెర పానీయాలు తాగిన పిల్లలు, భవిష్యత్తులో ఊబకాయం బారిన పడే ప్రమాదం ఉందని స్వాన్సీ యూనివర్సిటీ తాజా పరిశోధనలో వెల్లడైంది. అందుకోసం పరిశోధకులు 14 వేల మంది బ్రిటిసన పిల్లల ఆహారశైలిని పుట్టిన నాటి నుంచి పెద్దయ్యేవరకూ పరిశీలించారు. అందులో సోడా, కూల్‌డ్రింక్‌లు లాంటి పానీయాలు తాగే అలవాటు ఉన్న రెండేళ్లలోపు పిల్లలు 24 ఏళ్లు వచ్చేసనరికి ఊబకాయం బారిన పడానడరట. కెలోరీలు, కొవ్వు, ప్రొటీన్, పంచదారలు ఎక్కువగ ఉండడమే అందుకు కారణం. అయితే, తాజా పండ్ల రసాలను తాగిన పిల్లల్లో ఈ సమస్య లేదట. అంతేకాదు, ఇవి తాగిన పిల్లలు పెద్దయ్యాక కూడా చేపలు, పండ్లు, ఆకుకూరలు తినడం లాంటి మంచి ఆహార నియామాలు అలవరచుకుంటే, ఈ డ్రింగ్స్ తాగిన పిల్లలు బర్గర్లు, పిజ్జాలు, ఫ్రెంచ్ ఫ్రైస్, మాంసం, చాక్లెట్లు, స్వీట్లు వంటివి అధికంగా తినడానికి అలవాటు పడ్డారట. అదే క్రమంలో వారిలో అనేక అనారోగ్యాలకు హేతువైన ఊబకాయానికి దారితీసిందట. అందుకే తొలినాళ్లలోనే పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లు నేర్పించాలి. అవే వారి ఆరోగ్యానికి శ్రీరామరక్ష! ❒



## అందమైన పంచలోహ పట్టీలు




అందెలు,.. ఆడపిల్లలకు రెట్టింపు అందాన్ని తెచ్చిపెడతాయనడంలో సందేహం ఏముంది? ఇవి అమ్మాయిల మనసు దోచుకోవడమే కాదు.. మగవారి గుండెల్లోనూ అలజడి రేపుతుంటాయట. అందుకే కాలి అందియలు ఘల్లుఘల్లుమన రాజహంసలా రావే..గజ్జె ఘల్లుమన్నాదిరో గుండె జల్లుమన్నాదో అంటే సినీ కవులు పట్టాల ప్రత్యేకతను చెప్పకనే చెప్పారు. పట్టీలు, అందియలు, గజ్జెలు..అంటూ ప్రాంతానికో పేరుతో పిలిచే ఇవంటే మగువలకు ఎంతో మురిపెం ఒకప్పుడు పెద్దా, చిన్నా తేడాలేకుండా ప్రతి మహిళా వీటిని ధరించేవారు.





అయితే వీటిల్లో ఎక్కువగా వెండివే కనిపిస్తుంటాయి. ఇవి నాడుల్ని ప్రేరేపితం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయనేది పెద్దల నమ్మకం. బంగారాన్ని ధరించేవారు అరుదుగా ఉన్నా.. ఈ మధ్య కాలంలో అచ్చంగా పసిడిని తలపించేలా పంచలోహాలతో చేసిన పట్టీలకూ ప్రాధాన్యం పెరిగింది. పంచలోహాలంటే బంగారం, వెండి, రాగి, జింక్, ఇనుము అనే ఐదు లోహాల కలయిక. ఇవి





అచ్చంగా పుత్తడిని పోలి ఉండటం, మెరుపై ఎక్కువ కాలంల నిలిచి ఉండటంతోవీటితో చేసిన అందెలకూ ఆదరణ లభిస్తోంది. ❒





# చరిత్ర సృష్టించిన యుఎఇ

## బంగ్లాపై టి20 సిరీస్ విజయం

**న్యూఢిల్లీ:** చారిత్రక ఘట్టానికి షార్జా క్రికెట్ స్టేడియం వేదికైంది. పటిష్టమైన బంగ్లాదేశ్ జట్టును మట్టికరిపించి, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) క్రికెట్ జట్టు తమ మొట్టమొదటి టీ20 అంతర్జాతీయ సిరీస్‌ను కైవసం చేసుకుంది. 3 మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో గెలుచుకుని, యూఏఈ క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ చారిత్రక విజయం యావత్ క్రికెట్ ప్రపంచాన్ని ఆబ్బురపరిచింది. షార్జాలో జరిగిన సిరీస్ నిర్ణయాత్మక మూడో టీ20 మ్యాచ్‌లో యూఏఈ అద్భుతమైన ప్రదర్శనతో బంగ్లాదేశ్‌ను 7 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. ఈ విజయంతో టెస్టు హోదా కలిగిన జట్టుపై ద్వైపాక్షి క టీ20 సిరీస్ గెలిచిన తొలి అసోసియేట్ జట్టుగా యూఏఈ రికార్డు సృష్టించింది. షార్జాలో జరిగిన ఆఖరి మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న యూఏఈ, బంగ్లాదేశ్‌ను కట్టడి చేసింది. యువ ఎడమచేతి వాటం స్పిన్నర్ హైదర్ అలీ (3/7) అద్భుత బౌలింగ్‌తో బంగ్లా టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. తంజిద్ హసన్ (40), జాకర్ అలీ (41) రాణించినప్పటికీ, బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 162 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఇక లక్ష్య ఛేదనలో యూఏఈ ఆత్మవిశ్వాసంతో ఆడింది. కెప్టెన్ ముహమ్మద్ వసీమ్ (ప్లేయర్ ఆఫ్ ది సిరీస్-145 పరుగులు) త్వరగానే ఔటైనా, యువ ఆటగాడు అలీషన్ షరాఫు (68 పరుగులు, 47 బంతుల్లో; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. అతనికి ఆసిఫ్ ఖాన్ (41 పరుగులు) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి అజేయంగా 87 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో యూఏఈ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. అలీషన్ షరాఫుకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. కాగా ఈ సిరీస్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలి టీ20లో బంగ్లాదేశ్ 27 పరుగుల తేడాతో గెలుపొంది సిరీస్‌లో బోణీ కొట్టింది. అయితే, రెండో టీ20లో యూఏఈ సంచలన ప్రదర్శన చేసింది. బంగ్లాదేశ్ నిర్దేశించిన 206 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. ఇది టీ20ల్లో యూఏఈకి అత్యధిక పరుగుల ఛేదన కావడం విశేషం. దీంతో సిరీస్ 1-1తో సమం అయింది.




# జోకోవిచ్ తొలి విజయం

**న్యూఢిల్లీ:** ఎటిపి 250 జెనీవా ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సెర్బియా ప్లేయర్ నోవాక్ జోకోవిచ్ తొలి విజయాన్ని సాధించాడు. ఎటిపి ర్యాంకిగ్స్‌లో 6వ స్థానంలో ఉన్న జోకోవిచ్ ప్రపంచ 134 ర్యాంకర్ ఫుక్సోవిక్స్‌పై ఆధిపత్య విజయంలో ఒక్క బ్రేక్ పాయింట్ కూడా ఎదుర్కోలేదు. గురువారంతో 38 ఏళ్లు నిండిన జనోకోవిచ్ 24 సార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ నిలిచాడు. జెనీవాలోని క్లే కోర్ట్ సీజన్‌లో గురువారం జరిగిన టోర్నమెంట్‌లో రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో జోకోవిచ్ హంగేరీ ఆటగాడు మార్టన్ ఫుక్సోవిక్స్‌ను ఖంగుతినిపించాడు. ఫుక్సోవిక్స్‌పై 6-2, 6-3 తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు.
ఇక గత నెలలో జరిగిన మాడ్రిడ్ మాస్టర్స్‌లో తన తొలి మ్యాచ్‌లో ఇటాలియన్ అర్నాల్డి జోకోవిచ్‌ను బయటకు పంపాడు. మోంటేకార్లోలో జరిగిన తన తొలి మ్యాచ్‌లో అలెజాంద్రో టాబిలో చేతిలో సెర్బియన్ ఓటమి చెందాడు. కాగా అమెరికన్ టాప్ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ కూడా చివరి ఎనిమిది స్థానాన్ని బుక్ చేసుకున్నాడు. ఫ్రెంచ్ ఆటగాడు క్వెంటిన్ హాలిస్‌ను 6-4, 7-6 (7/5) తేడాతో ఓడించాడు.

### మలేసియా మాస్టర్స్‌లో..

# క్వార్టర్ ఫైనల్స్‌కు శ్రీకాంత్

## ఆయుష్, కరుణాకరన్ నిష్క్రమణ

## మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా-ధ్రువ్ విజయం



**న్యూఢిల్లీ:** మలేషియా మాస్టర్స్- 2025 టోర్నీలో భారత్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ దూసుకుపోతున్నాడు. ఈ టోర్నమెంట్‌లో శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్స్ లోకి ప్రవేశించాడు. అయితే ఇదే సమయంలో మరో భారత్ ప్లేయర్లు ఆయుష్ శెట్టి, సతీష్ కరుణాకరన్ టోర్నీ నుండి నిష్క్రమించారు. కౌలాలంపూర్‌లో గురువారం జరిగిన తన రెండో రౌండ్ మ్యాచ్‌లో ఐర్లాండ్‌కు చెందిన నాట్‌న్గుయెన్‌ను భారత్ సీజన్డ్ షట్లర్ ఓడించాడు. ప్రపంచ 33వ ర్యాంక్‌తో 59 నిముషాల పోరాటంలో శ్రీకాంత్ 23-21, 21-17 తేడాతో విజయం సాధించాడు. చాలా కాలంగా ఫామ్‌లో వెనుకబడి ఉండటం వల్ల ప్రస్తుతం ప్రపంచ ర్యాంక్‌లో 65వ స్థానంలో ఉన్న శ్రీకాంత్, చివరి ఎనిమిదవ దశలో ఫ్రాన్స్‌కు చెందిన తోమా జూనియర్ పోపోవ్‌తో తలపడనున్నాడు. కాగా పోపోవ్ మరో భారత్ ఆటగాడు ఆయుష్ శెట్టిని 21-13, 21-17 తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. అలాగే భారత్‌కు చెందిన మరో ప్లేయర్ సతీస్ కరుణాకరన్ కూడా డబుల్స్ భాగస్వామి క్రిస్టో పోపోవ్ చేతిలో 14-21, 16-21 తేడాతో ఓడి టోర్నమెంట్ నుండి నిష్క్రమించాడు.
ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల ద్వయం 21-17, 18-21, 21-15 తేడాతో ఫ్రాన్స్‌కు చెందిన లియా పలెర్మో-జూలియన్ మైయోపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. తదపరి ఈ భరత్ ద్వయం చైనా జంట జియాంగ్ జెన్ బ్యాంగ్-వీయా జిన్‌తో తలపడనున్నారు.

# ఇంగ్లండ్ టూర్‌కు భారత్ జట్టు కన్ఫర్మ్

## కెప్టెన్‌గా ఆయుష్, డిప్యూటీగా అభిజ్ఞాన్

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే అండర్-19 భారత్ జట్టు ఖరారైంది. జూన్ 24 నుండి జూలై 23 వరకూ సుదీర్ఘ కాలం పాటు భారత్ జట్టు ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఈ మేరకు దీనికి సంబంధించి 16 మందితో కూడిన జట్టును భారత్ క్రికెట్ నియంత్రణ మండలికి చెందిన జూనియర్ సెలక్షన్ కమిటీ గురువారం ప్రకటించింది. 5 వన్డేలు, 2 మల్టీ డే మ్యాచ్‌లు ఆడేందుకు సెలక్టర్లు 16 మందితో కూడిన జట్టును ఎంపిక చేశారు. ఇందులో భాగంగా తొలుత 50 ఓవర్ల ఫార్మాట్లో వార్మప్ మ్యాచ్ జరగనుంది. అనంతరం ఐదు మ్యాచ్‌ల యూత్ వన్డే సిరీస్‌కు ఇంగ్లండ్ ఆతిథ్యం ఇవ్వనుంది. తదుపరి ఇరు జట్ల మధ్య రెండు మల్టీ డే మ్యాచ్‌లు జరుగుతాయి.
కాగా ఇంగ్లండ్‌లో పర్యటించే భారత్ జట్టుకు ముంబై ఆటగాడు, చెన్నై సూపర్ కింగ్స్ యువ సంచలనం ఆయుష్ మాత్రే కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అతడికి డిప్యూటీగా అభిజ్ఞాన్ కుందును సెలక్ట్ చేశారు. అలాగే ప్రస్తుత ఐపీఎల్‌లో దుమ్ము రేపిన రాజస్థాన్ రాయల్స్ ప్లేయర్ వైభవ్ సూర్యవంశీకి ఈ జట్టులో చోటు దక్కింది. భారత్ జట్టులో ఆయుష్ మాత్రే (కెప్టెన్), అభిజ్ఞాన్ కుందు (వైస్ కెప్టెన్, వికెట్ కీపర్), హర్‌వన్ష్ సింగ్ (వికెట్ కీపర్), విహాన్ మల్హోత్రా, మౌల్యరాజ్ సింగ్ చావ్డా, రాహుల్ కుమార్, వైభవ్ సూర్యవంశీ, ఆర్ఎస్ అంబరీష్, కనిష్క్ చౌహాన్, జలాన్ పటేల్, హెనిల్ పటేల్, యుధాజిత్ గుహ, ప్రణవ్ రాఘవేంద్ర, మొహ్మద్ ఇనాన్, ఆదిత్య రానా, అన్మోల్‌జిత్ సింగ్, స్టాండ్ బై ప్లేయర్లుగా నమన్ పుష్కక్, దీపేశ్, వేదాంత్ త్రివేది, వికల్ప్ తివారి, అలంకృత్ రాపోలే (వికెట్ కీపర్) ఉన్నారు.



# ఈ స్టార్స్‌కు ఇదే లాస్ట్ ఐపిఎల్

## ఈ సీజన్ తర్వాత రిటైర్మెంట్



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ ( ఐపీఎల్)-2025, సీజను 18 జూన్ 3న ముగుస్తుంది. ఇలాంటి పరిస్థితిలో చాలా మంది స్టార్ ఆటగాళ్ళు టోర్నమెంట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉందని ఊహాగానాలు వస్తున్నాయి. ఈ సంవత్సరం ఐపీఎల్ లీగ్ నుంచి ఏడుగురు క్రికెటర్లు రిటైర్ కావొచ్చని తెలుస్తోంది. ఈ ఏడుగురు క్రికెటర్ల ప్రదర్శన చాలా పేలవంగా ఉంది. దీంతో వచ్చే సీజన్‌కు ముందు ఫ్యాన్స్‌కు బిగ్ షాక్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఈ సీజన్ ఎంఎస్ ధోనికి భారీ పరాజయమే మిగిలింది. ధోని బ్యాటింగ్‌లో బాగా రాణించలేకపోయాడు. అలాగే, కెప్టెన్సీ లో ప్రత్యేకంగా ఏమీ చూపించలేకపోయాడు. ధోని జట్టు ఐపీఎల్ 2025 నుంచి నిష్క్రమించింది. ఇటువంటి పరిస్థితిలో, ఈ సీజన్ ఎంఎస్ ధోనికి చివరి సీజన్ అని, అతను రిటైర్ కావచ్చునని చెబుతున్నారు. అలాగే ఈ సీజన్ కర్ణ్ శర్మకు చాలా చెడ్డది. బౌలింగ్‌లో అతను పెద్దగా మ్యాజిక్ చూపించలేకపోయాడు. కర్ణ్ వయసు 37 సంవత్సరాలు. దేశవాళీ క్రికెట్ ఆడుతున్నాడు. ఇటువంటి పరిస్థితిలో, ఈ సంవత్సరం తర్వాత రిటైర్మెంట్ ప్రకటించే ఛాన్స్ ఉంది. అలాగే డు ప్లెసిస్ ఈ ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడుతున్నాడు. అయితే ఢిల్లీకి ఈ ఆటగాడు పూర్తిగా పరాజయం పాలయ్యాడు. డు ప్లెసిస్ అనేక ఐపీఎల్ జట్ల తరపున ఆడాడు. కానీ ఈ సంవత్సరం అతనికి ఏమాత్రం కలిసిరాలేదు. ఇక ఐపీఎల్ 2025 సీజన్ ఇషాంత్ శర్మకు అంత ప్రత్యేకమైనది కాదు. అతనికి అవకాశం వచ్చిన మ్యాచ్‌లలో దారుణంగా విఫలమయ్యాడు. ఇషాంత్‌ను టీం ఇండియా నుంచి కూడా తొలగించారు. ఇటువంటి పరిస్థితిలో, అతను ఇప్పుడు పదవీ విరమణ చేయవచ్చు అని తెలుస్తోంది. మోయిన్ అలీ మోయిన్ అలీ కేకేఆర్ తరపున ఆడాడు. కానీ, అతను విఫలమయ్యాడు. అలీ ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేదు. ఆడిన మ్యాచ్‌ల్లో ఈ ఇంగ్లాండ్ స్పిన్నర్ అద్భుతాలు చేస్తాడని భావించారు, కానీ అది జరగలేదు. ఇది అలీకి చివరి సీజన్ కావొచ్చని అంతా భావిస్తున్నారు. ఆర్ అశ్విన్ పదవీ విరమణ చేసిన సంగతి తెలిసిందే. అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ సంవత్సరం అశ్విన్ చెన్నై జట్టులో చోటు దక్కించుకున్నాడు. కానీ, అతను ప్రత్యేకంగా ఏమీ చేయలేకపోయాడు. ఎక్కువ మ్యాచ్‌లు ఆడే అవకాశం కూడా రాలేదు. ఇటువంటి పరిస్థితిలో, అశ్విన్ ఇప్పుడు ఐపీఎల్ నుంచి రిటైర్ కావొచ్చు. అజింక్య రహానే కోల్‌కతా నైట్ రైడర్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. రహానే కెప్టెన్సీ, బ్యాటింగ్‌లో బాగా రాణించాడు. కానీ అతని జట్టు ఎలిమినేట్ అయింది. కోల్‌కతా నైట్ రైడర్స్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా నిలిచింది. ఇటువంటి పరిస్థితిలో, రహానే టీం ఇండియాకు తిరిగి రావడం కష్టమే. కానీ, అతను ఐపీఎల్ నుంచి కూడా నిష్క్రమించవచ్చని కూడా చెబుతున్నారు.

# వాణిజ్యం

# భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 22:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. వరుస నష్టాల తర్వాత బుధవారం లాభాలు చవిచూసినసూచీలు.. గురువారం మరోసారి నష్టాల బాట పట్టాయి. రిలయన్స్, ఐటీసీ, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ దాదాపు 1100 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 24,500 పాయింట్ల దిగువకు చేరింది. ట్రేడింగ్ చివర్లో కొన్ని రంగాల్లో కొనుగోళ్ల మద్దతు సూచీలను కొంత మేర కోలుకున్నట్టు చేసింది.అయితే ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్ మాత్రమే పాజిటివ్ ముగిసిన షేర్లుగా నిలిచాయి. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు కోలుకోవడం ఊరటనిచ్చే అంశం. దిగుమతి ఆధారిత కంపెనీలపై ఇది ప్రతికూల ప్రభావం చూపవచ్చని నిపుణులు భావిస్తున్నారు. సెన్సెక్స్ ఉదయం 81,323.05 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లో కదలాడిన సూచి ఇంట్రాడేలో 80,489.92 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 644.64 పాయింట్ల నష్టంతో 80,951.99 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 203.75 పాయింట్ల నష్టంతో 24,609.70 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 42 పైసలు క్షీణించి 86.01గా ఉంది. ఇండస్ ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్ మినహా మిగిలిన అన్ని షేర్లు నష్టాల్లో ముగిశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63.99 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3305 డాలర్ల వద్ద కొనసాగింది. కానీ, మూలధన మద్దతు ఉన్న రంగాల్లో నెమ్మదిగా రికవరీ ఉండొచ్చని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగాలు కీలకం.



# జానీ ఐవ్ 'ఐఓ'ను ఓపెన్ ఎఐ కొనుగోలు!

**వాషింగ్టన్, మే 22:** చాట్‌జీపీటీ మాతృ సంస్థ ఓపెన్‌ఏఐ (ఓపెన్ ఎఐ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) హార్డ్‌వేర్‌లను రూపొందించేందుకు సిద్ధమవుతోంది.అందులో భాగంగానే ఆపిల్ సంస్థ మాజీ డిజైనర్ జానీ ఐవ్ స్థాపించిన ఏఐ డివైజ్ స్టార్టప్ ఐఓను కొనుగోలు చేసింది. దీనికోసం 6.5 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఈ కొనుగోలు ద్వారా చాట్‌జీ పీటీ సాంకేతికతను ఉపయోగించి వినూత్న హార్డ్‌వేర్ ఉత్పత్తులను రూపొందించనుంది. ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్‌బుక్ వంటి ఆపిల్ ఉత్పత్తుల డిజైన్‌లో జానీ ఐవ్ కీలకపాత్ర పోషించారు. ఆయన స్థాపించిన స్టార్టప్‌యే ఐఓ. ఇది ఏఐ ఆధారిత హార్డ్‌వేర్ ఉత్పత్తుల అభివృద్ధిపై పనిచేస్తోంది. ఈసంస్థ కొనుగోలుతో ఓపెన్ ఏఐ హార్డ్‌వేర్ రంగంలో బలమైన పోటీదారుగా నిలవనుంది. అయితే ఎలాంటి హార్డ్‌వేర్‌ను రూపొందించబోతున్నారనే విషయంపై కంపెనీ స్పష్టత ఇవ్వలేదు. తాజా కొనుగోలుపై ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్‌ఆల్ట్‌మన్ స్పందించారు. ఇప్పటివరకు కంపెనీ చేసిన అతిపెద్ద చర్యగా అభివర్ణించారు. దీంతో ఓపెన్‌ఏఐ విలువ లక్ష కోట్ల డాలర్ల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఐఓ విభాగానికి ఓపెన్‌ఏఐ ఎగ్జిక్యూటివ్ పీటర్ వెలిండర్ నాయకత్వం వహించనున్నారు. ఈ కొనుగోలు కోసం ఓపెన్ ఏఐ 5 బిలియన్ డాలర్లను ఈక్విటీ రూపంలో చెల్లిస్తోంది. గతంలో ఐఓలో ఓపెన్‌ఏఐ 23 శాతం వాటా కలిగిఉండగా, తాజా నిర్ణయంతో కంపెనీ పూర్తి యాజమాన్యాన్ని సొంతం చేసుకుంది.



# త్వరలోనే ఎన్ఎస్ఇ ఐపిఒ!

**ముంబై, మే 22:** ఇన్వెస్టర్లు చాలా కాలంగా ఎదురుచూస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ ఐపిఒ) పబ్లిక్ ఇష్యూకి మార్గం సుగమం కానున్నట్లు తెలుస్తోంది. మార్కెట్ నియంత్రణ సంస్థ నుంచి త్వరలోనే గ్రీన్ సిగ్నల్ పొందే అవకాశం ఉందని సెబి ఛైర్మన్ తుహిన్ కాంత పాండే స్వయంగా తెలిపారు. ఎన్ఎస్ఈ ఐపీఓకు సంబంధించిన అన్ని పెండింగ్ సమస్యలు త్వరలోనే తొలగనున్నాయన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సెబి చీఫ్ ఎన్ఎస్ఈ ఐపీఓ గురించి ప్రస్తావించారు. త్వరలోనే అన్ని అవాంతరాలు దాటుకొని ఎన్ఎస్ఈ ఐపీఓకు వస్తుందని తెలిపారు. అయితే ఎప్పటిలోగా ఈ సమస్యలు పరిష్కారమవుతాయనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. రెగ్యులేటరీ ఆందోళన నేపథ్యంలో ఎన్ఎస్ఈ ఐపీఓ ప్రతిపాదన గత ఎనిమిదేళ్లకు పైగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి వద్దనే పెండింగ్‌లో ఉంది. సిబ్బందికి ఇచ్చే పరిహారం, క్లియరింగ్ కార్పొరేషన్‌లో యాజమాన్యం, టెక్నాలజీ వంటి అనేక అంశాలపై సెబి పలు ప్రశ్నలు సంధించింది. దీని కారణంగా ఐపీఓ రాక ఆలస్యం అవుతూనే వస్తోంది. అయితే తాజాగా ఎన్ఎస్ఈ తన లిస్టింగ్ ప్రక్రియను పునఃప్రారంభించింది. సెబి వద్ద నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసి) కోసం దరఖాస్తు చేసింది. ఎన్ఎస్ఈ 2016 నుంచి ఐపీఓకు రావాలని చూస్తోంది. రెగ్యులేటరీ ఆందోళనల కారణంగా ఈ ప్రక్రియ ఆలస్యం అవుతూ వస్తోంది. 2019లో ఒకసారి, 2020లో రెండు సార్లు, 2024 ఆగస్టులో కూడా ఐపీఓ కోసం అభ్యర్థనలు చేసింది. ఇలా ఐపీఓ ప్రతిపాదన సెబి వద్ద ఎనిమిది సంవత్సరాలకు పైగా నిలిచిపోయింది. ఇదిలా ఉండగా, 2024 బుర్గండీ ప్రైవేట్ హురూన్ ఇండియా 500 జాబితా ప్రకారం, ఎన్ఎస్ఈ విలువ సుమారు రూ.4.7 లక్షల కోట్లుగా ఉంది. దీంతో భారత్‌లోనే 10వ అత్యంత విలువైన ప్రైవేటు కంపెనీగా నిలిచింది. ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజీలు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలు తరచుగా కాంట్రాక్ట్‌ల గడువును మార్చుకుంటున్న విషయం తెలిసిందే. తాజాగా ఎన్ఎస్ఈ ప్రస్తుతం ఉన్న గురువారంగా ఉన్న కాంట్రాక్ట్ ఎక్స్‌పైరీని మంగళవారానికి మార్చాలని సెబీని కోరినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ కాంట్రాక్ట్ ఎక్స్‌పైరీలపై ఈ నెలలోపు సెబి మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు సమాచారం. ఈ వార్తల నేపథ్యంలో గురువారం మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈ షేర్లు 3 శాతం మేర నష్టపోయాయి.




# తయారీ రంగంలో భారత్ ముందడుగు

**న్యూఢిల్లీ, మే 22:** తయారీ రంగంలో భారత్ ఎంతో పురోగతి సాధించిందని, అంతర్జాతీయ ఇన్వెస్టర్లకు ఎంతో ఆకర్షణీయంగా మార్చిందని ఎస్అండ్‌పి గ్లోబల్ పేర్కొంది. అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రస్తుతం జరుగుతున్న మార్పులు దీర్ఘకాలంలో భారత్‌కు ప్రయోజనం కలిగిస్తాయని అభిప్రాయపడింది. అభివృద్ధి చెందుతున్న పరిణామాలు, వాణిజ్య సవాల్లకు అనుగుణంగా ఆర్థిక వ్యవస్థలు మారుతున్నందున ఈ అవకాశాన్ని భారత్ సద్వినియోగం చేసుకుని తన తయారీ వృద్ధిని వేగవంతం చేసుకోగలదని, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థతో మరింత బలంగా అనుసంధానం కాగలదని ఈ నివేదిక అంచనా వేసింది. స్థానికంగానే విడిభాగాల సమీకరణ, తుది మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా ఉండడం, ప్రాంతీయ అనుసంధానత పెంచుకోవడం ద్వారా భారత్ తయారీ రంగం మరిన్ని అదనపు పెట్టుబడులను ఆకర్షించొచ్చని సూచించింది. భారత్ అత్యాధునిక టెక్నాలజీ సామర్థ్యాలు, తయారీ పోటీతత్వాన్ని పెంచుకోవడం ద్వారా తయారీలో అదనపు ఉపాధి అవకాశాలను కల్పించొచ్చని పేర్కొంది. సరఫరా వ్యవస్థ వైవిధ్యంలో భాగంగా మధ్యకాలం నుంచి దీర్ఘకాలంలో భారత్‌కు ప్రయోజనం లభిస్తుందని వివరించింది. 2024-25లో భారత జిడిపి వృద్ధి నిదానించినప్పటికీ ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉన్నట్లు గుర్తు చేసింది. భారత వృద్ధిలో ఎగుమతులపై ఆధారపడడం మోస్తరుగానే ఉన్నట్లు తెలిపింది. ఈ సానుకూలత వల్లే అంతర్జాతీయ వాణిజ్యం, టారిఫ్ విధానాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న మార్పుల ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండబోదని పేర్కొంది. భారత స్థూల జిడిపిలో తయారీ విలువ 17.2 శాతంగా ఉన్నట్లు తెలిపింది. ఇటీవలి తయారీ పిఎంఐ గణాంకాలు పటిష్ఠంగా ఉండడాన్ని ప్రస్తావించింది.



# చమురుకు పెరిగిన డిమాండ్

**న్యూఢిల్లీ, మే 22:** దేశీయంగా చమురు వినియోగం వచ్చే దశాబ్ద కాలం పాటు గణనీయంగా పెరగనుంది. వార్షికంగా 4శాతం చొప్పున వృద్ధి చెందనుంది. ఎస్అండ్‌పి గ్లోబల్‌లో కమోడిటీ ఇన్‌సైట్స్ ఈ మేరకు అంచనాలు వెలువరించింది. దీని ప్రకారం 2025లో ఇప్పటి వరకు ఆయిల్ వినియోగం రోజుకు 4.8మిలియన్ బ్యారెళ్లుగా ఉంది. గతేడాది ఇదే వ్యవధితో పోలీస్తే 4.3శాతం పెరిగింది. చమురు ఎగుమతి దేశాల నుంచి సరఫరా పెరగడం, అంతర్జాతీయంగా డిమాండ్ కాస్త మందగించడం వంటి అంశాల కారణంగా ఈ యేడాది చమురు రేట్లు కొంత నెమ్మదించినట్లు సంస్థ హెచ్ ఆఫ్ ఇండియా కంటెంట్ (క్రాస్ కమోడిటీస్) పులకిత్ అగర్వాల్ తెలిపారు. మెరుగైన ఆర్థిక వృద్ధి వంటి సానుకూలాంశాలతో భారత్‌లో ఆయిల్‌కు డిమాండ్ పెరుగుతోందన్నారు. అంతర్జాతీయంగా భారత్‌కి మరింత ప్రాధాన్యం లభిస్తోందని వివరించారు. రష్యా నుంచి వరుసగా నాలుగో యేడాది కూడా నిరాటంకంగా సరఫరా కొనసాగుతున్న నేపథ్యంలో ముడి చమురు కొనుగోళ్లకు మనకు మరిన్ని వనరులు అందుబాటులో ఉంటున్నాయని పేర్కొన్నారు. పర్యావరణహిత ఇంధనాల వ్యయాలు ఎంత తక్కువగా ఉంటే అంత వేగంగా వాటి వైపు మళ్లడం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరి జోహార్ చెప్పారు. ఈ విషయంలో వివిధ టెక్నాలజీలను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రభుత్వ విధానాలు, నియంత్రణ సంస్థల నిబంధనలు, కార్పొరేట్ల చొరవ మొదలైన అంశాలన్నీ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అయితే హరిత ఇంధనాల వైపు మళ్లినంత మాత్రాన పాత ఇంధనాల వినియోగం పూర్తిగా నిలిచిపోతుందడానికి లేదని తెలిపారు. బొగ్గు నుంచి చమురుకు మారినప్పటికీ ప్రపంచంలో బొగ్గు వినియోగం ఆగిపోలేదన్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.